నమస్తే తెలంగాణ
తాజా వార్తలు,
ఈ పేపర్ కోసం
ntnews.com
చూడండి.

మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ
జిల్లా
టాబ్లాయిడ్
వార్తల కోసం
10, 11పేజీలు
చూడండి.

బుధవారం 8.4.2020 • సంపుటి 9 • సంచిక 284 • వెల. రూ. 6.50
కరీంనగర్ పేజీలు : 12
పూర్ణిమ
సూర్యోదయం: 6.03, సూర్యాస్తమయం: 6.26, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బుధవారం శుక్లపక్షం పూర్ణిమ ఉదయం 8.05 వరకు, తదుపరి కృష్ణపక్షం పాడ్యమి గురువారం తె.జా. 4.14 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: హస్త ఉదయం 6.07 వరకు, తదుపరి చిత్త తె.జా. 3.03 వరకు, అమృతఘడియలు: రాత్రి 9.27 నుంచి 10.52 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.15 నుంచి 1.48 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.50 నుంచి మధ్యాహ్నం 12.40 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 1.05 నుంచి 2.30 వరకు.
PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline



ముఖ్యమంత్రి సహాయనిధికి కోటి రూపాయల విరాళం చెక్కును మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎం కే చంద్రశేఖర్‌రావుకు అందజేస్తున్న జీఎమ్మార్ గ్రూప్ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి గంగుల కమలాకర్ కూడా ఉన్నారు

# వ్యాప్తి నిరోధంతోనే విముక్తి

- మూడు దశల్లో వైరస్‌ను ఎదుర్కొనే వ్యూహం
- ఆర్థిక అంశాలకంటే.. ప్రజల ప్రాణాలే ముఖ్యం
- పరిస్థితి చేయిదాటితే.. మనల్ని మనం క్షమించుకోలేం
- జాతీయ మీడియాతో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైరస్ వ్యాప్తిని నిరోధించడంతోనే కరోనా నుంచి విముక్తి లభిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు అన్నారు. మూడు దశల్లో కరోనా వైరస్‌ను ఎదుర్కొనే వ్యూహంతో తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాల కన్నా ఆర్థిక అంశాలు ముఖ్యం కాదని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగాఉంటే ఇప్పటికంటే ఎక్కువ కష్టపడి ప్రగతి సాధించవచ్చన్నారు. జూన్ మొదటివారానికి దేశంలో కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉంటుందని వెల్లడవుతున్న పలు నివేదికల మేరకు.. దాన్ని ఎదుర్కోవడానికి లాక్‌డౌన్ పొడిగింపే సరైందనుకొంటే.. అందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కరోనా

మిగతా 3వ పేజీలో



గచ్చిబౌలి స్టేడియంలో సిద్ధం చేస్తున్న క్వారంటైన్ గదిని సందర్శించిన మంత్రులు కే తారకరామారావు, ఈటల రాజేందర్

## నగరం నిర్మానుష్యమైన వేళ

రోడ్లపై జనంలేరు.. వారిని తీసుకెళ్లే వాహనాల్లేవు.. అవి సృష్టించే కాలుష్య పొగమేఘాల్లేవు! పార్కుల్లో పిల్లల సందడిలేదు.. పర్యాటక ప్రదేశాలకు విదేశీ అతిథుల పలకరింపుల్లేవు! హైదరాబాద్‌కు నవ మణిమాణిక్యంలా భాసిల్లుతున్న మెట్రో మౌనందాల్చింది.. నగరాన్ని తనలో పొదువుకున్న ఔటర్ రింగురోడ్డు వెలవెలబోతున్నది.. యావత్‌దేశానికి అనుసంధానకర్తగా ఉన్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ విశ్రాంత స్థితి అనుభవిస్తున్నది! బయటికొస్తే కరోనా కాటు తప్పదన్న భయం.. అణువణువు ఆవరించి ఉన్నవేళ.. శతాబ్దాల చరిత్రకలిగిన నగరం నిర్మానుష్యం! రాత్రిపూట కూడా నిద్రపోని షెహర్‌లో పట్టపగలు మనిషి కనిపించనివైనం. ప్రభుత్వ సూచనమేరకు ఫిల్మ్‌మేకర్ దూలం సత్యనారాయణ డ్రోన్ కెమెరా తీసిన చిత్రాలివి..



నార్సింగి జంక్షన్ డ్రోన్ వ్యూ



# 100 రోజుల విలయం

చావే ఉండకూడదని వరం పొందిన గజాసురుడిలా, సాచే కోరలతో సమస్తాన్ని చుట్టుముట్టే వృత్రాసురుడిలా, తన నెత్తుటి చుక్క పడిన ప్రతి చోటా పదివేల రక్కసులై విస్తరించే రక్తబీజుడిలా, గాలినే విషపు గత్తరగా మార్చి ఏమార్చే ధూమ్రాక్షుడిలా... కరోనా! మొత్తం భూ మండలాన్ని చాపచుట్టి చంకనబెట్టుకున్న హిరణ్యాక్షుడిలా ప్రపంచాన్ని చుట్టుముట్టింది. దేశదేశాలను ఆవరించి, ఆవహించింది. కరోనా రక్కసి జాడ పట్టి నేటికి సరిగ్గా వంద రోజులు. విశ్వ మానవుడి ఊపిరిలో హాలాహలాన్ని, గొంతులో హాహాకారాన్ని నింపిన కరోనా విలయ తాండవానికి యావత్తు జగత్తూ అల్లకల్లోలం. లక్షల్లో వ్యాధిగ్రస్తులు. 81 వేల మంది అకాల మరణం. మనకు తాను కనిపించకుండా, మనిషికి మనిషిని శత్రువుగా మారుస్తున్న మాయావి అది! మానవాళి దూరందూరంగా నిలబడి, కలబడితే తప్ప రణాన్ని గెలువలేని తరుణమిది. చేతులు కలపకుండా ఛేదిస్తే తప్ప బద్దలు కాని శృంఖలమిది!



**2019 DEC 31**
సార్స్‌ను పోలిన లక్షణాలతో చైనాలోని వుహాన్ నగరంలో ఓ వైరస్ వ్యాపిస్తున్నదన్న వార్త వెలుగులోకి.

**2020 April 7**
ప్రపంచవ్యాప్తంగా మొత్తం కరోనా కేసులు 14,10,483

## తెలంగాణలో మరో 40 కేసులు

మొత్తం పాజిటివ్ 404.. 45 మంది డిశ్చార్జి

348 మందికి ఐసొలేషన్‌లో చికిత్స

| దేశం | కేసులు | మృతులు | ఒక్కరోజులో |
|---|---|---|---|
| అమెరికా | 3,86,239 | 12,249 | +1,378 |
| స్పెయిన్ | 1,40,511 | 13,897 | +556 |
| ఇటలీ | 1,35,586 | 17,127 | +604 |
| జర్మనీ | 106,739 | 1,942 | +132 |
| ఫ్రాన్స్ | 1,09,069 | 10,328 | +1,417 |

## రోగులు 14 లక్షలు.. మృతులు 81 వేలు

### అమెరికా, ఐరోపాలో తాండవం.. ఐసీయూలో బ్రిటన్ ప్రధాని

రెండో ప్రపంచయుద్ధం తరువాత మొదటిసారిగా మానవాళిని గడగడలాడిస్తున్న అతిపెద్ద సంక్షోభం కరోనా. చిన్నా, పెద్ద అన్న వివక్ష చూపకుండా, పేద, ధనిక అన్న తారతమ్యం లేకుండా ప్రపంచ దేశాలన్నింటిపై ఏకధాటిగా దాడి చేస్తున్న మహమ్మారి ఈ కరోనా. దీనిని రాకుండా ఆపే వ్యాక్సిన్ లేదు.. వచ్చిన తరువాత చికిత్స చేసేందుకు ఔషధమూ లేదు. రోజూ వేల సంఖ్యలో ప్రాణాలను బలిగొంటూ మారణహోమం సృష్టిస్తున్న ఈ మహమ్మారిని గుర్తించి నేటికి వంద రోజులవుతున్నది. చైనాలోని వుహాన్ నగరంలో పుట్టిన ఈ అంటు వ్యాధి నేడు భూమండలమంతటా విస్తరించింది. ఏకకాలంలో అనేక మందికి ముప్పుగా ఈ వ్యాధి పరిణమించడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని 'మహమ్మారి'గా

మిగతా 2వ పేజీలో

## ట్రక్కుల్లోనే శవాల గుట్టలు

- ఖననానికి చోటులేక ఎదురుచూపులు
- న్యూయార్క్‌కు శాపంగా జనసాంద్రత
- మృత్యువుకు బాటలు వేసిన నిర్లక్ష్యం

5

# ఎవరికెవరు ఈ లోకంలో..

## బంధువులున్నా.. బలగమున్నా.. పాడె మోసేందుకు మిగిలింది ఆ నలుగురే

- అంత్యక్రియలకు పదిమందైనా రానిస్థితి
- కరోనాతో 'కాటికాడ' మారిన పరిస్థితులు..
- దింపుడు కల్లమూ లేదు చివరి బియ్యమూ లేవు
- నేరుగా శ్మశానానికే వెళ్తున్న మృతదేహాలు
- దుఃఖాన్ని దిగమింగి ఉత్తరక్రియల నిర్వహణ
- ఆపద సమయంలో ధైర్యం కోల్పోని జనం

హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలోని ఒక గ్రామం. 85 సంవత్సరాల పండు ముదుసలి అనారోగ్యంతో కన్నుమూసింది. ఆ తల్లికి ఉత్తరక్రియలు నిర్వహించడానికి కన్నకొడుకు నగరం నుంచి నానా తిప్పలు పడుతూ ఊరికి చేరుకొన్నాడు. ఆ అమ్మను సాగనంపడానికి అతని నలుగురు కుటుంబ సభ్యులు తప్ప ఎవ్వరూ లేరు. రాలేదు. కనీసం పాడె కట్టి మోసేందుకు కూడా నలుగురంటే నలుగురు లేకుండాపోయారు. చివరకు తనే ఎలాగోలా ఒక ట్రాక్టర్ మాట్లాడుకొని శ్మశానానికి తీసుకెళ్లి అంతిమసంస్కారాలు కానిచ్చామనిపించుకొని ఇల్లు చేరుకొన్నాడు. ఎంత దయనీయమైన పరిస్థితి? ఆ మహాతల్లి తన జీవితకాలంలో పదులకొద్దీ పెండ్లిండ్లు చేసింది. చేతికి ఎముకలేకుండా దానంచేసింది. ఎంతో బలగం ఉన్నది. కానీ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో లాక్‌డౌన్ కారణంగా అంతిమ ఘడియల్లో ఒక్కరు కూడా రాలేని పరిస్థితి. లోకంలోకి ఒంటరిగా వచ్చినా.. పోయేటప్పుడు నలుగురు మోసేవాళ్లు.. పదిమంది మునిగేవాళ్లు.. వందమంది సాగనంపేవాళ్లూ వెంట ఉండాలని పెద్దలంటారు. ఆమె వారందరినీ సంపాదించుకొన్నది. కానీ.. వెళ్లేటప్పుడు మాత్రం ఎవరూ కడచూపుకు నోచుకోకుండానే అనంతవాయువుల్లో కలిసిపోయింది.

2



చినమడూరులో తండ్రి మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కూతురు వసుధ

# ఖజానాకు కరోనా కాటు



- ఆర్థిక సంవత్సరం చివర్లో కరోనా దెబ్బ
- మార్చిలో భారీగా తగ్గిన రాబడి
- ఒక్క వారంలో రూ.5 వేల కోట్ల నష్టం
- రోజుకు రూ.350 కోట్ల పైమాటే
- అత్యయిక పరిస్థితిని అధిగమించేందుకు ఆర్థికశాఖ ప్రత్యామ్నాయ ప్రణాళిక

కరోనా.. ఇప్పుడు ఏ నోట విన్నా ఈ వైరస్ మాటే. నిత్యం వేలమంది ప్రాణాలను కబళిస్తూ యావత్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఈ మహమ్మారి ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే కుంగదీస్తున్నది. దీని కాటు మన రాష్ట్ర ఆర్థికవ్యవస్థకూ తప్పలేదు. సరిగ్గా ఆర్థిక సంవత్సరం చివర్లో ఇది పంజా విసరడంతో గతనెలలో రాష్ట్ర రాబడులు భారీగా తగ్గాయి. కేవలం ఒక్క వారంలోనే రూ.5 వేల కోట్ల నష్టం వాటిల్లింది. ఏప్రిల్ మొదటి వారం నుంచి పరిస్థితి మరింత విషమించడంతో తెలంగాణ ఆదాయం 95 శాతానికిపైగా పడిపోయింది. ఈ నేపథ్యంలో ప్రజల ప్రాణాలను, వారి సంక్షేమాన్ని కాపాడేందుకు పెద్ద యుద్ధమే చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. రాష్ట్రంలో ఎక్కడా ఆకలికేకలు, ఆర్తనాదాలకు తావులేకుండా ప్రతి పౌరుడినీ కంటికి రెప్పలా కాపాడుకొనేందుకు నిధులను సమీకరిస్తున్నది.

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఆర్థిక మాంద్యం తీసుకొచ్చిన సవాళ్లను, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ఒడిదుడుకులను తట్టుకొని స్థిరంగా రాబడిని సాధిస్తున్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై కరోనా పిడుగు పడింది. ఆర్థిక మందగమన ప్రభావం వల్ల సొంత రాబడుల్లో వృద్ధిరేటు తగ్గినప్పటికీ ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ఆదాయాన్ని సాధిస్తున్న తెలంగాణకు కరోనా మహమ్మారి పెనుశాపంగా పరిణమించింది. కేంద్రం నుంచి పన్నుల వాటా తగ్గినా.. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) బకాయిలు సకాలంలో సర్దుబాటుకాకపోయినా సొంత రాబడులపై ఆధారపడి ముందుకుసాగుతున్న తెలంగాణపై అత్యంత ప్రధానమైన మార్చి నెలలోనే కరోనా పంజా విసిరింది. గతనెల 22న జనతా కర్ఫ్యూ, ఆ తర్వాత విధించిన లాక్‌డౌన్‌తో కార్యకలాపాలన్నీ స్తంభించడం ప్రభుత్వ రాబడులను

మిగతా 4వ పేజీలో

## రాష్ట్రాలకు ఊరట

ఓవర్‌డ్రాఫ్ట్ నిబంధనల్ని సడలించిన ఆర్బీఐ

12

## టాప్ 25 ఐపీఎస్‌లలో మన డీజీపీ

ఫేమ్ ఇండియా, ఏసియా పోస్ట్, పీఎస్‌యూ వాచ్ సర్వేలో వెల్లడి



2

ధాన్యం కొనుగోళ్లపై ఇబ్బందుంటే

## ఫిర్యాదు చేయండి

**7288894807, 7288876545**

ఫోన్ నంబర్లు ఇచ్చిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి

7

## ప్రపంచం కోసం భారత్ ఉదారత

- హైడ్రాక్సీక్లోరోక్విన్ ఎగుమతులపై పాక్షికంగా నిషేధం ఎత్తివేత
- పరిస్థితులను బట్టి విదేశాలకు తగిన మోతాదులో సరఫరా
- క్లోరోక్విన్ ఇవ్వకపోతే భారత్‌పై ప్రతిచర్య: డొనాల్డ్ ట్రంప్

4

కావాలని చేసిందో.. కాల నిర్ణయమై వచ్చిందో
కరోనావతారంలో కాలనాగై భూమండలాన్ని చుట్టేసింది
కోరలకు చిక్కినవారినల్లా కాటేస్తున్నది
కనిపించకుండానే విషం చిమ్ముతున్నది
- రమేశ్ కనపర్తి

లాక్‌డౌన్-డే 16

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 37.7°c | 24.0°c | మెదక్ | 38.0°c | 20.0°c |
| కరీంనగర్ | 37.0°c | 25.0°c | ఆదిలాబాద్ | 35.0°c | 25.1°c |
| వరంగల్ | 37.5°c | 24.0°c | నిజామాబాద్ | 39.5°c | 23.7°c |
| రంగారెడ్డి | 36.0°c | 23.0°c | మహబూబ్‌నగర్ | 38.6°c | 24.5°c |
| నల్లగొండ | 38.0°c | 23.2°c | ఖమ్మం | 39.0°c | 26.0°c |

# వందరోజుల బీభత్సం

## యూరప్, అమెరికాలో కరోనా విలయతాండవం

14 లక్షలకు చేరువలో రోగులు.. 81వేల మంది మృతి • భారత్‌లో వేగంగా పెరుగుతున్న కేసుల సంఖ్య

మొదటిపేజీ తరువాయి...

ప్రకటించింది. మంగళవారం సాయంత్రానికి 13.6 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడగా, 81వేల మంది వరకూ మరణించారు. ఈ వ్యాధి ధాటికి ఇటు ఐరోపా దేశాలు, అటు అమెరికా విల విలలాడుతున్నాయి. ఈ అంటువ్యాధిని అడ్డుకోవడానికి లాక్‌డౌన్ విధించడంతో ఆర్థికవ్యవస్థలన్నీ కుప్పకూలుతున్నాయి. స్టాక్‌మార్కెట్లు కోలుకోనిరీతిలో దెబ్బతిన్నాయి. ఆర్థికంగానే కాకుండా ఇటు సామాజికంగా, అటు మానసికంగా కూడా ఆ మహమ్మారి మానవాళిని కృంగదీస్తున్నది. వైరస్‌కు ప్రాణం పోసిన వుహాన్ నగరంలో దాని తీవ్రత పూర్తిగా తగ్గిపోగా, ఇతరదేశాలలో మాత్రం అది విజృంభిస్తున్నది. వుహాన్ నగరంలో మొదటిసారిగా మంగళవారం కరోనా కారణంగా ఒక్కరు కూడా మరణించలేదని చైనా ప్రభుత్వం తెలిపింది. అమెరికాలో 3.70 లక్షల మందికి వైరస్ సోకగా, 11 వేల మందికిపైగా మృత్యువాతపడ్డారు. న్యూయార్క్ నగరం కరోనాకు హాట్‌స్పాట్‌గా మారింది. గత 24 గంటల వ్యవధిలో వెయ్యిమందికి పైగా మరణించారు. అమెరికాలో రెండున్నర లక్షల మంది వరకూ మృత్యువాత పడవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక యూరోప్‌లోని ఇటలీ, స్పెయిన్, బ్రిటన్, ఫ్రాన్స్‌లో పౌరులు పిట్టలు రాలినట్టు రాలిపోతున్నారు. మృత దేహాలను ఖననం చేయడానికి స్థలం చాలక సామూహికంగా సమాధి చేస్తున్నారు. ఇటలీలో 17వేలు, స్పెయిన్‌లో 14వేలు, ఫ్రాన్స్‌లో 9వేలు, బ్రిటన్‌లో ఆరువేల మంది వరకూ మరణించారు.



న్యూయార్క్‌లో కరోనా వల్ల మరణించిన వ్యక్తి మృతదేహాన్ని తరలిస్తున్న వైద్య సిబ్బంది

బ్రిటన్‌లో మంగళవారం ఒక్కరోజే 854 మంది మృతిచెందారు. వ్యాధి తీవ్రత తగ్గేనాటికి కనీసం 66వేల మంది బ్రిటన్‌పౌరులు మరణించవచ్చని భావిస్తున్నారు. జపాన్ ప్రభుత్వం ఆరోగ్య అత్యయిక పరిస్థితిని ప్రకటించింది. కరోనా బారిన పడ్డ బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను ఐసీయూలో ఉంచి చికిత్సనందిస్తున్నారు. కెనడా ప్రధాని భార్య 14 రోజుల స్వీయ నిర్బంధం అనంతరం కోలుకోగా, స్పెయిన్ రాకుమారి మాత్రం ఆ మహమ్మారికి బలయ్యారు. ఎన్నో ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ భారత్‌లో చాపకిందనీరులా విస్తరిస్తున్న మహమ్మారి 4,789 మందికి అంటుకుంది. కాగా ఇప్పటికి 124మంది దానికి బలయ్యారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో జరిగిన తబ్లిగీ జమాత్ నేడు దేశంలో కరోనాకు హాట్‌స్పాట్‌గా మారింది. ఈ కార్యక్రమానికి హాజరైన వారి కారణంగా దేశమంతటా కరోనా కేసులు అనూహ్యంగా పెరిగిపోయాయి. రాష్ట్రంలో నేటితో కరోనాకు చరమగీతం పలుకుదామన్న సంబురంపై నిజాముద్దీన్ రూపంలో వచ్చి నీళ్లు చల్లింది.

### ఎన్నో సవాళ్లు

కరోనా కల్లోలం విసురుతున్న సవాల్‌ను ఎలా అధిగమించాలి? వ్యాక్సిన్ ఎప్పుడు వస్తుంది? భారతీయ కంపెనీల పాత్ర ఏమిటి? ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా చితికిపోతున్న ప్రజల భవిష్యత్తును ఎలా సరిదిద్దాలి? ఇలా అనేక సవాళ్లు నేడు ప్రజలను, ప్రభుత్వాలను వేధిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభం భయపెడుతున్నా.. ప్రజల ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రభుత్వాలన్నీ ఆంక్షలను అమలు చేస్తున్నాయి. ఆంక్షలను ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాయి. రోగులకు చికిత్సనందించేందుకు అమెరికాలో దవాఖానలు సరిపోవడం లేదు. దీంతో నౌకాదళాన్ని రంగంలోకి దించారు. ఓ యుద్ధనౌకను దవాఖానగా మార్చారు. బ్రిటన్‌లో రెండు ఫుట్‌బాల్ స్టేడియాలను దవాఖానలుగా మార్చారు. మాస్కులు వెంటిలేటర్ల కొరత తీవ్రంగా ఉంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారి వింబుల్డన్ టెన్నిస్ పోటీలు వాయిదా పడ్డాయి. స్పెయిన్‌లో మరణాల సంఖ్య పదివేలు దాటిపోయింది. మనదేశంలో ఎక్విప్‌మెంట్ సమస్య ఉంది.

– మధుకర్ వైద్యుల

### గత మూడునెలలుగా కరోనా పుట్టుక, విస్తరణ ఇలా..

| | |
|---|---|
| 2019 DEC 31 | సార్స్‌ను పోలిన లక్షణాలతో వుహాన్ నగరంలో ఓ వైరస్ వ్యాపిస్తున్నదన్న వార్త వెలుగులోకి. |
| 2020 JAN 4 | న్యుమోనియా లక్షణాలతో చైనాలో వైరస్ వ్యాపిస్తున్న వ్యాధిపై స్పందించిన ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్‌వో) |
| JAN 9 | అతివేగంగా విస్తరిస్తున్న ఆ వైరస్‌కు 'నావెల్ కరోనా 2019'అని పేరు పెట్టారు. |
| JAN 11 | చైనాలో తొలి కరోనా మరణం నమోదు. |
| JAN 23 | చైనాలో 600 మందికి ఇన్‌ఫెక్షన్. హుబెయి ప్రావిన్స్‌లో లాక్‌డౌన్ ప్రకటన. |
| JAN 30 | భారత్‌లో ప్రవేశించిన కరోనా. కేరళలో తొలి కేసు నమోదు |
| JAN 31 | నాలుగు ఖండాల్లో ఏడువేల మందికిపైగా కరోనా వ్యాధి. అంతర్జాతీయ అత్యయిక పరిస్థితిని ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో |
| Feb 11 | కరోనా వైరస్‌కు కొవిడ్-19 అని పేరు పెట్టిన డబ్ల్యూహెచ్‌వో. అనగా కరోనా అనే పేరుగల వైరస్ కలిగించే జబ్బు 'కొవిడ్-19'. |
| Feb 23 | ఇటలీలో కరోనా కేసుల నమోదు |
| March 11 | కరోనాను మహమ్మారిగా ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో. అప్పటికి 114 దేశాల్లో లక్షా 18వేల కేసులు నమోదు, 4,291మంది మృతి. |
| March 19 | మరణాల్లో చైనాను దాటిన ఇటలీ. |
| March 25 | భారత్‌లో 21 రోజుల లాక్‌డౌన్ ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీ. |
| March 30 | అమెరికాలో వెయ్యి దాటిన కరోనా మరణాలు. |

### లాక్‌డౌన్‌తోనే పరిష్కారం




కొవిడ్-19 వ్యాక్సిన్ తయారీకి భారత్ సహా ప్రపంచ దేశాలు పోటీపడుతున్నాయి. ఇప్పటికే ట్రయల్స్ ప్రారంభమయ్యాయని ఆస్ట్రేలియాకు చెందిన ఫార్మా కంపెనీ ప్రకటించింది. కరోనాను ఎదుర్కోవాలంటే ఇన్‌ఫెక్షన్ చైన్‌కు అడ్డుకట్టవేయాలి. అది ఐసొలేషన్‌తోనే సాధ్యం. మార్చి 25 నుంచి లాక్‌డౌన్ అమల్లో ఉండటంతో కోట్లమంది భారతీయులు ఇండ్లకే పరిమితమయ్యారు. 30 కోట్ల మంది అమెరికన్లు స్వీయనిర్బంధంలో ఉన్నారు. ఇటలీలో లాక్‌డౌన్ పొడిగించారు. స్పెయిన్, బ్రిటన్, ఫ్రాన్స్‌లో లక్షల మంది ఐసొలేషన్‌లో ఉన్నారు. రానున్న నెల రోజులు చాలా కీలకం. ఈ నెలరోజులు కరోనాను కట్టడి చేయగలిగితే మానవళికి అతిపెద్ద ముప్పు తప్పినట్లే.

### ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభం

కరోనా విలయతాండవానికి ప్రపంచమంతా తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొంది. లాక్‌డౌన్ కారణంగా యూరప్, అమెరికా వంటి దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. అమెరికాలో గత రెండు వారాల్లో దాదాపు కోటిమంది నిరుద్యోగభృతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్టాక్‌మార్కెట్లకు ఏప్రిల్ నెల గడ్డుకాలంగా కనిపిస్తున్నది. మొదటి మూడునెలల్లో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లన్నీ కుప్పకూలాయి. ఒక మార్చినెలలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ఇన్వెస్టర్లురూ. 33.38 లక్షల కోట్లు నష్టపోయారు. గత రెండు నెలలుగా దాదాపు అన్ని రంగాల్లో వర్క్‌ఫ్రం హోమ్ కొనసాగుతున్నది. ప్రపంచమంతా సాధారణ స్థితికి రావాలంటే ఒకటి నుంచి రెండు సంవత్సరాల కాలం పడుతుందని అంచనా వేస్తున్నారు. రానున్న కాలంలో ప్రతి ఒక్కరిపై



సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా కరోనా ప్రభావం కనిపిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రెండు నెలల విరామం తర్వాత వుహాన్‌లో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఫ్యాక్టరీలు తెరుచుకుంటున్నాయి.



## లాక్‌డౌన్‌పై కేసీఆర్ ట్రెండ్‌సెట్

### రాజ్‌దీప్ సర్దేశాయి ట్వీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లాక్‌డౌన్ కొనసాగింపుపై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలోనే ఇతర రాష్ర్టాలు నడుస్తున్నాయని ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయి మంగళవారం ట్విట్టర్ ద్వారా తెలిపారు. 'లాక్‌డౌన్‌ను పొడిగించాలని ప్రకటించిన తెలంగాణ సీఎం కేసీఆర్.. అన్ని రాష్ట్రప్రభుత్వాలకు ఒక ట్రెండ్‌సెట్ చేశారు. చాలా రాష్ర్టాలు కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నాయి. కరోనా వైరస్‌వ్యాప్తిని అరికట్టడంలోనూ తెలంగాణ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తున్నది' అని రాజ్‌దీప్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## టాప్ 25 ఐపీఎస్‌లలో మహేందర్‌రెడ్డికి చోటు

### ఫేమ్ ఇండియా, ఏసియా పోస్ట్ అండ్ పీఎస్‌యూ వాచ్ సర్వేలో వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో టాప్ 25 మంది ఐపీఎస్ అధికారుల జాబితాలో తెలంగాణ డీజీపీ ఎం మహేందర్‌రెడ్డికి చోటు దక్కింది. ఫేమ్ ఇండియా, ఏషియా పోస్ట్ అండ్ పీఎస్‌యూ వాచ్ సంస్థలు సంయుక్తంగా జాతీయస్థాయిలో నిర్వహించిన సర్వేలో తెలంగాణ డీజీపీ టాప్ కాప్‌గా నిలిచారు. 1995కు ముందు ఐపీఎస్ బ్యాచ్‌లకు చెందిన మొత్తం నాలుగు వేల మంది ఐపీఎస్ అధికారుల నుంచి వడపోసి 200 మందిని గుర్తించారు. వీరిలో మళ్లీ వివిధ అంశాలవారీగా విభజించి అత్యుత్తమ సేవలందిస్తున్నవారిని ఎంపికచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. జాతీయస్థాయిలో టాప్ 25 మంది ఐపీఎస్‌లలో డీజీపీ మహేందర్ రెడ్డితోపాటు కేంద్ర ఇంటెలిజెన్స్ చీఫ్ అరవింద్‌కుమార్, రా చీఫ్ సమత్‌కుమార్ గోయల్, ఐటీబీపీ డీజీపీ ఎస్ఎస్ దేశ్వాల్, సీఆర్పీఎఫ్ డీజీ ఏపీ మహేశ్వరి తదితరులు ఉన్నారు.

### హరీశ్‌రావు ట్వీట్

తెలంగాణ పోలీసులు దేశానికి ఆదర్శమని, ఇంటిపట్టునే ఉండటమే మనం వారికి ఇవ్వగలిగిన గౌరవమని రాష్ట్ర మంత్రి టీ హరీశ్‌రావు ట్వీట్ చేశారు. ఇందుకు డీజీపీ 'ధన్యవాదములు సార్' అంటూ సమాధానమిచ్చారు



## సీఎం నిర్ణయం అభినందనీయం

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ నివారణలో భాగంగా విశేష సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికులు, డాక్టర్లు, వైద్య సిబ్బందికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రోత్సాహకాలు ప్రకటించడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. కొవిడ్-19 ను అరికట్టడానికి రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ నిర్ణయాలు సముచితంగా ఉన్నాయని చెప్పారు. ప్రధానంగా వలస కార్మికులు, నిరుపేదలు, చేతివృత్తులవారికి బియ్యం సరఫరా 60 శాతం పూర్తయినట్టు జిల్లాల నుంచి తమకు సమాచారం అందిదన్నారు. కుటుంబాలకిచ్చే రూ.1,500 ఆర్థికసాయాన్ని పేదల ఖాతాల్లో నేరుగా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లాక్‌డౌన్ ఇంకా కొనసాగించే అవకాశం ఉన్నందున ఇలాంటి సమస్యలపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలని చాడ వెంకటరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

### లోకం పోకడ



మందు దొరికినప్పుడు తాగితాగి పడిపోయే వాడు, ఇప్పుడు మందులేక ఫికర్‌తో శోషవచ్చి పడిపోతున్నాడు!

# కరోనా యుద్ధవీరులకు నజరానాలు

• నగదు ప్రోత్సాహకాల జీవో జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారిని తరిమికొట్టడానికి అహర్నిశలు కృషిచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా వైరస్‌ను నిర్మూలించడానికి, వ్యాధిగ్రస్థులకు చికిత్స చేయడానికి నిరంతరం పోరాడుతున్న వైద్యసిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ పారిశుద్ధ్య కార్మికులు, ఇతరసిబ్బంది పాత్ర అమోఘమైనదని వారి సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రోత్సాహకాలిస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీచేసింది. చీఫ్ మినిస్టర్ స్పెషల్ ఇన్సెంటివ్ కింద నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు సీఎస్ సోమేశ్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వైద్యారోగ్యశాఖకు చెందిన రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వారి మొత్తం వేతనంలో 10 శాతం ఇవ్వనున్నట్టు తెలిపారు. జీహెచ్ఎంసీలో పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి, హైదరాబాద్ వాటర్‌బోర్డులో పనిచేసే లైన్‌మెన్లు, సీవరేజి వర్కర్‌లకు రూ.7,500 చొప్పున అందిస్తామన్నారు. ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో పనిచేసే రెగ్యులర్, పారిశుద్ధ్య సిబ్బందికి, పంచాయతీలలో వివిధరకాల విధులు నిర్వర్తిస్తున్న వారికి రూ.5 వేల చొప్పున అందించనున్నట్టు పేర్కొన్నారు. మార్చి నెలలో విధులు నిర్వర్తించిన వారికి మాత్రమే ఇది వర్తిస్తుందని, లీవులో ఉన్నవారికి, సస్పెన్షన్‌లో ఉన్న వారికి ఇది వర్తించదని ఆయన స్పష్టంచేశారు. ఈ చెల్లింపులలో నిబంధనలను అతిక్రమించినా, అనవసర చెల్లింపులు చేసినా ట్రెజరీ డీడీఓలు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

### కరోనా యుద్ధంలో మేము సైతం: అసదుద్దీన్

కరోనా వైరస్‌ను నిర్మూలించడానికి పోరాడుతున్న ప్రభుత్వానికి తాము పూర్తి మద్దతునిస్తున్నట్టు ఎంఐఎం అధ్యక్షుడు హైదరాబాద్ ఎంపీ, అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. రాష్ట్రమంత్రి కేటీ రామారావును ఆయన మంగళవారం కలిసి కరోనా నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ యుద్ధంలో తాము కూడా ప్రభుత్వంతో కలిసి పోరాడుతామని తెలిపారు. డక్కన్ మెడికల్ కాలేజీ, అస్రా, ఒవైసీ హాస్పిటల్స్ తరపున పూర్తిసాయం అందిస్తామన్నారు.

# విపత్తు వేళ వెన్నుతట్టి...

## పారిశుద్ధ్య కార్మికులకు మనోధైర్యం

### ధన్యవాదాలు తెలిపిన ఉద్యోగ సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : ప్రాణాంతక కరోనా వ్యాధి వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నా గ్రామాలు మొదలుకొని నగరాల వరకు పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుద్ధ్య సీఎం కేసీఆర్ ప్రకటించిన నజరానా బుధవారం నుంచి వారి బ్యాంకు ఖాతాల్లో జమకానుంది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. గ్రామాల వారీగా పంచాయతీల పారిశుద్ధ్య సిబ్బంది ఆధార్‌కార్డులు, మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ, బ్యాంకుల వివరాలను నమోదు చేయాలని అత్యవసర ఆదేశాలు జారీచేశారు. ఇప్పటికే ప్రతి కార్మికునికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహం ఇచ్చేందుకు ఆర్థిక శాఖ నుంచి కూడా జీవో విడుదల చేశారు. బ్యాంకు ఖాతాలను సరి చూసుకున్న తర్వాత కార్మికుల ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నారు.

### ఉద్యోగ సంఘాల ధన్యవాదాలు

రాష్ట్రంలోని వైద్యారోగ్య శాఖతో పాటుగా పారిశుద్ధ్య కార్మికులను విపత్తు సమయంలో సీఎం కేసీఆర్ వెన్నుతట్టి ప్రోత్సహించడంపై ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



కరోనా వైరస్‌పై పోరాడుతున్న వైద్య శాఖ, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు పూర్తి వేతనాలు, ఇన్సెంటివ్‌లు ఇవ్వడం మంచి పరిణామం. సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు.

– కారం రవీందర్‌రెడ్డి, జేఏసీ చైర్మన్



కరోనా వైరస్‌పై రాష్ట్రంలో మెరుగైన చర్యలు తీసుకుంటున్నాం. సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రోత్సాహకాలు మరింత పని చేసేందుకు ఉత్సాహం నింపుతాయి.

–మమత, జేఏసీ సెక్రెటరీ



కరోనా నియంత్రణ, కట్టడికి కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలకు వందనం. కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు సీఎం కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలకు వారు తోడుగా ఉన్నారు.

– దేవీప్రసాద్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

అన్ని విపత్తుల్లో ముందున్నాం. వైద్యారోగ్య శాఖ పనితీరుకు గుర్తింపు లభించింది. ఇన్సెంటివ్ ఇవ్వడం సీఎం కేసీఆర్ పెద్ద మనసుకు నిదర్శనం.

–జూపల్లి రాజేందర్, తెలంగాణ మెడికల్, హెల్త్ టీజీఓ విభాగం అధ్యక్షుడు

ఎలాంటి విపత్తు వచ్చినా ముందుండే వైద్యారోగ్య శాఖ ఈసారి కూడా సమర్థంగా పనిచేస్తున్నది. వైద్యారోగ్య శాఖకు వరాలు ఇచ్చిన సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రోత్సాహకాలు నైతిక బలాన్ని ఇస్తాయి.

– ఈ కిరణ్‌రెడ్డి, టీఎన్జీవో మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు.

పల్లె ప్రగతితో గ్రామాల రూపురేఖలతో పాటు కార్మికుల బతుకులు కూడా మారాయి. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కూడా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడం చాల గొప్ప నిర్ణయం.

– మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు దయనీయంగా ఉండేవి. పండుగలకు, ఇతర రోజుల్లో గ్రామాల్లో ఎవరినో ఒకరిపై ఆధారపడేవారు. కానీ సీఎం కేసీఆర్ వాళ్లకు మంచి వేతనాలు ఇచ్చారు.

– కాసగోని నిరోషా కిరణ్, సర్పంచ్, కాట్రపల్లి గ్రామం, కరీంనగర్ జిల్లా.

ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నాం. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, సిబ్బంది గ్రామ, మండల స్థాయిల్లో విధుల్లో ఉంటున్నారు. వారికి కూడా ఇన్సెంటివ్ ఇస్తే మంచిది.

– రాఘవేంద్రరావు, తెలంగాణ డిప్యూటీ సీఈవో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్

సీఎం కేసీఆర్ వైద్యారోగ్య శాఖతో పాటు పంచాయతీ, మున్సిపల్ కార్మికులకు ఇన్సెంటివ్ ఇవ్వడం ప్రశంసనీయం. పంచాయతీ రాజ్ శాఖ అధికారులను కూడా గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– ఎం సత్తయ్య, తెలంగాణ రాష్ట్ర మండలాభివృద్ధి అధికారుల సంఘం అధ్యక్షుడు

# ఎవరికెవరు ఈ లోకంలో..

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక అన్నట్టు ఇవాళ కరోనా కారణంగా ఎవరైనా చనిపోతే.. అంత్యక్రియలు జరుపడానికి మనుషులు లేని పరిస్థితి నెలకొన్నది. రోదనలు లేవు.. ఓదార్పులు లేవు.. పరామర్శలు లేవు.. బంధువులు లేరు.. పాడెమోసే నలుగురి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి. దవాఖానలో కన్నుమూస్తున్న కొందరికి ఇంటి ముఖం కూడా లేదు. పేద, గొప్ప తేడా లేదు.. పేర్చిన చితిపైకి చేరడమే మహాగొప్ప అన్నట్టుగా మారింది నేటి పరిస్థితి. ఇక.. కర్మకాండలు, కాకి ముట్టడాలు కరోనా మహమ్మారిని కాటికి పంపాకేనేమో.

### ఇల్లు కదలడంలేదు

కరోనా వైరస్ వ్యాప్తి ఒకవైపు, లాక్‌డౌన్ నిబంధనలు మరోవైపుతో దగ్గరి బంధువులు, ఆప్తమిత్రులు మృతిచెందినా ఆఖరి చూపునకు కూడా నోచుకోవడం లేదు. అంతిమ సంస్కారాల వద్ద పదిమందికి మించి ఉండటం లేదు. ఎంతదగ్గరి వారైనా సరే.. ఫోన్‌లోనే పరామర్శలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ సీనియర్ జర్నలిస్టు తన తల్లి చనిపోయిన విషయాన్ని ఫేస్‌బుక్‌లోనే తెలిపి.. ఎవరూ రావద్దని కూడా కోరారు.

### శ్మశానంలోనూ కట్టడి చర్యలు

హైదరాబాద్‌లోని అంబర్‌పేట శ్మశాన వాటికలో గతంలో మాదిరిగా రోజా సగటున పది మృతదేహాలకు అంత్యక్రియలు జరుగుతున్నా బంధువులు, మిత్రులు మచ్చుకైనా కనిపించడంలేదు. ఒక్కో మృతదేహం వెంబడి ఐదారుగురికి మించి రావడంలేదు. రాయదుర్గంలో నిర్మించిన 'మహా ప్రస్థానం'లో కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణలో భాగంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. గతంలో వందలు, వేలలో వచ్చే వారిసంఖ్యను 15 నుంచి 20 మందికి పరిమితంచేశారు. మాస్కులు లేకుండా లోపలికి అనుమతించడం లేదు.

**ధనాని భూమౌ పశవశ్చ కోష్ఠే**
**నారీ గృహద్వారి జనః శ్మశానే**
**దేహశ్చితాయాం పరలోక మార్గే**
**కర్మానుగో గచ్ఛతి జీవ ఏకః**

చనిపోయినప్పుడు సంపాదించినదేదీ మనతోరాదు. పెంచుకున్న పశువులు కొట్టంలోనే ఉండిపోతాయి. ప్రియమైన భార్య ఇంటి తలుపుచాటునే ఆగిపోతుంది. బంధుమిత్రులు శ్మశానం దాకా మాత్రమే వస్తారు. దేహమూ చితివరకే మాత్రమే వస్తుంది. ఇవేవీ మనకు చెందవు. మనంచేసే మంచి చెడ్డలే చివరికి మిగులుతాయి.



నల్లగొండ జిల్లా తిప్పర్తిలో మృతదేహాన్ని పంచాయతీ ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

### పంచాయతీ ట్రాక్టర్‌లో

నల్లగొండ, నమస్తే తెలంగాణ/తిప్పర్తి : నల్లగొండ జిల్లా తిప్పర్తికి సోమ వెంకటాచారి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. ఆయన అంత్యక్రియలకు బంధువులే కాకుండా ఇరుగుపొరుగువారు కూడా రాలేదు. కరోనా కారణంగా పాడె పట్టేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో చివరకు సర్పంచ్ రమేశ్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌పై మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించారు. పాడెను కూడా ఇంటివాళ్లే సిద్ధం చేసుకున్నారు.

### దహన సంస్కారాలు చేసిన కూతురు

దేవరుప్పుల: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చినమడూరులో నల్లనాగుల సోమనాథం(60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడికి కుమారులు లేకపోవడంతో కూతురు వసుధ అంతిమ సంస్కారాలు నిర్వహించింది. లాక్‌డౌన్ నేపథ్యంలో బంధువులు రాకపోవడంతో గ్రామపంచాయతీ సహకారంతో ట్రాక్టర్ సమకూర్చగా, నలుగురే దహనసంస్కారాలు నిర్వహించారు.

### ఆన్‌లైన్‌లోనే తల్లి అంత్యక్రియలు

ఇబ్రహీంపట్నం, నమస్తేతెలంగాణ: గుండెపోటుతో మృతిచెందిన తల్లి అంత్యక్రియలను లండన్‌లో ఉండే కుమారుడు ఆన్‌లైన్‌లో చూడాల్సిన దీనస్థితి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడుకు చెందిన మంఖాల సావిత్రమ్మ (60) సోమవారం సాయంత్రం మృతిచెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలం క్రితం పెద్దకుమారుడు బ్రెయిన్ ట్యూమర్‌తో మరణించగా.. మరో కుమారుడు కరుణాకర్‌రెడ్డి లండన్‌లో స్థిరపడ్డాడు. తలకొరివి పెట్టాల్సిన కొడుకు లాక్‌డౌన్‌తో అక్కడినుంచి రాలేకపోవడంతో భర్త శేఖర్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది.

### నానమ్మ చితికి మనుమడు నిప్పు

కోనరావుపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన లోకుర్తి లక్ష్మి (52) అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుమారుల్లో రాజు సౌదీలో, శేఖర్ దుబాయిలో ఉంటున్నారు. లాక్‌డౌన్ కారణంగా వారు వచ్చే పరిస్థితి లేకపోవడంతో శేఖర్ కొడుకు హార్దిక్‌తో లక్ష్మి అంత్యక్రియలు నిర్వహించారు.



సీఎంఆర్ఎఫ్‌కు విరాళంగా మంగళవారం మంత్రి కేటీఆర్‌కు రూ.కోటి చెక్కు అందజేస్తున్న విజ్ రియల్టర్స్ ప్రతినిధి. చిత్రంలో మంత్రులు ఈటల, మహమూద్ అలీ, తలసాని ఉన్నారు



మంత్రులు కేటీఆర్, ఈటలకు రూ.కోటి చెక్కును ఎన్ స్పైరా మేనేజ్‌మెంట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున అందజేస్తున్న టీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి తదితరులు



మంత్రులు కేటీఆర్, ఈటలకు రూ.కోటి చెక్కును అందజేస్తున్న పెన్నా సిమెంట్స్ ప్రతినిధి. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే దానం ఉన్నారు



మంత్రులు కేటీఆర్, ఈటలకు రూ.కోటి చెక్కును అందజేస్తున్న రత్నదీప్ రిటైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు

## ప్రభుత్వానికి అండగా దాతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉండేందుకు దాతలు పెద్దఎత్తున ముందుకొస్తున్నారు. మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసి సీఎంఆర్ఎఫ్‌కు చెక్కులను అందజేశారు. ప్రభుత్వానికి సాయమందించేందుకు ముందుకొచ్చిన దాతలను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అభినందించారు.

**సీఎంఆర్ఎఫ్‌కు చెక్కులు అందజేసినవారి వివరాలు (రూ.లలో)**

| | |
|---|---|
| జీఎమ్మార్ గ్రూప్ | కోటి |
| విజ్ రియల్టర్స్ | కోటి |
| ఎన్‌స్పైరా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ | కోటి |
| పెన్నా సిమెంట్స్ | కోటి |
| రత్నదీప్ రిటైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ | కోటి |
| ఎంపీ సుజనాచౌదరి | 50 లక్షలు |
| కరీంనగర్ గ్రానైట్స్ అసోసియేషన్ | 50 లక్షలు |
| జెమిని ఈడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా | 50లక్షలు |
| కరీంనగర్ మార్వాడీ గ్రానైట్స్ | 25 లక్షలు |
| దొడ్ల డెయిరీ | 25 లక్షలు |
| ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ | 25 లక్షలు |
| వశిష్ట కన్‌స్ట్రక్షన్స్ | 25 లక్షలు |
| గాయత్రి గ్రానైట్స్ | 25 లక్షలు |
| అగ్రసేన్ కో ఆపరేటివ్ బ్యాంక్ | 21 లక్షలు |
| నీరూస్ ఎన్‌సెంబుల్స్ | 20 లక్షలు |
| రిజెనెసిస్ ఇండస్ట్రీస్ | 10 లక్షలు |
| ఐఐటీ ముంబై ఆలుమ్ని, తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ ఆఫ్ వీవర్స్ | 10 లక్షలు |
| టీఆర్ఎస్ నేత బండి రమేశ్ | 10 లక్షలు |
| పీవోటీ మార్కెట్ స్వర్ణకారులు | 7.32 లక్షలు |



మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేతులమీదుగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్‌కు నగదు అందజేస్తున్న టీఆర్ఎస్ నేతలు నిట్టు వేణు, గడ్డం చందు, పీ ఆంజనేయులు

## నిజామాబాద్ టీఆర్ఎస్ రూ.10 లక్షల విరాళం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** నిజామాబాద్ జిల్లా టీఆర్ఎస్ పక్షాన రూ. 10లక్షల విరాళాన్ని మంత్రి ప్రశాంత్‌రెడ్డి మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డికి అందజేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నేతృత్వంలో స్వచ్ఛందంగా జమచేసిన విరాళాలు రూ. 5లక్షలను మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, పిప్పిరి ఆంజనేయులు రాష్ట్రమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి అందజేశారు. ఆ మొత్తం నగదును మంత్రి.. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ శరత్‌కు అప్పగించారు.

## వలస కార్మికులకు పేటీఎం అండ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో హైదరాబాద్‌లో వలస కార్మికులు, దినసరి కూలీలకు భోజనం పెట్టేందుకు పేటీఎం, కేవీఎన్ ఫౌండేషన్ సంయుక్తంగా ముందుకొచ్చాయి. ఫీడ్ మై సిటీ పేరుతో గత నెల 27న కార్మికులకు భోజనం పెట్టే కార్యక్రమాన్ని బెంగళూరులో ప్రారంభించారు. తొలుత ప్రతి రోజు 500 మందికి భోజనాలు పెట్టిన వీరు.. లాక్‌డౌన్ ప్రకటించిన నాటినుంచి దేశవ్యాప్తంగా 3 లక్షల మందికి భోజన సదుపాయం కల్పిస్తున్నామని పేటీఎం వైస్‌ప్రెసిడెంట్ సిద్ధార్థపాండే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొవిడ్-19 నియంత్రణలో ప్రధానమంత్రి సహాయనిధికి రూ.500 కోట్లు అందించాలన్న లక్ష్యం పెట్టుకొన్నామని, ఇప్పటికే రూ.80 కోట్ల విరాళాలు సేకరించామని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతకు హ్యాండ్‌వాష్, శానిటైజర్లను కూడా అందజేస్తున్నామని తెలిపారు.

# వ్యాప్తి నిరోధంతోనే విముక్తి

మొదటిపేజీ తరువాయి...

నియంత్రణ చర్యలపై మంత్రి కేటీఆర్ మంగళవారం జాతీయ మీడియాతో మాట్లాడారు. అమెరికా, యూరప్ దేశాల్లో తలెత్తిన పరిస్థితులు మనదేశంలో రాకుండా ఉండాలంటే లాక్‌డౌన్, సామాజికదూరం పాటించడం ఒక్కటే మార్గమన్న అభిప్రాయాన్ని ప్రధానికి సీఎం కేసీఆర్ తెలిపారన్నారు. అభివృద్ధిచెందిన దేశాలు సైతం ఎదుర్కోలేని కరోనా సంక్షోభాన్ని భారత్ ఎదుర్కోవడం సాధ్యంకాదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఉన్నారని మంత్రి కేటీఆర్ తెలిపారు. లాక్‌డౌన్ సమయంలో పేదలు, వలస కార్మికుల సంక్షేమంపై దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ మార్గదర్శిగా నిలిచిందని చెప్పారు. పేదలకు రేషన్ ఇవ్వడం, వలస కార్మికులకు ఆహార సరఫరా, కరోనా కట్టడికోసం పనిచేస్తున్న సిబ్బందికి ప్రోత్సాహకాల్లాంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేస్తున్నదని పేర్కొన్నారు. అమెరికాలోని న్యూయార్క్‌లాంటి ఆర్థికంగా అగ్రభాగాన ఉన్న పట్టణాలు, దేశాలకు సైతం కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. న్యూయార్క్‌లో అవసరమైన వెంటిలేటర్లు, దవాఖానలు కూడా లేని దుస్థితి నెలకొన్నదని తెలిపారు. ప్రపంచంలోని ఏ ప్రాంతం కరోనాను ఎదుర్కొనే పరిస్థితిలోలేదన్నారు. కేవలం తెలంగాణ, భారతదేశం మాత్రమేకాదని అమెరికా లాంటి అగ్రరాజ్యాలు కూడా కరోనా వైరస్ ఎదుర్కొలేకపోతున్నాయని చెప్పారు.

### వ్యాప్తిని అరికట్టడమే ప్రత్యామ్నాయం

లాక్‌డౌన్ కొనసాగించడంద్వారా మాత్రమే దేశంలో వైరస్‌ని ఎదుర్కొనవచ్చన్న అభిప్రాయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో వైరస్ వ్యాప్తి పూర్తిగా ఆగిన తరువాతే ఎత్తివేయాలని కేటీఆర్ అన్నారు. కరోనా హాట్‌స్పాట్‌గా పేర్కొంటున్న ప్రాంతాల్లో సంఖ్యాపరంగా టెస్టుల సామర్థ్యాన్ని మరింత పెంచాలని సూచించారు. విచ్చలవిడిగా కరోనా టెస్టులకు అనుమతిస్తే , అసలైన రోగులకు టెస్టులు చేయించుకొనే అవకాశం లభ్యం కాకపోవచ్చని చెప్పారు. ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లు ప్రజల భయాందోళనలను అవకాశంగా తీసుకొని సొమ్ముచేసుకొనే అవకాశమున్నదని తెలిపారు. టెస్టులపై అత్యంత ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ ముందుకుపోతున్నామని మంత్రి కేటీఆర్ వివరించారు. 130 కోట్ల జనాభా ఉన్న దేశంలో ఎన్ని టెస్టులు చేస్తే రోగులను గుర్తుపట్టగలమో ఆలోచించాలన్నారు. దానికి బదులుగా వ్యాప్తిని అరికట్టడమే విముక్తికి మార్గమనిచెప్పారు. లాక్‌డౌన్ పరిస్థితులను తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నదని వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లో ఒక్క అకలి చావు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. దీంతోపాటు ప్రైవేటు ఉద్యోగాలుచేసున్న వారికి జీతాలివ్వాలని సూచించామన్నారు. కూలీలను ప్రభుత్వం ఆదుకొంటుందని చెప్పారు. అద్దెల వంటి ఖర్చుల విషయంలో ప్రజలను బలవంతపెట్టకుండా మరికొంత సమయం ఇవ్వాలని మార్గదర్శకాలు జారీచేశామని తెలిపారు.

### ప్రాణాలకన్నా ఆర్థిక అంశాలు ముఖ్యంకాదు

లాక్‌డౌన్‌తో ప్రజలకు, సమాజానికి ప్రభుత్వానికి కొన్ని ఇబ్బందులున్నప్పటికీ వైరస్ వ్యాప్తి నిరోధకమే కీలకమైన అంశమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఏ కారణంతోనైనా ఒకవేళ పరిస్థితి చేయి దాటిపోతే మనల్ని మనం భవిష్యత్‌లో క్షమించుకోలేమన్నారు. ప్రజల ప్రాణాలకన్నా ఆర్థిక అంశాలు ముఖ్యం కాదని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగాఉంటే ఇప్పటికంటే ఎక్కువ కష్టపడి ప్రగతి సాధించవచ్చన్నారు. మూడుదశల్లో కరోనా వైరస్‌ను ఎదుర్కోవడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. కరోనాను ఎదుర్కొనేందుకు అనేక రకాలుగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని, ఈ మేరకు అనేక నూతన ఐసొలేషన్ వార్డులు, 15 వేల బెడ్లు, వైద్య సామగ్రిని సిద్ధం చేస్తున్నదని వివరించారు. అవసరమైతే ప్రైవేటు మెడికల్ కాలేజీలను వాడుకొంటామని చెప్పారు. పరిశ్రమలను ఆదుకునేందుకు ఇప్పటికే పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని మంత్రి కేటీఆర్ వివరించారు.

## 15 నాటికి కొత్త దవాఖానలు

- రాష్ట్రంలోని 22 మెడికల్ కాలేజీల్లోనూ ఏర్పాట్లు
- పనులు పరిశీలించిన మంత్రులు కేటీఆర్, ఈటల
- 10 నుంచి ప్రైవేట్ దవాఖానల్లో కరోనా రోగులకు చికిత్స

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కరోనా వ్యాధిగ్రస్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి చికిత్సకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లుచేస్తున్నది. గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను, మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కాలేజీని తాత్కాలిక దవాఖానలుగా రూపొందిస్తున్నది. ఈ నెల 15నాటికి వీటిని అందబాటులోకి తేనున్నారు. ఇప్పటికే ఎనిమిది సర్కారు దవాఖానల్లో ప్రత్యేక వార్డులు, పడకలను అందుబాటులోకి తెచ్చింది. రోగుల సంఖ్య మరింత పెరిగితే రాష్ట్రంలోని 22 ప్రైవేట్ వైద్య కళాశాలల్లో కూడా చికిత్స అందించాలని నిర్ణయించింది. గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న పనులను మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ మంగళవారం పరిశీలించారు. కరోనా కట్టడిలో భాగంగా ఈ దవాఖానను రూపొందిస్తున్నట్టు వారు చెప్పారు. వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. 15 అంతస్థులు ఉన్న ఈ భవనంలో ఐసొలేషన్ వార్డు, పడకలు, ఐసీయూ విభాగానికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఇక్కడ దాదాపు 1500 బెడ్లు అందుబాటులోకి రానున్నాయి. అనంతరం మంత్రులు మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీని కూడా కరోనా బాధితుల కోసం సిద్ధం చేస్తున్నారు. రోగుల సంఖ్య పెరిగితే అందుబాటులో ఉండేందుకు రాష్ట్రంలోని 22 మెడికల్ కాలేజీలను సిద్ధం చేస్తున్నామని మంత్రులు కేటీఆర్, ఈటల తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి వీటిలో కరోనా రోగులకు చికిత్స అందిస్తామని చెప్పారు. మంత్రులవెంట ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, వైద్యవిభాగాల అధిపతులు ఉన్నారు.

## బాధితులకు భరోసా

- ట్విట్టర్‌లో విజ్ఞప్తులకు మంత్రి కేటీఆర్ తక్షణ స్పందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎప్పుడూ ముందుండే ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ తన సహృదయాన్ని మరోసారి చాటుకొన్నారు. న్యూజిలాండ్‌లో ఉన్న అనీల్.. తన తల్లికి అత్యవసరంగా బైపాస్ సర్జరీ చేయాల్సి ఉన్నదని, ఆమె విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వచ్చేందుకు ప్రయాణ అనుమతి ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు. దీనిపై స్పందించిన మంత్రి కేటీఆర్.. వెంటనే ఆమెకు కావాల్సిన సౌకర్యం కల్పించాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే లాక్‌డౌన్ నేపథ్యంలో నిండు గర్భిణిగా ఉన్న తన సోదరికి అత్యవసర వైద్యసదుపాయం కల్పించాలని రాజేందర్‌రెడ్డి వ్యక్తి చేసిన విజ్ఞప్తిపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ఆమెకు తప్పకుండా వైద్యసదుపాయం కల్పిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

### హైదరాబాద్.. నవచైతన్య నగరం

ప్రపంచ మనోజ్ఞతను, నూతన చైతన్యాన్ని కలిగివున్న నగరం మన హైదరాబాద్ అని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా తెలిపారు. లాక్‌డౌన్ నేపథ్యంలో నిర్మానుష్యంగా మారిన హైదరాబాద్ నగరంపై చిత్రీకరించిన వీడియోను ఆయన ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. ఎంతో అందంగా ఈ వీడియోను చిత్రీకరించిన సత్యదూలంను ఆయన అభినందించారు.

### మహిళా సర్పంచ్.. సిటిజెన్ హీరో



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట్ మండలంలోని గోపతండాకు చెందిన మహిళా సర్పంచ్ అజ్మీరా లక్ష్మిని 'సిటిజెన్ హీరో'గా మంత్రి కేటీఆర్ అభివర్ణించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి గ్రామంలో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్న అజ్మీరా లక్ష్మి.. కరోనా వైరస్‌పై పోరాటాన్ని ముందుండి నడిపిస్తున్నారని మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో కొనియాడారు.

### బోసిపోయిన భాగ్యనగరం



రాష్ట్రంలో లాక్‌డౌన్ కారణంగా నిర్మానుష్యంగా మారిన అసెంబ్లీ పరిసరాలు


తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీర్ వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్, ఫోన్: 0878-2950033

నం. SE/01 to 03/2020-21 — ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ — తేది: 06-04-2020

ఈ క్రింది కరీంనగర్ జిల్లాలోని చెక్ డ్యాం నిర్మాణం పనుల యొక్క బిడ్లను ఆహ్వానించడమైనది. **డివిజన్ పేరు:** కరీంనగర్ డివిజన్ పరిధిలోని (3) చెక్ డ్యాంల నిర్మాణం, **మొత్తం అంచనా విలువ:**రూ. 1779.50 లక్షలు, **టెండర్లు స్వీకరించు చివరి తేది మరియు సమయం:** 15-04-2020 మ. 3.00 గంటల వరకు. **గమనిక:** మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్: tender.telangana.gov.in శ్రీ జి. అశోక్ కుమార్, బి.ఇ., పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, I&CADD, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్

DIPR R.O. No. 2734-DP/CL/Advt/1/2020-21, Dt: 06-04-2020

జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం
కరీంనగర్
ఆసక్తి వ్యక్తీకరణ

DMO(K)/JA/147/Rabi 2020, తేది: 7-04-2020

ధాన్యం సేకరణ కేంద్రాలకు పంపిణీ కొరకు కరీంనగర్ జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు టార్పలిన్స్ (3680 నం.లు) సరఫరా కొరకు సంక్షిప్త ఆసక్తి వ్యక్తీకరణ కోరబడుచున్నది. ఆసక్తి దాఖలుకు ఆఖరి తేదీ: 9-4-2020న లేదా ఆలోగా మ.1.00 గం. వరకు. వివరాలను జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం, కరీంనగర్ నుండి పొందవచ్చును. సెల్ నం. 7330733309.

DIPR RO No.1111-PP/CL/Advt/1/2020-21, Dt: 7/4/2020 — సం/- జిల్లా మార్కెటింగ్ అధికారి, కరీంనగర్

తెలంగాణ ప్రభుత్వం
సిరిసిల్ల మునిసిపాలిటి
ఫోన్ నం. 08723-230482 ఇ మెయిల్ : mcsrcl2007@yahoo.co.in
వెబ్‌సైట్ : http://sircillamunicipality.telangana.gov.in

నం. RFP/597/2019-20 — ప్రతిపాదన కోసం అభ్యర్థన (2వ పిలుపు) — తేది : 4-4-2020

సిరిసిల్ల మునిసిపాలిటిలోని (15) ప్రదేశాల వద్ద RFPలో సూచించిన నియమ నిబంధనల ప్రకారం **రూపకల్పన, నిర్మాణం, ఫైనాన్స్, నిర్వహణ & బదిలీ (DBFOT) ప్రాతిపదికపై ప్రస్తుత పబ్లిక్ టాయిలెట్ బ్లాక్ (ఏవైనా వుంటే) పునరుద్దరణతో పాటు స్మార్ట్ ఇంటిగ్రేటెడ్ వాష్‌రూమ్స్ రూపకల్పన, సరఫరా, స్థాపన, ఆపరేషన్ & నిర్వహణ నిమిత్తం''** తగిన అనుభవం మరియు తగిన ఆర్థిక సామార్థ్యం కలిగిన పబ్లిక్ లిమిటెడ్/ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల నుండి ప్రతిపాదనలు కోరబడుచున్నవి. వివరాలను మా వెబ్‌సైట్ http://sircillamunicipality.telangana.gov.in నుండి పొందవచ్చును. RFP డాక్యుమెంట్ సైట్ sircillamunicipality.telangana.gov.in నుండి లభిస్తుంది. బిడ్ డాక్యుమెంట్ దాఖలుకు ఆఖరి తేది : 20-04-2020. ఏ కారణం చూపకుండా ఏదేని ప్రతిపాదన లేదా ఆఫర్లన్నింటిని అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు కమిషనర్, సిరిసిల్ల మునిసిపాలిటి వారికి హక్కు కలదు.

సం/- కమిషనర్, సిరిసిల్ల మునిసిపాలిటి

DIPR RO No. 1112-pp/CL/Advt/1/2020-21, Dt: 07/04/2020


## కరోనా కొత్తకేసులు 40

- మొత్తం పాజిటివ్ 404.. 45 మంది డిశ్చార్జి
- 348 మందికి ఐసొలేషన్‌లో చికిత్స
- వైద్యారోగ్యశాఖ బులెటిన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ పాజిటివ్ ఉన్న 348 మందికి వివిధ దవాఖానల్లో చికిత్స అందిస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ తెలిపింది. మంగళవారం 40 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని.. దీంతో మొత్తం వైరస్ సోకినవారి సంఖ్య 404కు చేరినట్టు బులెటిన్‌లో పేర్కొన్నది. చికిత్స పొందినవారు 45 మంది డిశ్చార్జి అయినట్టు తెలిపింది. తబ్లిగీ వెళ్లి వచ్చివారికి, వారి కుటుంబసభ్యుల్లో కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు చేస్తున్నట్టు వెల్లడించింది. కాగా, అనుమానిత లక్షణాలున్నవారికి 24 గంటలపాటు ఆరు ల్యాబ్‌లలో నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని, పాజిటివ్ వ్యక్తులు కలిసిన (కాంటాక్ట్) వారిని గుర్తించడంపై సర్వేలెన్స్ బృందాలు నిరంతరం పనిచేస్తున్నట్టు పేర్కొన్నది. శక్తిమంతమైన అమెరికా సైతం కరోనాతో విలవిలలాడుతున్నదని, ముందు జాగ్రత్తల ద్వారానే మనకు అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోగలమని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ మంగళవారం తెలిపారు. కరోనా పాజిటివ్ వ్యక్తులకు చికిత్స అందించడానికి అవసరమైన పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్కులను లక్షల సంఖ్యలో సమకూర్చుకుంటున్నామన్నారు. సీఎం కార్యాలయం నుంచి ప్రతిరోజూ పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. గొప్పగా పనిచేస్తున్న ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయతీరాజ్, పోలీస్ సిబ్బందికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

**చికిత్స పొందుతున్న, కోలుకుంటున్నవారి సంఖ్య**

| వివరాలు | మంగళవారం ఒక్కరోజు | ఇప్పటివరకు మొత్తం |
|---|---|---|
| కొవిడ్-19 వైరస్ పాజిటివ్స్ | 40 | 404 |
| కోలుకున్న/డిశ్చార్జి అయినవారు | 12 | 45 |
| మరణాలు | -- | 11 |
| చికిత్స పొందుతున్నవారు | 348 | 348 |

## పది లక్షల పరీక్షలు తప్పనిసరి

- కరోనా లేదనడానికి ఇదేమార్గం
- ఐదు లక్షల మరణాలకు ఆస్కారం
- డాక్టర్ పొట్లూరి రాహుల్






**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మన దేశంలో కరోనా వైరస్ లేదని నిర్ధారణకు రావాలంటే కనీసం పది లక్షల మందికి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరమున్నదని బ్రిటన్‌లోని ఏసీఏఎల్ఎం యూనివర్సిటీకి చెందిన భారతీయ శాస్త్రవేత్త డాక్టర్ రాహుల్ పొట్లూరి అన్నారు. విశ్వమారి నుంచి బయటపడాలంటే కేసుల పరీక్షలను పెంచడం తప్ప మరోమార్గం లేదని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా కొవిడ్-19 కేసులు, మరణాల నిష్పత్తి ఆధారంగానే నివారణ చర్యలను తీసుకుంటున్నారని చెప్పారు. ప్రపంచంలోని యాభై దేశాలపై కరోనా ప్రభావం, నమోదైన కేసులు, పరీక్షల సంఖ్య మధ్య ఉన్న సంబంధంపై పరిశోధనలు జరిపిన డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ.. కొవిడ్-19 ఎలా విస్తరిస్తున్నదనే పరిశోధన ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. కేసులు, మరణాల సంఖ్యను నియంత్రించడంలో దక్షిణకొరియా తీవ్ర ప్రయత్నాలు చేసిందని చెప్పారు. కరోనాకు వాక్సినేషన్ లేకపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఐదు లక్షల మంది మరణించే ప్రమాదాన్ని వైరస్ పరీక్షల సంఖ్య పెంచుకోవడం ద్వారా నియంత్రించవచ్చని అన్నారు.

### పరీక్షలు ఎక్కువుంటే మరణాలు తక్కువ

మరణాల సంఖ్య ఒక్కో అంశంలో ఒక్కోలా ఉన్నదని, ఏ దేశాల్లో అయితే జనాభా ఆధారంగా వైరస్ పరీక్షల సంఖ్య ఎక్కువగా ఉందో ఆ దేశాల్లో మరణాల రేటు తక్కువగా ఉన్నదని డాక్టర్ రాహుల్ అన్నారు. వైరస్ పరీక్షలు వీలైనంత ఎక్కువగా చేయడం వల్ల మరణించే రోగుల సంఖ్య తెలుసుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ మహమ్మారి నుంచి బయటపడటానికి ఈ గణాంకాలే మనకు ఆధారమన్నారు. జనాభాలో ఒకశాతం కన్నా ఎక్కువగా మందికి పరీక్షలు నిర్వహించిన దేశాల్లో మరణాలరేటు తక్కువగా ఉందన్నారు. దీనినిబట్టి మన దేశంలో కనీసం కోటిన్నర మందికి వైరస్ పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నదని తెలిపారు. కానీ, వాస్తవాలను పరిశీలిస్తే పది లక్షల వైరస్ పరీక్షలైనా నిర్వహిస్తే కానీ ఫలితం ఉండదని పేర్కొన్నారు. వైరస్‌వ్యాప్తిని తెలుసుకోవడానికి వైరస్ పరీక్షలు పెద్దసంఖ్యలో చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య సేవల ప్రణాళికలకే కాకుండా హాట్‌స్పాట్ల గుర్తింపునకు కూడా దీని వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. అవసరాన్ని బట్టి క్వారంటైన్ లేదా ఐసోలేషన్ విధానాలు కూడా పెంచుకోవచ్చని తెలిపారు.


పురపాలక సంఘ కార్యాలయము : బెల్లంపల్లి: జిల్లా :: మంచిర్యాల
ఇ-ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండరు నోటీస్

ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ నెం. ఇ1/రీకాల్-4/టెండర్/01/2020-21/Bpl/Mptly తేది: 07-04-2020

ఈ కార్యాలయములో అంచనా విలువ రూ. 32.00 లక్షల విలువ గల (8) పనులకు ఎస్‌సిఎస్‌పి, ఎస్‌ఎఫ్‌సి, 14వ ఆర్థిక సంఘ నిధులు మరియు మున్సిపల్ సాధారణ నిధులు 2020-21 సం.నకు గాను రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఈ కార్యాలయం నుండి టెండర్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి. **టెండరు తేదీల వివరములు :** 01. డౌన్‌లోడ్ మొదలు తేది & సమయం : 15-04-2020 from 4.00 PM, 02. డౌన్‌లోడ్ చివరి తేది & సమయం : 21-04-2020 upto 1.00 PM. ఇట్టి విషయములో తదుపరి సమాచార నిమిత్తము ఆఫీసు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయము నందు సంప్రదించగలరు. లేదా 9849906724, 8712333442 నందు సంప్రదించగలరు. పూర్తి వివరములకు website www.tender.telangana.gov.in నందు చూడవచ్చును.

సం/- కమిషనర్, బెల్లంపల్లి మున్సిపాలిటి

DIPR RO No. 1122-pp/CL/Advt/1/2020-21, Dt: 07/04/2020

UNIVERSITY OF HYDERABAD
(A Central University established by an Act of Parliament)
Prof. C.R.Rao Road, Gachibowli, P.O. Central University, Hyderabad 500 046

ADMISSION ANNOUNCEMENT 2020-21

**University of Hyderabad, an Institution of Eminence, ranked 4th among Universities and 11th under overall category in the NIRF rankings 2019, listed in Category-I of UGC (Categorization of Universities for grant of graded autonomy) Regulations 2018, with NAAC grading of 3.72 out of 4.00,** invites bright, aspiring students committed to excellence to apply for admission to various 5 Year Integrated P.G., P.G., M.Tech., M.Phil. Courses and Ph.D. programmes through an All-India entrance examination.

Candidates are required to apply **online** through University website: **http://acad.uohyd.ac.in.**

**IMPORTANT DATES**

| | |
|---|---|
| Online Application start date | 03.04.2020 |
| Last date for submitting the Online Application | 03.05.2020 |
| Downloading of Hall Tickets from | 27.05.2020 |
| Dates of Entrance Examinations | 02.06.2020 to 06.06.2020 |

**Important Information:** Hall Tickets, information to short-listed candidates for interview and selected/waitlisted candidates will only be notified in website. It is the responsibility of the candidates to check the University website for downloading the Hall Tickets, results and the relevant formats required for admission.

**For further details including courses offered, eligibility criteria, prescribed fee, reservation policy please refer to the website http://acad.uohyd.ac.in or http://www.uohyd.ac.in**

Devesh Nigam
Controller of Examinations

08.04.2020

లాక్‌డౌన్-డే 16

లక్షల సంవత్సరాల మానవ ప్రస్థానంలో
ఎన్నెన్ని విలయాలు.. ఎన్నెన్ని ప్రళయాలు
ఎన్ని సంఘర్షణలు.. ఎన్ని సంక్షోభాలు
ఎన్నెన్ని యుద్ధాలు.. ఎన్నెన్ని మరణాలు

ఎన్నెన్ని విపత్తులు..ఎన్ని విన్యాసాలు
గుండె నిబ్బరం ఉన్న మనిషి ఎదిరించాడు..
మనిషి జయించాడు.
- ఎస్వీ సత్యనారాయణ

## స్పెయిన్‌లో మళ్లీ పెరిగిన మృతులు

- ఒక్కరోజే 743 మంది మృతి
- ఇరాన్‌లో మెరుగైన పరిస్థితి



లాక్‌డౌన్ కారణంగా బోసిపోయిన స్పెయిన్‌లోని మాడ్రిడ్ వీధులు

**లండన్/ రియాద్/ టెహ్రాన్, ఏప్రిల్ 7:** ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 13.50 లక్షల మందికి కరోనా వైరస్ సోకగా, 75,500 మందికి పైగా మృత్యువాత పడ్డారు. అమెరికాలో గత 24 గంటల్లో 1,150 మరణాలు సంభవించాయి. స్పెయిన్‌లో వరుసగా నాలుగు రోజులుగా తగ్గిన మరణాలు మంగళవారం పెరిగాయి. సోమవారం 637 మంది మృత్యువాత పడగా, అది మంగళవారం 743 మందికి చేరుకున్నది. ఇక ఇప్పటి వరకు ఎటువంటి ఆంక్షలు విధించని స్వీడన్‌లో మంగళవారం 114 మంది మరణాలతో మొత్తం మృతుల సంఖ్య 591 మందికి చేరింది. సౌదీ అరేబియాలో కేసుల సంఖ్య మరికొన్ని వారాల్లో రెండు లక్షలకు చేరుకోవచ్చని అధికారిక మీడియా ఆందోళన వ్యక్తం చేసింది. ఆ దేశంలో ఇప్పటివరకూ 2,795 కేసులు, 41 మరణాలు నమోదయ్యాయి. ఇరాన్‌లో వరుసగా ఏడోరోజు కొత్త కేసుల నమోదు తగ్గుముఖం పట్టడంతో మంగళవారం ఆ దేశ పార్లమెంట్ సమావేశమైంది.

## మేం కోలుకుంటున్నాం

- తాజాగా ఒక్క మరణమూ లేదన్న చైనా
- నేటి నుంచి వుహాన్ కేంద్రంగా రాకపోకలు



**బీజింగ్, ఏప్రిల్ 7:** కరోనాకు పుట్టినిల్లు అయిన చైనాలో పరిస్థితులు సాధారణ స్థితికి వస్తున్నాయి. ఈ వైరస్ వల్ల సోమవారం ఒక్కరూ కూడా మరణించలేదని ఆ దేశం ప్రకటించింది. కరోనా మరణాలను జనవరి నుంచి వెల్లడిస్తున్న చైనా తాజాగా ఒక్కరూ కూడా మరణించలేదని ప్రకటించడం ఇదే తొలిసారి. ఇదే సమయంలో వైరస్‌కు కేంద్ర బిందువైన వుహాన్ నగరం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు సాగించేలా చైనా చర్యలు చేపడుతున్నది. బుధవారం నుంచి వుహాన్ కేంద్రంగా మిగతా ప్రాంతాలకు బస్సు, రైళ్ల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నగరంలోనే తొలిసారిగా కరోనా వెలుగు చూసిన విషయం తెలిసిందే. అయితే దీన్ని కట్టడి చేయడానికి జనవరి 23 నుంచి వుహాన్ నగరంలో లాక్‌డౌన్ విధించారు. అయితే ఇటీవల వుహాన్‌లో పరిస్థితులు కొంత అదుపులోకి రావడంతో తొలుత అంతర్గత రవాణాకు అధికారులు అనుమతించారు. అయితే చైనాలో ఇప్పుడిప్పుడే పరిస్థితులు సద్దుమణుగుతున్న తరుణంలో వుహాన్ నుంచి మిగతా ప్రాంతాలకు ప్రజా రవాణాను పునరుద్ధరించడం సరికాదని కొందరు నిపుణులు పేర్కొంటున్నారు.

# భారత్ ఉదారత

- ప్రపంచం కోసం హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఎగుమతులపై పాక్షికంగా నిషేధం ఎత్తివేత
- పరిస్థితులను బట్టి విదేశాలకు తగిన మోతాదులో సరఫరా
- క్లోరోక్విన్ ఇవ్వకపోతే భారత్‌పై ప్రతిచర్య: డొనాల్డ్ ట్రంప్



**న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఏప్రిల్ 7:** ప్రపంచవ్యాప్తంగా కరోనా కరాళ నృత్యం చేస్తున్న తరుణంలో భారత్ కీలక నిర్ణయం తీసుకున్నది. మలేరియాను నయం చేసేందుకు వాడే హైడ్రాక్సీక్లోరోక్విన్(హెచ్‌సీక్యూ), పారాసెటమాల్‌తో పాటు పలు ఔషధాల ఎగుమతులపై విధించిన నిషేధాన్ని పాక్షికంగా ఎత్తివేస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. దీంతో కరోనా వైరస్ ప్రభావం అధికంగా ఉన్న అమెరికా వంటి దేశాలకు ఊరట లభించినట్టు అయింది. 'కరోనా విశ్వమారి వ్యాపిస్తున్న నేపథ్యంలో మానవతా కోణంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. క్లోరోక్విన్, పారాసెటమాల్ ఔషధాల కోసం భారత్‌పై ఆధారపడి ఉన్న పొరుగు దేశాలకు ఈ ఔషధాల్ని పరిస్థితులను బట్టి తగిన మోతాదులో ఎగుమతి చేస్తాం' అని విదేశాంగ శాఖ ప్రతినిధి అనురాగ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. కరోనాతో తీవ్రంగా ప్రభావితమై, ఈ ఔషధాల అవసరం ఉన్న దేశాలకు కూడా వీటిని ఎగుమతి చేస్తామన్నారు. దేశీయ అవసరాలకు సరిపడిన నిల్వలు ఉంచుకున్న తర్వాత.. పరిస్థితులకు అనుగుణంగా విడతలవారీగా క్లోరోక్విన్‌ను ఎగుమతి చేస్తామని అధికారులు తెలిపారు. మరోవైపు, విటమిన్ బీ1, బీ12 వంటి 24 ఫార్మా ఔషధాల ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని కూడా ఎత్తివేస్తున్నట్టు కేంద్రం మరో నోటిఫికేషన్‌లో వెల్లడించింది. క్లోరోక్విన్‌కు భారత్ అతిపెద్ద ఎగుమతిదారుగా ఉన్నది. కరోనా విశ్వమారిపై పోరాటానికి హైడ్రాక్సీక్లోరోక్విన్ సమర్థవంతంగా పనిచేస్తుందన్న వార్తల నేపథ్యంలో గతనెల 25న క్లోరోక్విన్‌తోపాటు పలు ఔషధాల ఎగుమతులపై భారత్ నిషేధం విధించింది.

**ట్రంప్ చిటపటలు**

అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై చిటపటలాడారు. కరోనా రోగుల చికిత్స కోసం సాయపడుతుందని భావిస్తున్న హైడ్రాక్సీక్లోరోక్విన్ మాత్రల్ని సరఫరా చేయాలన్న అమెరికా విజ్ఞప్తిని భారత్ మన్నించకపోతే అది తనను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తుందని, అది ప్రతిచర్యకు కూడా దారి తీయొచ్చని హెచ్చరించారు. అమెరికాతో భారత్‌కి మంచి సంబంధాలు ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'ఒకవేళ ఔషధాల్ని సరఫరా చేయొద్దన్నదే భారత్ నిర్ణయమైతే.. అది నన్ను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆదివారం భారత ప్రధాని మోదీతో మాట్లాడాను. క్లోరోక్విన్ అవసరాన్ని వివరించాను. అమెరికాకు సరఫరా చేయాలని కోరాను. ఒకవేళ ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేయకపోతే.. దానికి ప్రతిచర్య ఉండొచ్చు. ఎందుకు ఉండకూడదు?' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై ప్రతిపక్ష కాంగ్రెస్ స్పందించింది. కరోనా చికిత్సకు ఉపయోగపడే ఔషధాల్ని ముందు దేశంలోఅవసరమైన వారికి అందజేసిన తర్వాత విదేశాలకు ఎగుమతి చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

## 70శాతం ఉత్పత్తి మనవద్దే!

- దేశంలో హైడ్రాక్సీ క్లోరోక్విన్ కొరత లేదు
- ఎగుమతికి సిద్ధంగా ఉన్నాం
- అవసరమైతే ఉత్పత్తిని పెంచుతాం
- ఔషధ తయారీదారులు



**న్యూఢిల్లీ:** కరోనా రోగుల చికిత్స కోసం సాయపడుతుందని భావిస్తున్న హైడ్రాక్సీక్లోరోక్విన్‌ను తమ దేశానికి సరఫరా చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ భారత్ తమ అభ్యర్థనను మన్నించకపోతే, ప్రతిచర్య ఉండవచ్చని హెచ్చరికలు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలో క్లోరోక్విన్‌ను అమెరికాకు ఎగుమతి చేసేంత నిల్వలు దేశంలో ఉన్నాయా? ఈ సమయంలో స్వదేశీ ఫార్మా సంస్థలు క్లోరోక్విన్‌ను ఏమేరకు ఉత్పత్తి చేయగలవు? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. మలేరియాను నయం చేయడానికి వాడే హైడ్రాక్సీక్లోరోక్విన్‌కు భారత్ అతిపెద్ద ఎగుమతిదారుగా ఉన్నది. ప్రపంచంలో దాదాపు 70 శాతం క్లోరోక్విన్ దేశంలోనే తయారవుతున్నది. జైడూస్ కాడిలా, ఐపీసీఏ, అలెంబిక్ వంటి దేశీయ ఫార్మా సంస్థలు ప్రధానంగా ఈ ఔషధాన్ని పెద్దమొత్తంలో ఉత్పత్తి చేస్తున్నాయి. ఏటా 20 కోట్ల యూనిట్ల(దాదాపు 40 మెట్రిక్ టన్నులు) క్లోరోక్విన్ ఔషధాన్ని భారత్ తయారు చేస్తున్నది. అంటే 200మిల్లీగ్రాముల చొప్పున 20 కోట్ల మాత్రల్ని ఉత్పత్తి చేస్తున్నది. దీంట్లో దాదాపు 3 కోట్ల యూనిట్లు దేశీయ అవసరాలకు ఉపయోగపడగా, మిగిలిన 17 కోట్ల యూనిట్లు(75–80 శాతం) విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి.ప్రభుత్వ లెక్కల ప్రకారం..ప్రస్తుతం దేశంలో 1–2 కోట్ల అదనపు క్లోరోక్విన్ నిల్వలు ఉన్నాయి. రానున్న 8 వారాల్లో క్లోరోక్విన్ అవసరం గణనీయంగా పెరిగినప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు 400 పైగా తయారీ సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. 'క్లోరోక్విన్ నిల్వలు సరిపడినంత ఉన్నాయి. ఒకవేళ దేశీయ అవసరాలతోపాటు, విదేశాలకు ఔషధాన్ని ఎగుమతి చేయాల్సి వస్తే, ఔషధ సంస్థలు క్లోరోక్విన్‌ను పెద్ద మొత్తంలో తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి' అని ఔషధ తయారీదారులు వెల్లడించారు. క్లోరోక్విన్ ఉత్పత్తి ప్రక్రియను కొన్ని కంపనీలు ఇప్పటికే ప్రారంభించాయన్నారు.

## లాక్‌డౌన్ పొడిగింపు!

- కొనసాగించాలని పలు రాష్ట్రాల విజ్ఞప్తి
- పరిశీలిస్తున్న కేంద్రం

**న్యూఢిల్లీ:** దేశంలో వైరస్ కేసులు, మరణాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో లాక్‌డౌన్‌ను పొడిగించాలంటూ తెలంగాణ, మధ్యప్రదేశ్, కర్ణాటక వంటి ఏడు రాష్ట్రాల సీఎంలతోపాటు కొందరు నిపుణులు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం దీనిపై సమాలోచనలు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. అయితే ఇప్పటి వరకు ఎలాంటి తుదినిర్ణయం తీసుకోలేదని, ఎలాంటి వదంతులను నమ్మవద్దని పేర్కొన్నాయి. దేశంలో మార్చి 25న విధించిన 21 రోజుల లాక్‌డౌన్ ఏప్రిల్14తో ముగియనున్నది. కాగా, కరోనాపై దీర్ఘకాల పోరాటానికి సిద్ధం కావాలని ఇటీవల ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. అలిసిపోయామని లేదా ఓడిపోయామని ఎవరూ భావించవద్దన్న ఆయన.. ఈ మహమ్మారిపై దేశం తప్పక విజయం సాధిస్తుందన్న నమ్మకం కలిగి ఉండాలన్నారు. దీంతో లాక్‌డౌన్‌ను కేంద్రం మరికొంత కాలం కొనసాగించే అవకాశమున్నదన్న ప్రచారం జరుగుతున్నది. కాగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ నేతృత్వంలో కేంద్ర మంత్రుల బృందం సమావేశం జరిగింది. మే 15 వరకు విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్ మూసివేత కొనసాగించాలని, మతపరమైన కార్యక్రమాలపై ఆంక్షలు విధించాలని ఈ బృందం సూచించింది. కాగా, భారత్‌లో లాక్‌డౌన్ వల్ల అసంఘటిత రంగాలకు చెందిన 40 కోట్ల కార్మికుల జీవితాలు ప్రమాదంలో పడ్డాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ తెలిపింది.

## లాక్‌డౌన్‌లోనూ ఆగని చొరబాట్లు

- యథేచ్ఛగా పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘనలు



పాక్ నుంచి దూసుకొచ్చిన షెల్‌ను చూపుతున్న పూంచ్ వాసి

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ విధించినప్పటికీ పాకిస్థాన్ నుంచి ఉగ్రవాదుల చొరబాటు యత్నాలు మాత్రం ఆగడం లేదు. రెండు దేశాలూ కరోనాతో అల్లాడుతున్నా నియంత్రణ రేఖ వద్ద మాత్రం పాక్ కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నది. జనవరిలో 367సార్లు కాల్పులు ఉల్లంఘనలు చోటుచేసుకోగా, ఫిబ్రవరిలో 366 సార్లు, కరోనా తీవ్రత అధికంగా ఉన్న మార్చిలో 411 సార్లు కాల్పుల ఉల్లంఘనలు జరుగడం గమనార్హం. ఈ నెలలో ఇప్పటివరకు 53 సార్లు ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి.పీవోకే నుంచి భారత్‌లోకి ఉగ్రవాదులు చొరబడేందుకు వీలుగా పాక్ వ్యవహరిస్తున్నదని సైన్యం తెలిపింది.

## అధికారిక నివాసానికి మెహబూబా ముఫ్తీ

- కొనసాగుతున్న గృహ నిర్బంధం

**శ్రీనగర్:** పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధినాయకురాలు మెహబూబా ముఫ్తీకి స్వల్ప ఊరట లభించింది. రాష్ట్ర ప్రత్యేక హోదాను గత ఆగస్టులో రద్దు చేశాక ప్రజారక్షణ చట్టం కింద ఆమెను నిర్బంధంలో ఉంచిన విషయం తెలిసిందే. మెహబూబా 8 నెలలుగా లాల్‌చౌక్‌లోని ప్రభుత్వ బంగ్లాలో నిర్బంధంలో ఉండగా, తాజాగా ఆమెను ముష్కార్ రోడ్‌లోని అధికారిక నివాసానికి మార్చినట్టు అధికారులు తెలిపారు. అక్కడ కూడా గృహ నిర్బంధం కొనసాగుతుందని పేర్కొన్నారు.



పంజాబ్‌లోని భటిండాలో కరోనాపై పోరాడుతున్న వైద్య సిబ్బందికి గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

## సోదరభావానికి నిదర్శనం

- భటిండా పోలీసులకు ఎంపీ సంతోష్‌కుమార్ ప్రశంస

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ బారినుంచి ప్రజలను కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శ్రమిస్తున్న వైద్యసిబ్బందికి పంజాబ్‌లోని భటిండా పోలీసులు గౌరవవందనం సమర్పించిన దృశ్యాన్ని ఎంపీ సంతోష్‌కుమార్ ట్వీట్ చేశారు. వైద్యసిబ్బందిని పోలీసులు గౌరవించడం సోదరభావానికి, సమైక్యతకు నిదర్శనమని ఎంపీ సంతోష్‌కుమార్ ప్రశంసించారు. కరోనాపై పోరులో అలుపెరుగకుండా శ్రమిస్తున్న వైద్యసిబ్బందిని సీఎం కేసీఆర్ ఇటీవల ప్రశంసించారు. దీనినే భటిండా పోలీసులు ఆచరించారు' అని ఆయన ట్వీట్ చేశారు.



**జ్ఞానమంటే విద్యే కాదు..**

జ్ఞానమంటే కేవలం విద్యే కాదని, బాధ్యతకు స్థితి లేదా సంపదతో సంబంధంలేదని ఎంపీ సంతోష్‌కుమార్ తెలిపారు. ఒడిశాలోని ఓ గిరిజన గ్రామానికి చెందిన మహిళలు తమ పనులతో అందరికీ జ్ఞానోదయం కలిగిస్తున్నారని ట్వీట్ చేశారు. దీనిపై ప్రతిఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరమున్నదని పేర్కొన్నారు. నీళ్ల కోసం చేతిపంపు వద్దకు వచ్చిన ఆ గిరిజన మహిళలు సామాజిక దూరాన్ని పాటిస్తున్న దృశ్యాన్ని ఆయన ట్విట్టర్ ద్వారా పంచుకొన్నారు.



జంతువులకు కరోనా సోకకుండా పర్యవేక్షించాలన్న అటవీశాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం హైదరాబాద్ జూపార్కులో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్న సిబ్బంది.
–హైదరాబాద్, నమస్తే తెలంగాణ



## పేదలకు ఆహారం పంచిన గవర్నర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ మంగళవారం రాజ్‌భవన్ పరిసరాల్లోని పేదలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ జోనల్ హెడ్ ఆర్జీవీ కులకర్ణి పాల్గొన్నారు. అదేవిధంగా గవర్నర్ రాజ్‌భవన్ నుంచి సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

## గుర్తింపు ఉన్న పార్టీలతో చర్చలు

- ప్రధాని మోదీకి సీపీఐ నేత నారాయణ సూచన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తితో దేశం విపత్కర పరిస్థితుల్లోకి వెళ్లిందని, ఈ ప్రమాదం నుంచి ప్రజలు బయటపడేందుకు రాజకీయ, మత, ప్రాంతీయ విభేదాలు లేకుండా విశాల దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం చర్చించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ సూచించారు. ఈ సమస్య పరిష్కారం కోసం గుర్తింపు కలిగిన అన్ని పార్టీలతో ప్రధాని చర్చించాలని కోరారు.

# ఖజానాకు కరోనా కాటు

మొదటిపేజీ తరువాయి...

కుంగదీసింది. దీంతో రాష్ట్ర ఖజానాకు ఒక్క మార్చి చివరివారంలోనే దాదాపు రూ.5 వేల కోట్ల గండి పడింది. ఏప్రిల్ మొదటి వారం నుంచి పరిస్థితి మరింత విషమించడంతో నెలకు రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు రావలసిన ఆదాయం 95 శాతానికిపైగా పడిపోయింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని, సంక్షేమాన్ని కాపాడేందుకు పెద్ద యుద్ధమే చేస్తున్నది. రాష్ట్రంలో ఎక్కడా ఆకలికేకలు, ఆర్తనాదాలకు తావులేకుండా ప్రతి పౌరుడినీ కంటికి రెప్పలా కాపాడుకొనేందుకు నిధులను సమీకరిస్తున్నది. కరోనాతో యుద్ధం ముగిసిన తర్వాత ఆర్థిక రథచక్రాలను మళ్లీ పరుగులు పెట్టించేందుకు ప్రణాళికలను సిద్ధంచేసుకొంటున్నది.

**సరిగ్గా ఆర్థిక సంవత్సరం చివర్లో పంజా**

వాస్తవానికి మన ఆర్థిక సంవత్సరంలో మార్చి నెల అత్యంత కీలకమైనది. ఈ నెలలో రాబడులను విపరీతంగా పెంచుకొనేందుకు, బడ్జెట్ అంచనాలకు–వాస్తవాలకు మధ్య లోటును పూడ్చుకొనేందుకు ప్రభుత్వాలు అన్నివిధాలా ప్రయత్నిస్తుంటాయి. బడ్జెట్ అంచనాల్లో నిర్దేశించుకొన్న లక్ష్యాల సాధనకు మార్చినెలనే ప్రధాన టార్గెట్‌గా ఎంచుకుంటారు. దీంతో మిగిలిన అన్ని నెలలలో వచ్చే సగటు ఆదాయం కంటే ఆర్థిక సంవత్సరంలో చివరిదైన మార్చినెలలో రెట్టింపు రాబడి వస్తుంటుంది. కానీ సరిగ్గా మార్చి నెలలోనే కరోనా మహమ్మారి విజృంభిచడంతో రాష్ట్ర సొంత రాబడుల్లో రూ.8 వేల కోట్లకుపైగా గండిపడింది. లాక్‌డౌన్ వల్ల ఆర్థిక కార్యకలాపాలన్నీ స్తంభించడంతో జీఎస్టీతోపాటు విలువ ఆధారిత పన్ను (వ్యాట్), స్టాంపుల అమ్మకాలు, స్థిరాస్థి రిజిస్ట్రేషన్లు, వాహన రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయంలో భారీగా కోత పడింది. సొంత పన్నులు, పన్నేతర రాబడులు, కేంద్ర పన్నుల్లో వాటా రూపంలో నెలవారీగా రాష్ట్రానికి వచ్చే మొత్తం రాబడి రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఉంటుంది. అలాగే జీఎస్టీ, వ్యాట్ ద్వారా రూ.3 వేల కోట్ల నుంచి రూ.4 వేల కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 500 కోట్ల నుంచి రూ.600 కోట్లు, ఆబ్కారీశాఖ ద్వారా దాదాపు రూ.1,166 కోట్లు, రవాణా, మైనింగ్ ఇతర పన్నుల ద్వారా సుమారు రూ.833 కోట్ల ఆదాయం వస్తుంది. కానీ లాక్‌డౌన్ వల్ల ప్రస్తుతం ఈ రాబడి 90 శాతానికిపైగా తగ్గింది. దీంతో రాష్ట్ర ఖజానాకు రోజూ రూ.5 కోట్లు రావడమే గగనమైంది.

**జీఎస్టీ, వ్యాట్ రాబడులకు బ్రేక్**

జీఎస్టీ, వ్యాట్ ద్వారా రాష్ట్రానికి గతేడాది రూ.45,379 కోట్ల రాబడి వచ్చింది. ఈసారి దానిని రూ.51 వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ అది రూ.47,500 కోట్లకే పరిమితమైంది. జీఎస్టీ, వ్యాట్ వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలు ముమ్మరంగా శ్రమిస్తున్న తరుణంలోనే లాక్‌డౌన్ విధించాల్సి రావడంతో రాబడులకు బ్రేక్ పడింది. దీంతో మార్చి నెలలో రూ.6 వేల కోట్లుగా నిర్దేశించుకొన్న రాబడులు రూ.4,950 కోట్లకే పరిమితమయ్యాయి. గతేడాది మార్చినెలలో రూ.5,180 కోట్లుగా ఉన్న రాబడులు ఈసారి తగ్గాయి. సాధారణంగా ప్రతి నెలలో రాబడుల వృద్ధిరేటు 6 శాతం మేరకు పెరుగుతుంది. కానీ ఈసారి ఇది –5 శాతం తక్కువగా ఉన్నది. అంటే ఒక్కనెలలో సరాసరి రాబడి 11 శాతం తగ్గింది.

**స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయానికి గండి**

మరోవైపు గత నెలలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా బాగా తగ్గింది, స్థిరాస్తి క్రయవిక్రయాలు జోరుమీదున్నప్పుడే లాక్‌డౌన్ విధించాల్సి రావడంతో మొత్తం కార్యకలాపాలు స్తంభించాయి. ఫిబ్రవరి వరకు 15,42,000 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లతో రూ.6,509 కోట్ల రూపాయల రాబడి వచ్చింది. మార్చినెలలో 1,15,886 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. దీనిద్వారా రూ.520 కోట్ల రాబడి వచ్చింది. వాస్తవానికి గతనెలలో దాదాపు రూ.1,000 కోట్ల రాబడి వస్తుందని అంచనావేసినప్పటికీ కరోనా కాటుతో అది రూ.480 కోట్లు తగ్గింది. వాహన రిజిస్ట్రేషన్ల ద్వారా మార్చినెలలో రూ. 380 కోట్ల వరకు రాబడి వస్తుందనుకొంటే అందులో సగం కూడా రాలేదు. అలాగే అలాగే ఆబ్కారీశాఖకు గతనెలలో దాదాపు రూ.400 కోట్ల నష్టం వచ్చినట్లు తెలుస్తున్నది.

### ప్రతిపైసా ప్రజల కోసమే

**డిపాజిట్ల వివరాల కోసం ఆర్థికశాఖ ఉత్తర్వులు**

కరోనా మహమ్మారి బారినుంచి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుక్షణం ఎంతో అప్రమత్తతతో వ్యవహరిస్తున్నది. ఓవైపు ఆర్థిక సంక్షోభాన్ని దీటుగా ఎదుర్కొంటూనే మరోవైపు ప్రజారోగ్య రక్షణకు ఎలాంటి ముప్పులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నది. కరోనాపై మరో మూడు వారాలపాటు అలుపెరుగని పోరాటం చేసేందుకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ప్రజలకు అత్యవసర సేవలతోపాటు ఆహారానికి, ఆరోగ్యానికి ఆటంకం లేకుండా చూసేందుకు ప్రతి పైసానూ పక్కాగా లెక్కించి వెచ్చిస్తున్నది. ఈ క్రమంలో గతనెలాఖరు వరకు అన్ని బ్యాంకుల్లో వివిధ డిపాజిట్ల రూపంలో ఉన్న నగదు వివరాలను అందించాలని రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. అన్ని కార్పొరేషన్లు, సంస్థలు, సహకార సంఘాల్లోని సేవింగ్స్, కరెంట్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాలను తక్షణమే అందజేయాలని ఆయా శాఖల అధిపతులను, యూనిట్ ఆఫీసర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రొఫార్మాను ఉత్తర్వులతో జతచేశారు.



ప్రభుత్వం హైదరాబాద్‌లో ఉన్న 99 మంది అమెరికన్లను మంగళవారం ఎయిరిండియా ప్రత్యేక విమానం ద్వారా వారి దేశానికి తరలించింది. – శంషాబాద్

## సలహా కోసం మెడికల్ హెల్ప్‌లైన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ వేళ ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్యుల సలహాలు, సూచనలు అందించేందుకు ఫోరం ఫర్ పీపుల్స్ హెల్త్ సంస్థ ఏర్పాటుచేసిన మెడికల్ హెల్ప్‌లైన్ నంబర్‌కు భారీ స్పందన లభిస్తున్నది. 040–48214595 నంబర్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఈ నెల 1న నుంచి మంగళవారం వరకు 5 వేల కాల్స్ చేశారని సంస్థ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య సమస్యలపై సాయం పొందినట్టు చెప్పారు. ఎమర్జెన్సీ కేసుల పరిష్కారం కోసం రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక వలంటీర్‌ను నియమించినట్టు సంస్థ ప్రతినిధి రమేశ్‌బీంరెడ్డి తెలిపారు.

## కరోనాపై పోరులో మేము సైతం..

- ముందుకొచ్చిన 7,600 మంది ఫార్మా వైద్యులు
- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్తా
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనాపై పోరాటానికి వైద్యపరంగా సాగిస్తున్న యజ్ఞంలో ఫార్మా వైద్యులు ముందుకు వచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్తానని ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ తెలిపారు. ఫార్మా డీ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ చంద్రశేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో ఫార్మా వైద్యులు రూప, నరేశ్, రాంరెడ్డి మంగళవారం బీ వినోద్‌కుమార్‌తో సమావేశమై తమ సేవలను వినియోగించుకోవాల్సిందిగా సూచించారు. ఫార్మా డీ వైద్యుల సేవలను ఉపయోగించుకొనేలా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకొంటామని ఈ సందర్భంగా వారికి వినోద్ అభయమిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,900 మంది ఫార్మా విద్యార్థులు, 5,700 మంది ఫార్మా పట్టభద్రులు ప్రభుత్వం అందిస్తున్న కరోనా సేవల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని, తమ సేవలను వినియోగించుకోవాలని కోరుతూ సీఎం కేసీఆర్, మంత్రి ఈటల రాజేందర్‌కు రాసిన లేఖలను వినోద్‌కుమార్‌కు చంద్రశేఖర్‌నాయక్ అందించారు.

## వ్యాక్సిన్ తయారీలో ఐఐఎల్

- ఆస్ట్రేలియా గ్రిఫిత్ వర్సిటీతో ఒప్పందం
- క్లినికల్ ట్రయల్స్ దశలో జికావైరస్ టీకా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచవ్యాప్తంగా 55 వేల మందికి పైగా పొట్టన పెట్టుకున్న కొవిడ్–19 నియంత్రణకు మందును కనుగొనే ప్రయత్నాలను హైదరాబాద్‌లోని ఇండియన్ ఇమ్యూనలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) ముమ్మరం చేసింది. ఇందుకోసం ఆస్ట్రేలియాకు చెందిన గ్రిఫిత్ విశ్వవిద్యాలయంతో కలిసి అధ్యయనం చేయడానికి ఒప్పందం కుదుర్చుకొన్నది. ఒప్పందం ప్రకారం.. కరోనా కట్టడికి సింగిల్ డోస్ టీకాను కనుగొనడానికి హైదరాబాద్ శాస్త్రవేత్తలు కృషిచేస్తారు. వ్యాక్సిన్ తయారుచేశాక ఐఐఎల్‌కు అందజేస్తారు. ద సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి అనుమతి తీసుకొని విడుతలవారీగా క్లినికల్ ట్రయల్స్ ఐఐఎల్ నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా ఐఐఎల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్న దేశ్‌పాండే మాట్లాడుతూ.. ప్రపంచంలో అందుబాటులో ఉన్న అవకాశాల గురించి అధ్యయనం చేశాక కాడన్ డీఆప్టమైజేషన్ టెక్నాలజీ ఆధారంగా కొవిడ్–19కు టీకా కనుగొనే ప్రయత్నాన్ని ప్రారంభించామన్నారు. అత్యున్నత ప్రమాణాలున్న వ్యాక్సిన్లను అతిత్వరలో అందుబాటు ధరలో అందించాలన్నదే లక్ష్యమని చెప్పారు. గతంలో వచ్చిన జికా వైరస్‌కు టీకాను ఇప్పటికే తయారుచేశామని, అది క్లినికల్ ట్రయల్స్ దశలో ఉన్నదని తెలిపారు.

# కరోనా.. న్యూ'మార్క్'



కరోనా నేపథ్యంలో దవాఖానల్లోని పారిశుద్ధ్య పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గువాహటిలో బారులుతీరిన జనం

## 'నీకు కరోనా సోకాలి'

**కోల్‌కతా:** న్యాయమూర్తికి కరోనా సోకాలంటూ ఒక లాయర్ శాపనార్థాలు పెట్టాడు. ఈ ఘటన కోల్‌కతాలో చోటుచేసుకున్నది. లోన్‌ను చెల్లించనందుకు తన కక్షిదారుకు చెందిన బస్సును బ్యాంకు అధికారులు సీజ్ చేశారని, దీనిపై అత్యవసరంగా విచారణ జరుపాలని కోరుతూ న్యాయవాది బిజోయ్ అధికార్లై హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే, కరోనా నేపథ్యంలో దీనిపై అత్యవసర విచారణకు న్యాయమూర్తి జస్టిస్ దీపంకర్ నిరాకరించారు. దీంతో ఆగ్రహానికి గురైన బిజోయ్ జడ్జిని ఉద్దేశిస్తూ 'నీకు కరోనా సోకునుగాక' అంటూ శాపనార్థాలకు దిగాడు. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి బిజోయ్‌పై కోర్టుధిక్కార చర్యలకు ఆదేశించారు.

## ఇకపై ఒక్కసారి ఒక్కరికే షేరింగ్



**న్యూఢిల్లీ:** మహమ్మారి కరోనా వైరస్ ఒకవైపు ప్రపంచాన్ని వణికిస్తుంటే.. మరోవైపు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న కరోనా వదంతులు మరింత భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో కరోనా వైరస్‌కు సంబంధించిన తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా అడ్డుకొనేందుకు వాట్సాప్ కీలక నిర్ణయం తీసుకొన్నది. ఇప్పటివరకు ఒక్కో మెసేజ్‌ను ఒకేసారి ఐదుగురికి షేర్ చేసేందుకు వీలుండేది. తాజా చర్యతో భారత్ సహా అన్ని దేశాల్లోని వాట్సాప్ యూజర్లు ఇకపై ఒక్కసారి ఒక్కరికే షేర్ చేసేలా కట్టుదిట్టం చేసింది. దీని వల్ల 25 శాతం మేరకు ఫేక్ న్యూస్ షేర్ చేయడం తగ్గుతుందని వాట్సాప్ సంస్థ భావిస్తున్నది.

## కరోనా పోరాటంలో ఫేస్‌బుక్!



**శాన్‌ఫ్రాన్సిస్కో:** కరోనాపై పోరాటంలో వైద్యులు, అధికారులకు సహకారాన్ని అందించేందుకు ఫేస్‌బుక్ ముందుకొచ్చింది. వైరస్ ఉద్ధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల సమాచారాన్నిమ్యాపుల రూపంలో ఇవ్వనున్నట్టు పేర్కొంది. ఇందుకోసం తన ఖాతాదారుల కదలికల సమాచారం, విదేశాల్లోని బంధువులు, మిత్రులతో వాళ్లు ఎక్కడెక్కడ కలుసుకున్నారన్న వివరాల్ని మ్యాపుల రూపంలో అందించనున్నట్టు వెల్లడించింది. దీంతో వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాలు తెలుస్తాయని పేర్కొంది.

- న్యూయార్క్‌లో సగటున రెండు నిమిషాలకు ఒకరు మృతి
- శాపంగా మారిన అధిక జనసాంద్రత.. మృత్యువుకు బాటలు వేసిన నిర్లక్ష్యం
- ఖననానికి చోటులేక ట్రక్కుల్లోనే శవాల గుట్టలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అగ్రరాజ్యం అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్క్‌లో కరోనా విలయతాండవం చేస్తున్నది. దేశం మొత్తం మీద చోటు చేసుకున్న కేసుల్లో మూడో వంతు ఇక్కడే వెలుగు చూశాయి. ప్రపంచంలోనే అత్యంత జన సాంద్రత గల నగరాల్లో ఒకటిగా ఉండటంతో న్యూయార్క్‌లో కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తున్నది. చదరపు మైలుకు 28,000 మంది పౌరులు ఉండటం వల్ల వైరస్ త్వరగా వ్యాపించింది. ఒకరు తాకిన వస్తువులు మరొకరు తాకడం, నిర్ణీత దూరం పాటించడంలో అలసత్వం వల్లనే వైరస్ త్వరగా వ్యాపించినట్లు నిపుణులు చెబుతున్నారు. వైరస్ భయం, అధికారుల ఆంక్షల కారణంగా నిత్యం రద్దీతో ఉండే రోడ్లు వెలవెలబోతున్నాయి. ప్రతి ఏటా నాలుగు కోట్ల మంది తిలకించే, న్యూయార్క్‌కే తలమానికమైన టైం స్క్వైర్ బోసిపోయింది.

### 44 శాతం మరణాలు

న్యూయార్క్ రాష్ట్రం అమెరికాలో కీలకమైనది. ఈ రాష్ట్ర జనాభా సుమారు 1.95 కోట్లు. ఇందులో 1.32 అక్షల మందికి కరోనా సోకింది. సుమారు 5,486 మంది మరణించారు. అమెరికాలోని మిగిలిన 49 రాష్ట్రాల్లో నమోదైన మరణాల్లో ఇక్కడే ఏకంగా 44 శాతం వరకు మరణాలు సంభవించడం గమనార్హం. సోమవారం ఒక్కరోజే 731 మంది మరణించారు. అంటే సగటున ప్రతి రెండు నిమిషాలకు ఒక వ్యక్తి మరణించాడు. వైద్య సిబ్బంది, సామగ్రి కొరత వేధిస్తుండటంతో కరోనా రోగ నిర్ధారణ పరీక్షలు చేయడం వైద్యులకు సాధ్యపడటం లేదు. చాలామందికి టెలి మెడిసిన్ ద్వారా పరీక్షలు చేసి సూచనలు చేస్తున్నారు.

నిద్ర ఎరుగని నగరం (సిటీ ఆఫ్ నెవర్ స్లీప్స్)గా పేరుగాంచిన న్యూయార్క్ ప్రస్తుతం ఘోస్ట్ సిటీ (దయ్యాల నగరం)ని తలపిస్తున్నది. అధిక జనసాంద్రత ఆ నగరానికి శాపంగా మారింది. కరోనా దెబ్బకు రోజూ వందలాది మంది పిట్టల్లా రాలిపోతున్నారు.

### శవాలకు లేపనాలు

న్యూయార్క్‌లో పెద్ద సంఖ్యలో మరణాలు నమోదవుతుండటంతో శవాలను భద్రపరచడం, ఖననం చేయడం నగర అధికారులకు పెను సవాలుగా మారుతున్నది. శవాల ద్వారా వైరస్ సోకే ప్రమాదం ఉండటంతో కొన్నింటిని ప్రభుత్వమే ఖననం చేస్తున్నది. మరికొన్నింటిని లేపనాలు రాసి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శవాగారాల్లో భద్రపరుచుతున్నారు. ఒకేసారి వందల సంఖ్యలో మృతదేహాలు రావడంతో దవాఖానల్లో భద్రపరిచే స్థలంలేక రిఫ్రిజిరేటర్ ట్రక్కుల్లో శవాలను ఉంచాల్సిన పరిస్థితి నెలకొన్నది. దవాఖానలు, మార్చురీలు, ఫ్రీజర్ ట్రక్కులు, శ్మశాన వాటికలు అన్నీ కరోనా మృతులతో నిండిపోయాయని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శవాలను పేటికల్లో ఉంచి ఒకేసారి వరుసగా పదింటిని భూమిలో ఖననం చేయడం వల్ల శవాలు ఒకేసారి పేరుకుపోకుండా ఉండటంతో పాటు తక్కువ మేర తవ్వకంతోనే అంత్యక్రియలు పూర్తవుతాయని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. శవాల సామూహిక ఖననం కోసం చారిత్రక హర్ట్ ఐలాండ్‌ను పరిశీలిస్తున్నామని అధికారులు ప్రకటించారు. హర్ట్ ఐలాండ్ చారిత్రకమైనది. 1864లో ఆర్మీ శిక్షణ కేంద్రంగా ఉండేది. 1985లో పెద్ద ఎత్తున మరణించిన హెచ్ఐవీ/ఎయిడ్స్ రోగుల శవాలను ఇక్కడ పూడ్చారు. 2012లో సాండీ హరికేన్ వచ్చినపుడు ఇది ధ్వంసమై గతంలో పూడ్చిన శవాల తాలూకు బొక్కలు, పుర్రెలు భారీ ఎత్తున బయటపడ్డాయి. న్యూయార్క్ కౌన్సిల్ ప్రస్తుతం దీనిని నగర పార్కులు, వినోద కేంద్రాల విభాగం పరిధిలోకి తీసుకువచ్చింది.



కరోనా ఆంక్షల నేపథ్యంలో బోసిపోయిన న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్‌స్క్వేర్ ప్రాంతం

## అమెరికాలో తెలుగు జర్నలిస్టు మృతి

- కరోనాతో బ్రహ్మ కూచిభొట్ల కన్నుమూత
- న్యూయార్క్, న్యూజెర్సీల్లో ఎన్నారైల విలవిల

**వాషింగ్టన్:** అమెరికాలోని భారత సంతతి వ్యక్తులు కరోనాతో విలవిలలాడుతున్నారు. వైరస్ బారినపడి ఒక మాజీ జర్నలిస్టు మరణించగా.. వెంటిలేటర్ల మీదున్న మరికొందరు ప్రాణాలతో పోరాడుతున్నారు. వైరస్ వ్యాప్తికి కేంద్రాలుగా ఉన్న న్యూయార్క్, న్యూజెర్సీలోనే భారత సంతతివారు అధికంగా ఉన్నారు. ఇటీవల వైరస్ సోకిన ప్రముఖ ఇండో-అమెరికన్ జర్నలిస్ట్, యూఎన్‌ఐ వార్త సంస్థ మాజీ రిపోర్టర్ బ్రహ్మ కూచిభొట్ల న్యూయార్క్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి కన్నుమూశారు. ఓహియోలోని మియామీ వ్యాలీ దవాఖాన గుండె సంరక్షణ పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ముకుల్ ఎస్ చంద్ర, హ్యూస్టన్‌లో ఉండే ఐటీ ఉద్యోగి రోహన్ బావ్‌దేకర్ వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడుతున్నారు. సిలికాన్ వ్యాలీలోని ఓ ఐటీ ఇంజినీర్ నిత్యావసరాల కోసం బయటకు వెళ్లగా వైరస్ సోకింది. ఆయన నుంచి కుటుంబ సభ్యులకు ఇది వ్యాపించింది. కాగా, తమ సమూహంలోని నలుగురు సభ్యులను కోల్పోయినట్లు అమెరికాలోని కేరళ సంఘాల సమాఖ్య విచారం వ్యక్తం చేసింది. మరోవైపు సహాయం కోసం భారత సంతతివారి నుంచి తమకు రోజూ అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయని సేవా ఇంటర్నేషనల్ సంస్థ పేర్కొంది.

### కరోనా క్లాక్

7-4-2020

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 14.11 లక్షలు |
| కోలుకున్నవారు | 3,00,760 |
| మరణాలు | 81,000 |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 3,86,570 | 12,270 |
| స్పెయిన్ | 1,40,510 | 13,897 |
| ఇటలీ | 1,35,585 | 17,125 |
| ఫ్రాన్స్ | 1,09,069 | 10,328 |
| జర్మనీ | 1,06,739 | 1,942 |
| చైనా | 81,740 | 3,331 |
| ఇరాన్ | 62,589 | 3,872 |
| యూకే | 55,242 | 6,159 |
| టర్కీ | 34,109 | 725 |
| స్విట్జర్లాండ్ | 22,253 | 821 |

| | |
|---|---|
| దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 4,789 |
| కోలుకున్నవారు | 352 |
| మరణాలు | 124 |

### దేశంలో కరోనా కేసులు

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 1,018 | తమిళనాడు 621 | ఢిల్లీ 576 |
| తెలంగాణ 404 | రాజస్థాన్ 343 | ఉత్తరప్రదేశ్ 332 |
| కేరళ 327 | మధ్యప్రదేశ్ 313 | ఏపీ 314 |
| కర్ణాటక 175 | గుజరాత్ 175 | హర్యానా 129 |
| కశ్మీర్ 116 | ప. బెంగాల్ 91 | పంజాబ్ 91 |

## ఒకరి నుంచి సగటున 406 మందికి!

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్, నిర్ణీత దూరం వంటి జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే, ఒక కరోనా బాధితుడు 30 రోజుల్లో సగటున 406 మందికి వైరస్‌ను వ్యాప్తిచేయగలడని ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) అధ్యయనం వెల్లడించింది. ముందస్తు జాగ్రత్తలు చేపడితే, అదేవ్యవధిలో వైరస్ సగటున రెండున్నర మందికే వ్యాప్తి అవుతుందని తెలిపింది. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ మంగళవారం ఈ అధ్యయన వివరాలు తెలిపారు.



## జపాన్‌లో 'ఎమర్జెన్సీ'

**టోక్యో:** జపాన్‌లో కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఆ దేశ ప్రధాని షింజో అబే అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటించారు. రాజధాని టోక్యోతోపాటు ఆరు ప్రాంతాల్లో ఈ ఎమర్జెన్సీ నెలరోజులపాటు అమల్లో ఉంటుందన్నారు. ప్రజల ప్రాణాలతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థపై కరోనా తీవ్ర ప్రభావం చూపుతున్నదని, ఈ నేపథ్యంలో ఎమర్జెన్సీ ప్రకటించాల్సి వచ్చిందని ఆయన చెప్పారు.



## కరోనా వైరస్‌లను అడ్డుకునే మెర్స్ వ్యాక్సిన్!

**వాషింగ్టన్:** ఎలుకల్లో మెర్స్ వైరస్‌ను పీఐవీ5 అనే కొత్త వ్యాక్సిన్ సమర్థంగా అడ్డుకున్నట్లు పరిశోధకులు తెలిపారు. కొవిడ్-19తో సహ ఇతర కరోనావైరస్‌లకు వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసేందుకు ఇది దోహదపడుతుందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అమోవా, యూనివర్సిటీ ఆఫ్ జార్జియాకు చెందిన పరిశోధకులు వెల్లడించారు.

## కరోనాతో అకాల ప్రసవం.. శిశువు మృతి

**వాషింగ్టన్:** కరోనా బారిన పడిన ఒక మహిళ.. నెలలు నిండకుండానే ప్రసవించడంతో శిశువు మరణించింది. ఈ ఘటన అమెరికాలోని లూసియానా రాష్ట్రంలో జరిగింది. అయితే, ప్రసవించిన శిశువుకు కరోనా పరీక్ష నిర్వహించకపోయినప్పటికీ ఇది కరోనా సంబంధిత మరణమేనని డాక్టర్ విలియం బూ క్లార్క్ సోమవారం ప్రకటించారు. బాధిత గర్భిణీకి ఇటీవల కరోనా సోకింది.



## మద్యం అమ్మకాలను అనుమతించాలి

**న్యూఢిల్లీ:** మద్యం అమ్మకాలను అనుమతించాలని మద్యం తయారీ సంస్థల సమాఖ్య (సీఐఏబీసీ) పది రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ, ఢిల్లీ, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సీఎంలకు సీఐఏబీసీ సోమవారం లేఖలు రాసింది. మద్యం అమ్మకాలపై నిషేధం విధించడం వల్ల కల్తీ మద్యం అమ్మకాలకు దారితీస్తున్నదని పేర్కొన్నది.

## రోడ్డుపై ఉమ్మాడు.. నిర్బంధంలోకి వెళ్లాడు

**జమ్ము:** రోడ్డుపై అదేపనిగా ఉమ్మిన ఓ ఉద్యోగిని పోలీసులు నిర్బంధ కేంద్రానికి తరలించారు. ఈ ఘటన జమ్ములో చోటుచేసుకున్నది. బంధువులను కలిసేందుకు జమ్ములోని పలౌరా ప్రాంతానికి వెళ్లిన ఓ ఉద్యోగి అదేపనిగా రోడ్డుపై ఉమ్ముతూ, ముక్కు చీదడంతో స్థానికులు భయపడి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు అతన్ని నిర్బంధ కేంద్రానికి తరలించారు. నమూనాలను పరీక్షకు పంపారు.

# 'ఆరోగ్యసేతు'తో ఆరోగ్యం

### స్వీయ పరిశీలనకు దోహదంచేసే కరోనా వైరస్ ట్రాకింగ్‌కు యాప్




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నది. కరోనా వైరస్ ట్రాకింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం 'ఆరోగ్యసేతు' యాప్‌ను రూపొందించింది. వైరస్ వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దేశవ్యాప్తంగా బాధితుల సంఖ్య, తాజాపరిస్థితులు ప్రజలకు అందించేలా నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ద్వారా ఈ యాప్ వినియోగంలోకి వచ్చింది. కొన్నిరోజుల్లోనే ఈ యాప్‌ను లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆండ్రాయిడ్, ఐఫోన్ ద్వారా బ్లూటూత్ లొకేషన్, మొబైల్ ఫోన్‌నంబర్ ఆధారంగా వైరస్ బారిన పడ్డవారిని కలిశామా లేదా ఈ యాప్‌తో స్వయంగా తెలుసుకోవచ్చు. యాప్ ఐవోఎస్ ఆపరేటింగ్ సిస్టంలకు కూడా అందుబాటులో ఉంది.

### డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ ఇలా..

ఆండ్రాయిడ్ వినియోగదారులు ప్లేస్టోర్ నుంచి, ఐఫోన్ వినియోగదారులు యాప్‌స్టోర్ నుంచి ఆరోగ్యసేతు యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇది హిందీ, ఇంగ్లిష్, తెలుగు, గుజరాతీ, కన్నడ, తమిళం, మలయాళం, ఒరియా, పంజాబీ, మరాఠీ భాషల్లో అందుబాటులో ఉంది. యాప్‌ను ఓపెన్‌చేసిన వెంటనే భాషను ఎంచుకోవాలి. యాప్ డౌన్‌లోడ్ సమయంలో మొబైల్ నంబర్, బ్లూటూత్ లొకేషన్ వంటి పర్మిషన్లు అడుగుతుంది. ప్రభుత్వం రూపొందించిన యాప్ కావడంతో పర్మిషన్లు ఇవ్వడానికి భయపడాల్సిన అవసరం లేదు. యాప్‌లో మొబైల్ నంబర్ రిజిస్టర్ చేసిన అనంతరం ఓటీపీ ద్వారా వెరిఫై చేయాలి. పేరు, వృత్తి, వయసు, విదేశాలకు వెళ్లివచ్చారా? వంటి ప్రశ్నలను సమాధానం ఇవ్వాలి. యాప్‌లో తమనుతాము వాలంటీర్లుగా నామినేట్ చేసుకునే అవకాశం ఉంది.

### ఆకుపచ్చ రంగు వస్తే క్షేమం

యాప్ ఇన్‌స్టాల్ ప్రక్రియ పూర్తిచేశాక పైభాగంలో ఆకుపచ్చ రంగు వస్తే క్షేమంగా ఉన్నట్టు. ఇది వైరస్ బారిన పడకుండా సామాజిక దూరం పాటించి, ఇంట్లోనే ఉండాలి వంటి జాగ్రత్తలను తెలుపుతుంది. ఒకవేళ మీరు ఇచ్చిన సమాధానాల ప్రకారం పైభాగంలో పసుపు రంగులో కనిపిస్తే మీరు ప్రమాదంలో ఉన్నట్టే.. కరోనా వైరస్‌కు సంబంధించి అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచిస్తుంది. వెంటనే అధికారులను సంప్రదించడం మంచిది. ఇందులో కొవిడ్-19 హెల్ప్‌లైన్ సెంటర్ల వివరాలను కూడా తెలుసుకోవచ్చు.

### వైరస్ పరీక్ష మీరే చేసుకోవచ్చు

వైరస్ సోకిందా అని స్వయంగా పరీక్ష చేసుకునేందుకు యాప్‌లో 'సెల్ఫ్ అసెస్మెంట్ టెస్ట్‌పై' క్లిక్ చేస్తే చాట్‌బాక్స్ ఓపెన్ అవుతుంది. అందులో వయసు, లింగం, ఆరోగ్య పరిస్థితి వివరాలను నమోదుచేస్తే ప్రమాదస్థాయిని యాప్ తెలుపుతుంది. మీ ఫోన్‌లో ఆరోగ్యసేతు యాప్ ఉంటే కరోనా విషయంలో అప్రమత్తంగా ఉండటంతోపాటు ఇతరులకు వ్యాపించకుండా ప్రభుత్వానికి సహకరించినట్టవుతుంది.

## ఐసీయూలో బ్రిటన్ ప్రధాని



**లండన్:** కరోనా లక్షణాలతో బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ దవాఖానా ఐసీయూలో చేరారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఆ దేశ ప్రధాని కార్యాలయం మంగళవారం తెలిపింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే బోరిస్‌ను దవాఖానలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లుగా పేర్కొంది. కరోనా లక్షణాల తీవ్రత పెరుగడంతో బోరిస్ జాన్సన్ (55) సోమవారం లండన్‌లోని ఓ దవాఖాన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తమమైంది. అయితే, బోరిస్ పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నదని అధికారిక ప్రకటన వెలువడింది. బోరిస్ కోలుకోవాలని ప్రధాని నరేంద్రమోదీతోపాటు వివిధ దేశాల అధినేతలు ఆకాంక్షించారు.

## మాస్కులతో వైరస్ కట్టడికాదు

### చేతులు శుభ్రం, నిర్ణీత దూరమే ముఖ్యం: డబ్ల్యూహెచ్‌వో



**జెనీవా:** కేవలం మాస్కులు వాడటంతోనే కరోనాను కట్టడి చేయలేమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అధిపతి టెడ్రోస్ అధానోమ్ గేబ్రియేసస్ తెలిపారు. చేతులు శుభ్రం చేసుకోవడం, నిర్ణీత దూరం పాటించడమే ఎంతో ముఖ్యమన్నారు. అయితే సంక్షోభ ప్రాంతాల్లో దుర్భర జీవితం గడుపుతూ సామాజిక దూరం పాటించలేనివారు, నీటి వసతి లేక చేతులు శుభ్రం చేసుకోలేనివారు సాధారణ మాస్కులు ధరించడం మేలన్నారు. వైరస్ సోకిన వారికి చికిత్స అందించే వైద్య సిబ్బంది, వారికి సేవలు చేసేవారు వైద్యపరమైన మాస్కుల కొరత ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో సాధారణ ప్రజలు వీటిని వినియోగించవద్దని టెడ్రోస్ సూచించారు. కాగా, కరోనా టీకాను ఆఫ్రికా ప్రజలపై ప్రయోగించాలన్న ఇద్దరు ప్రముఖ ఫ్రెంచ్ డాక్టర్ల వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు.

## ఒడిశాలో మాస్క్ లేదా గుడ్డ తప్పనిసరి!

**భువనేశ్వర్:** కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ఒడిశా రాష్ట్రం మాస్క్ లేదా గుడ్డను తప్పనిసరి చేసింది. ఇంటినుంచి బయటికివచ్చేవారు ముక్కు, నోటికి అడ్డుగా కనీసం రెండు వరుసలు ఉండే మాస్క్ లేదా చేతిరుమాలును ధరించాలని సూచించింది. ఈ ఆదేశాలు గురువారం ఉదయం 7 గంటలనుంచి అమలుచేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో దేశంలో ఈతరహా ఆదేశాలిచ్చిన తొలిరాష్ట్రంగా ఒడిశా నిలిచింది.



## సూక్ష్మక్రిములను తరిమేసే యంత్రం

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ నేపథ్యంలో నిత్యం దవాఖానలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం సిబ్బందికి తలకు మించిన భారంగా తయారైంది. వీరి కష్టాన్ని గుర్తించిన ఐఐటీ గౌహతికి చెందిన ప్రొఫెసర్లు తక్కువ ఖర్చుతో దవాఖానలను సులభంగా శుభ్రం చేసుకొనేందుకు ఒక యంత్రాన్ని రూపొందించారు. ప్రస్తుతం మనుషులే నడిపేలా తయారుచేసిన ఈ యంత్రాలను త్వరలో రొబోటిక్‌గా (దానంతట అదే నడిచేలా) అభివృద్ధి చేయడంపై దృష్టిసారించారు. యూవీసీ ఎల్ఈడీ పద్ధతిలో తయారుచేసిన ఈ యంత్రం దవాఖానల్లోనే కాకుండా బస్సులు, రైళ్లలో కూడా సూక్ష్మక్రిములను పారద్రోలేందుకు పని చేస్తుంది. తక్కువ ఖర్చుతో ఈ యంత్రాలను సిద్ధంచేసి వాణిజ్య అవసరాల కోసం కూడా అందుబాటులో తెచ్చేందుకు పనిచేస్తున్నట్టు ప్రొఫెసర్లు తెలిపారు.

## పిల్లుల కోసమైతే ఓకే!

### ఓ వ్యక్తికి కేరళ హైకోర్టు అనుమతి



**తిరువనంతపురం:** పిల్లుల ఆకలి తీర్చటానికి లాక్‌డౌన్ నిబంధనల నుంచి ఓ వ్యక్తికి కేరళ హైకోర్టు మినహాయింపునిచ్చింది. కొచ్చికి చెందిన ప్రకాశ్ అనే వ్యక్తి తన ఇంట్లో మూడు పిల్లులను పెంచుతున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో వాటికి అవసరమైన బిస్కట్లను కొనుగోలు చేయటానికి వీలుగా తనకు నగరంలో ప్రయాణించటానికి అనుమతి ఇవ్వాలని అధికారులను ఆయన కోరారు. వారు తిరస్కరించారు. దీంతో ప్రకాశ్.. హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయనకు అనుమతినిస్తూ తీర్పు చెప్పింది.



కరోనా నేపథ్యంలో మంగళవారం చెన్నైలో తాగునీటికోసం నిర్ణీత దూరం పాటిస్తూ తమవంతుకోసం వేచి చూస్తున్న స్థానిక ప్రజలు

**చరిత్రలో నేడు - 1929**
ఢిల్లీలోని బ్రిటిష్ సెంట్రల్ అసెంబ్లీలో దేశ స్వాతంత్ర్యాన్ని కోరుతూ కరపత్రాలు వెదజల్లి, బాంబులు వేసిన భగత్‌సింగ్, బటుకేశ్వర్‌దత్ స్వచ్ఛందంగా అరెస్టు.

# వేదిక



*లాక్‌డౌన్, సామాజిక దూరం పాటించకపోయినట్లయితే, కరోనా పాజిటివ్ ఉన్న వ్యక్తి 30 రోజుల్లో దాన్ని 406 మందికి సంక్రమింపజేస్తాడు. లాక్‌డౌన్ నిబంధనలు పాటిస్తే 75 శాతం ప్రమాదం తప్పుతుంది. కనీసం ఇద్దరికి కూడా సోకే అవకాశం ఉండదు.*
*- లవ్ అగర్వాల్, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి*

**నమస్తే తెలంగాణ**

## ఔషధమూ, ఆయుధమూ!

*కరోనా వైరస్ సోకిన వారి చికిత్సకు ఉపయుక్తమని భావిస్తున్న హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఔషధ ఎగుమతులపై నిషేధాన్ని పాక్షికంగా ఎత్తివేయాలన్న భారత్ నిర్ణయంతో పలు దేశాలు ఊరట చెందే అవకాశం ఉన్నది. కరోనా వైరస్ భీతి గొలుపుతున్న నేపథ్యంలో మార్చి 25న ఈ మందు ఎగుమతిపై భారత్ నిషేధం విధించింది. అమెరికా, బ్రెజిల్ మాత్రమే కాకుండా సార్క్, పశ్చిమాసియా తదితర ప్రాంతాలకు చెందిన దాదాపు ముప్పై దేశాలు ఈ నిషేధాన్ని సడలించాలని భారత్‌ను కోరాయి. మనమీదే ఆధారపడిన ఇరుగుపొరుగు దేశాలకు ఎగుమతులను నిలిపివేయకూడదని, ఇదేవిధంగా తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్న దేశాలను కూడా ఆదుకోవాలని భారత్ మానవతా దృక్పథంతో నిర్ణయించింది. అమెరికా పరిస్థితి దారుణంగా ఉందనేది తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్ ఎలాగూ దయతలచి నిషేధాన్ని సడలించేదే. కానీ ఈలోగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిషేధాన్ని ఎత్తివేయకపోతే ప్రతిచర్య తప్పదని పెళుసుగా మాట్లాడకపోవలసింది. అమెరికా వాణిజ్య ఆంక్షలకు భారత్ దీటుగా స్పందించి ఎంతోకాలం కాలేదు. ఈ అనుభవం ఉండి కూడా, అదీ కష్టకాలంలో, మిత్ర దేశంతో ఇంత దురుసుతనం పనికిరాదు.*

*హైడ్రాక్సీక్లోరోక్విన్ ఉత్పత్తిలో మనదేశానిదే అగ్రస్థానం. హైడ్రాక్సీక్లోరోక్విన్‌ను ఆరోగ్య కార్యకర్తలు వ్యాధి నిరోధకంగా ఉపయోగించవచ్చునని భారతీయ వైద్య పరిశోధనా మండలి సూచించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ మందుపై పరిశోధనలు సాగుతున్నాయి. కోవిడ్-19 రోగులు సత్వరంగా కోలుకోవడానికి ఈ మందు దోహదపడిందని చైనా పరిశోధకుల అధ్యయనంలో తేలింది. ఫ్రాన్స్‌లో ఈ మందుపై ప్రయోగాలు సత్ఫలితాలనిచ్చాయి. యూరప్‌లో కూడా కరోనా రోగుల చికిత్సలో భాగంగా దీనిని ఉపయోగిస్తున్నారు. అయినప్పటికీ దీనిపై ఇంకా పరిశోధనలు సాగించవలసి ఉన్నదని శాస్త్రవేత్తలు అంటున్నారు. వైరస్ నాశినిగా కనుక ఈ మందు ధ్రువపడితే సంచలనాత్మకమవుతుంది. అందుకే ఈ మందును అమెరికాలో కోవిడ్-19 రోగులకు విస్తృతంగా వాడి చూడాలని, ఇది 'గేమ్ చేంజర్' అవుతుందని దేశాధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాక్సీక్లోరోక్విన్ ఎగుమతి విషయంలో భారత్ ఆచితూచి వ్యవహరించడంలో తప్పేమీ లేదు.*

*కరోనా వైరస్ కథ ముగిసిన తర్వాత అంతర్జాతీయ రంగంలో 'ఆహారం, ఔషధం' కీలకమైన ఆయుధాలుగా మారుతాయనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. ఇప్పటికే కెనడాకు, లాటిన్ అమెరికాకు వైద్య పరికరాలను ఎగుమతి చేయకుండా కొరియన్ యుద్ధకాలపు చట్టాన్ని అమెరికా ముందుకుతెచ్చింది. జర్మనీకి మాస్కులను తీసుకుపోతున్న విమానాన్ని మధ్యలోనే వెనుకకు పిలిపించుకున్నది. యురోపియన్ దేశాలు ఔషధ, వైద్యపరికరాల ఎగుమతులపై ఆంక్షలు విధించాయి. కొన్ని సందర్భాలు వచ్చినప్పుడే మన బలాబలాలు గుర్తింపునకు నోచుకుంటాయి. కరోనా మహమ్మారి చెలరేగుతున్న నేపథ్యమే 'ప్రపంచ ఔషధాలయం'గా భారత్ ప్రాముఖ్యాన్ని ముందుకుతెచ్చింది. 1960 దశకం నుంచి అనుసరించిన విధానాల వల్ల భారత్ ఔషధ ఉత్పత్తిలో అగ్రశ్రేణి దేశంగా నిలిచింది. దేశంలోని ఔషధ కేంద్రాలలో మన హైదరాబాద్ కూడా ఒకటి. ప్రపంచానికి చౌకగా జనరిక్ మందులను సరఫరా చేసే దేశం మనది. ఈ స్థానాన్ని కాపాడుకోవడం భవిష్యత్తులో మరింత అవసరం.*

# అబద్ధాలు రాజేసిన విద్వేషాలు

**విశ్లేషణ**



**చిరంజీవి ప్రసాద్ సంతపూరు**

మనం ఎవరినైతే ద్వేషిస్తామో వాళ్లను ఎన్నటికీ అర్థం చేసుకోం. ఆ ప్రయత్నం అసలు చేయలేం. ఆ అవివేకతే జాతి వైషమ్యాలకు మూలస్తంభమవుతుందని అమెరికా రచయిత జేమ్స్ రసెల్ ఓవెల్ అంటాడు. ద్వేషం బయటికి కనిపించని రక్కసి. మనసుల్లో గూడుకట్టుకొని మనుషుల మధ్య విభజన రేఖ గీస్తుంది. చిచ్చురేపి సంఘర్షణలకు ఆజ్యం పోస్తుంది. కొన్నిసార్లు ఆ ద్వేషాలకు బలమైన కారణాలేవీ ఉండవు. ఎవరివో వ్యాఖ్యలను ఏ హేతువూ లేకుండా విజ్ఞులు కూడా నిజమేనని నమ్మి వాటిని వ్యాప్తి చేయడం సమాజంలో నేడు చోటుచేసుకుంటున్న దురదృష్టకర పరిణామం.

**కరోనా** విషక్రిమి ప్రకటించిన యుద్ధానికి విశ్వ జీవన గమనమంతా ఒక్కసారిగా స్థాణువై అన్నిదేశాల్లోనూ దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా లాంటి అగ్రరాజ్యం కూడా కరోనా క్రిమి ముందు సాగిలపడింది. ఎలా బయటపడాలో తెలియక దిక్కుతోచక దిక్కులు చూస్తున్నది. ప్రపంచమంతా ప్రాణ భీతితో అల్లాడిపోతున్నది. ఇంతటి కష్టకాలంలో వైరస్‌తో సమాంతరంగా అబద్ధాలూ రాజ్యమేలుతున్నాయి. మనసులను కలుషితం చేసి విద్వేషాన్ని తోడి కరోనా కన్నా వేగంగా విస్తరింపజేస్తున్నాయి. ఈ అబద్ధమనే వైరస్ ధాటికి అందరికన్నా ఎక్కువగా నష్టపోతున్నది ముస్లింలు.

సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎవరికైనా ఏ అంశంపైనైనా స్వేచ్ఛగా వ్యాఖ్యానించే అవకాశం లభించింది. కానీ చాలా మటుకు వ్యాఖ్యల్లో వాస్తవాల రూఢీ, విచక్షణ లోపించడంతో అవి కాస్తా ద్వేష వ్యాఖ్యలుగా మారుతున్నాయి. అన్నింటికన్నా ఎక్కువగా వ్యాప్తి చెందిన అబద్ధాలను ఓసారి పరిశీలిద్దాం. కరోనాను వ్యాప్తి చేసేందుకు ఓ వ్యక్తి పోలీసు వ్యానులో పోలీసులపై ఉమ్మేశాడనేది బాగా ప్రచారమైన పెద్ద అబద్ధం. వాస్తవానికి మార్చి 2న ముంబైలో జరిగిన ఘటన అది. జైల్లో ఉన్న తనకు కుటుంబసభ్యులు తీసుకొచ్చిన ఆహారాన్ని అనుమతించలేదని ఓ ఖైదీ పోలీసులతో గొడవ పడుతున్న దృశ్యాన్ని వార్తగా 'టైమ్స్ ఆఫ్ ఇండియా' అదేరోజు యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసింది. అప్పటికి కరోనా నియంత్రణకు భారతదేశం తీసుకుంటున్న చర్యలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఆ వీడియో అప్‌లోడ్ తేదీ, నేపథ్యం అన్నీ ఆ లింకు కిందే స్పష్టంగా 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పేర్కొన్నప్పటికీ అదే వీడియో కింద ఇప్పటికీ ద్వేషపూరితమైన వ్యాఖ్యలు వరదలా ప్రవహిస్తూనే ఉన్నాయి. మర్కజ్ నుంచి వచ్చినవారే అలా ఉమ్మేస్తున్నారని ఆ లింకు కింద కామెంట్లు వస్తూనే ఉండటం వారి అజ్ఞానానికి నిలువెత్తు నిదర్శనం. ఇలాంటిదే మరొకటి. గట్టిగా తుమ్మేలా, చీదేలా ఓ మసీదులో అభ్యసన చేయిస్తూ వైరస్ వ్యాప్తికి శిక్షణ ఇస్తున్నారని ఎవరో ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. తీరా దాని మూలాలు శోధిస్తే అది జనవరి నెలాఖరులో పాకిస్థాన్‌లోని సూఫీ మతస్థులు కొందరు తమ ఆచారాలను అనుసరించి చేస్తున్న ప్రార్థనకు సంబంధించిన వీడియో అని తేలింది. కంటికి కనిపించే ప్రతి దృశ్యం వెనుక ఓ నేపథ్యం, చరిత్ర ఉంటుందన్న వాస్తవాన్ని తెలుసుకోకుండా తొందరపాటుగా విషాన్ని వెదజల్లారు. ఇస్లాంకు చెందిన షియా బోహ్రాలు ఒకే కంచంలో కలిసి తింటారు. భగవంతుడిచ్చిన ఏ ఒక్క మెతుకూ వృథాగా వదిలేయకూడదని వాళ్ల ఆచారం బోధిస్తుంది. 2018 జూలై కంటే ముందునాటి అటువంటి వీడియోను ఇప్పుడు సోషల్ మీడియాలో పెట్టి కరోనాను వ్యాప్తి చేయిస్తున్నారనే ద్వేషం వెదజల్లారు. ఎంత అసమంజసం. 2019 డిసెంబర్‌లో నిజాముద్దీన్‌లో ప్రార్థన సమయంలో చేతులు కడుక్కొంటున్న వీడియోను ఇప్పుడు మళ్లీ వైరల్ చేసి వైరస్ వ్యాప్తికి కారణమంటూ విద్వేషాలను బలంగా నాటగలిగారు. ఇలాంటివే మరికొన్ని వీడియోలపైన పని కట్టుకొని దుష్ప్రచారం చేశారు.




> సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎవరికైనా ఏ అంశంపైనైనా స్వేచ్ఛగా వ్యాఖ్యానించే అవకాశం లభించింది. కానీ చాలామటుకు వ్యాఖ్యల్లో వాస్తవాల రూఢీ, విచక్షణ లోపించడంతో అవి కాస్తా ద్వేష వ్యాఖ్యలుగా మారుతున్నాయి.

పైన చెప్పిన వీడియోల మూలాలను శోధించి అవి అబద్ధమని నిగ్గుతేల్చిన నిజ నిర్ధారణ వేదిక 'తెలంగాణ ఫ్యాక్ట్‌చెక్ వెబ్‌సైట్' నిర్వాహకులు అభినందనీయులు. ఈ సమయంలో https://factcheck.telangana.gov.in వాళ్లు చేస్తున్న కృషి అసామాన్యం. ఎవ్వరికైనా సరే ఏ వీడియోనైనా అనుమానాస్పదంగా తోస్తే వెంటనే ఫ్యాక్ట్ చెక్ వెబ్‌సైట్‌ను సంప్రదించండి. ఏది రియల్‌లో.. ఏది వైరల్‌లో.. తెలుసుకోండి. చైనాలోని వూహాన్‌లో జన్మించిన కరోనా వైరస్ విమానమెక్కి జనవరి 30న కేరళకు చేరుకున్నది. మిగిలిన అన్నిచోట్లకూ సరిహద్దులు దాటే వైరస్ ప్రవేశించింది అంతే తప్ప ఏ గుడిలోనో, ఏ గురుద్వారాలోనో, ఏ మసీదులోనో, ఏ చర్చిలోనో, ఏ జైన మందిరంలో నో పుట్టలేదు. చనిపోయిన తర్వాత కానీ వాళ్లకు వైరస్ సోకిందని తెలుసుకోలేకపోయాం. ఉద్దేశపూర్వకంగా వైరస్ వ్యాప్తి చెందించాలనుకునేవాళ్లు తమ కుటుంబసభ్యులకు అంటిస్తారా? అదెలా సాధ్యమవుతుందని తార్కికంగా ఆలోచిస్తే చాలా విషయాలు బోధపడుతాయి. మనకు తెలియని విషయాన్ని శోధించి, సాధించి తెలుసుకోవాలి. అంతే తప్పా దేనినైనా మూర్ఖంగా నమ్మడం తగదు. మీరు విన్న వార్తలు, మీరు చూసిన వీడియోలు నిజమని తేలితేనే మరొకరికి చెప్పడం శ్రేయస్కరం. హేతుబద్ధంగా ఆలోచించడం ఆరోగ్యదాయకం. అంతవరకు వదంతులు, అబద్ధాలు వ్యాప్తి చెందకుండా సంయమనం పాటిస్తే ఈ కష్టకాలంలో అంతకుమించిన సాయమేమీ అవసరం లేదు. ఎందుకంటే కరోనా వైరస్ తెచ్చే నష్టాల నుంచి శ్రమించి బయటపడవచ్చు. కానీ ఈ అబద్ధాలు రాజేసే విద్వేషపు మంటలను చల్లార్చడం సులువైన విషయం కాదు. ద్వేషించడం కూడా ఓ వైరస్ అని మరిచిపోవద్దు.

## కనికరం లేని కఠిన జీవి..!

**చేతులును కరోన..**
చేష్టతో చేదాయె
ముక్కు మూతి కనులు..
ముట్టరాదు!
మాటి మాటికిలను
మంచిగా కడగాలి
లేకపోతె బతుకు..లేవిడాయె!!

దగ్గరానివాడు..
ధరలోన ధీరుడు
తుమ్ము లేనివాడు..
తుదకు మేటి!
జలుబు లేని వాడు..
జగదేక వీరుడు!
ఏమికాని వాడు.. ఏలు భువిని!!

ఇంటిలోని మొగుడు..
ఇంపైన దూరమే
కంటిలోని నలుసు..
కల్గు భయము
ముక్కులోని పక్కు
ముల్లుతో సమమాయె
నోటి యందు వేలు పెట్టరాదు!!

ఎవరి కిలను వారు
ఎదలోన బాధతో
ఇచ్ఛగించ నైరి ఇతరులందు
సొంత పనులు తప్ప
సోదింతయును లేదు
కనికరంబు లేని కఠినజీవి!!

ముక్కు తుమ్ము నీకు
ముదమాయెను కరోనా
చీదు కఫము తినగ తీపులాయె!
నీదు బతుకు దెల్సి
నెమ్మళముగనుండ..
పారి పోవలయును
ప్రజల నుండి...



**డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి**
**85558 99493**

# కరోనాపై కలం కవాతు

> విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు, యుద్ధ మేఘాలు కమ్ముకొస్తున్నప్పుడు ప్రజాసమూహాలకు ధైర్యాన్ని ఆత్మస్థైర్యాన్ని ఇచ్చే శక్తి సాహిత్యానికి ఉన్నది. కరోనా లాంటి భూత మొకటి జడలు విప్పుకొని దేశదేశాల మీద దాడిచేస్తున్న సందర్భంలో మృత్యుఘంటికలు మోగిస్తున్నప్పుడు ప్రజలకు మనోధైర్యాన్ని కలుగజేసి ఆ రక్కసిపై పోరాడేందుకు కవులు, రచయితలు, కళాకారులు సాహిత్య సృష్టి చేయాలని సీఎం కేసీఆర్ కోరారు.

**తెలంగాణం**



**జూలూరు గౌరీశంకర్**

**కవిత్వం** ఏమైనా కరోనాను చంపేస్తుందా? అని అడ్డగోలు ప్రశ్నలు వేసినవాళ్లు ఉండవచ్చు. కానీ ప్రతి ప్రజా ఉద్యమానికి నైతిక బలాన్నిచ్చి ముందుకు నడిపించి గెలిపించగల విస్తృతిని సాహిత్యం సృష్టిస్తుంది. దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమగెలుపు వరకూ సాహిత్యం నిర్వహించిన పాత్ర తక్కువేం కాదు. తెలంగాణ సాధన ఉద్యమానికి నాయకత్వం వహించిన కేసీఆర్ 'ధూం ధాం' కళారూపాల ద్వారా ఉద్యమభేరి మోగించేవిధంగా సాహిత్యరంగాన్ని మలిచారు. మహా సంకల్పాలు నెరవేరేందుకు సాహిత్యం ఎంత పదునైన ఆయుధమో బాగా తెలిసిన వ్యక్తి కేసీఆర్. అందుకే కరోనా వల్ల ప్రపంచానికి జరిగే నష్టాన్ని తెలియజేస్తూ ప్రజలందరూ స్వీయ నియంత్రణతో ముందుకువచ్చేందుకు కలాలను పదునుపెట్టాలని కోరుతున్నారు.

కేసీఆర్ కవి కాబట్టే ఆయనకు సాహిత్యం లోతు తెలుసు. మందులేని వైరస్‌కు మందు వ్యక్తి స్వీయనియంత్రణ, సామాజిక దూరం అయిన సమయంలో ప్రజలను మరింత చైతన్యవంతులను చేస్తూ వారిలో ధైర్యం నూరిపోసేందుకు కవులు రచయితలు కవితలు, పాటలు రాయాలి. ఆ బాధ్యతను తెలుగు కవులు సమర్థంగా చేయగలరని కేసీఆర్‌కు తెలుసు. అందుకే ఆయన కవులారా, సాహితీవేత్తల్లారా కలాలతో కదలండని పిలుపునిచ్చారు.

వరదలు, విపత్తులు, సునామీలు, భూకంపాలు ప్రకృతి వైపరీత్యాలు దేశ చరిత్రలో తీవ్ర నష్టాన్ని కలుగజేశాయి. ప్రాణ నష్టాన్ని కలిగించి భయోత్పాతానికి గురిచేశాయి. 1769, 1770, 1773లలో వచ్చిన బెంగాల్, బీహార్, ఒరిస్సా కరువులు 10 మిలియన్ల మందిని మింగేశాయి. 1839లో వచ్చిన కోరింగ తుఫాను దేశాన్ని కదిలించిన 10 విపత్తులలో ఒకటిగా మిగిలింది. వేల మందిని బలితీసుకున్నది. 1896లో వచ్చిన ప్లేగు వ్యాధితో భారత్, చైనాలో 12 మిలియన్లకు పైగా ప్రజలు చనిపోయారు. బొంబాయి, కలకత్తా వంటి ఓడరేవు నగరాల్లో మొదలైన ప్లేగు వ్యాధి దేశంలోని గ్రామాల దాకా వ్యాపించింది. 2004లో హిందూ మహాసముద్రంలో లేచిన సునామి 14 దేశాల్లో అల్లకల్లోలం సృష్టించి 2,30,0 00 మందిని బలి తీసుకున్నది. దేశాన్ని కుదిపివేసిన ప్రతి సందర్భంలో సాహిత్యం వచ్చింది.

ఇప్పుడు ప్రపంచాన్ని కరోనా మృత్యు ఘోషతో భయపెడుతున్నది. ఈ సందర్భంలో ప్రజలందర్నీ కాపాడుకునేందుకు, కరోనా నుంచి విశ్వాన్ని బయటపడేసేందుకు ప్రజాసమూహాల సంకల్పాలకు మద్దతుగా కవిత్వం రాయవలసి ఉన్నది. మనకున్న సమస్త కళలు సాహిత్యం ప్రజల కోసం సృష్టించబడి అది ప్రజల కోసం ఉపయోగపడాలన్న దిశగా రచయితలు కదులాలి. ధైర్యానికి ప్రాణంపోయాలి. సమాజాన్ని కదిలించి నడిపించాలి. కాబట్టి ప్రతి రచయిత ఈ విషక్రిమిపై తన కలంతో యుద్ధం చేయాలి.

దివిసీమ ఉప్పెన సమయంలో నగ్నముని 'కొయ్య గుర్రం' ప్రభుత్వ నిష్క్రియా పర్వత్వాన్ని తెలియజేసింది. విఫలమైన నాటి ప్రభుత్వ విధానాలను ఎండగట్టింది. కరోనా లాంటి విపత్తు సమయంలో ఎంత చైతన్యవంతంగా ఆలోచించాలో చాటిచెపుతూ 'చైతన్య అశ్వం'గా కేసీఆర్ ప్రభుత్వాన్ని ఉరికిస్తున్నారు. పనిచేసే క్రియాకావ్యంగా కేసీఆర్ పని చేస్తున్నారు. ఈ కోణంలోనే కరోనాను తరిమికొట్టేందుకు కవులను, రచయితలను రాయమని కోరుతున్నారు.

గుజరాత్ లాతూర్‌లో భూకంపం వచ్చినప్పుడు నిరాశ్రయులైన వారికి అండగా సాహిత్యం వచ్చింది. సునామీలు ఉప్పొంగినప్పుడు ఎన్నో రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. తుఫానుల తాకిడి సందర్భంగా 'తలవంచిన వరికంకులుగా' సంపాదకీయ సంఘీభావ దండలుగా సతీష్‌చందర్ అక్షరాల రాతబడి చేశారు. సునామీల మీద ఎంతో సాహిత్యం వచ్చింది. కరోనా పేరుతో సూక్ష్మ క్రిమి సృష్టిస్తున్న సునామి ఇది.

ప్రజలకు మనోధైర్యం, మానసిక వికాసం కలిగించేందుకు సాహిత్యాన్ని ఆయుధంగా మార్చి ప్రజలకు ధైర్యం కలిగించాలి. తెలంగాణ ఉద్యమాన్ని ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎలాగెలుచుకుంటూ పోయి గెలిచి వచ్చాడో, అదేవిధంగా కరోనా విషయంలోనూ మరో యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు సాహిత్యసాంస్కృతికరంగాన్ని కూడా వైద్యంలా కేసీఆర్ అందిస్తున్నాడు. దూరదృష్టి దార్శనికత ఉన్న నాయకుడు కేసీఆర్ మనల్ని అందర్నీ నెల రోజులు జాగ్రత్తగా ఉండమని కోరుతున్నారు. ప్రతి ఒక్కరం స్వీయ నియంత్రణలోకి వెళ్లి కలం కవాతులతో కరోనాపై గెలుద్దాం.

# భస్మాసుర హస్తమా?

> దేశ రక్షణ కోసం సైనికులు ఉపయోగించేందుకు తయారుచేసిన ఏకే-47 తుపాకీ ఉగ్రవాదులు, తీవ్రవాదుల చేతుల్లో పడి అమాయక ప్రజలు, సైనికులు మరణించడాన్ని చూసి మైఖేల్ టిమోఫెవిచ్ కలష్నికోవ్ పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తాడు. ఇదే తరహాలో అమెరికా వ్యాపార ఏజెంట్ అయిన జాన్ పెర్కిన్స్ తన ఆత్మకథలో ఇలాంటి పశ్చాత్తాపాన్నే ప్రకటిస్తాడు.

**అంతర్జాతీయం**



**ఎ.రమణ కుమార్**

**ఒక దళారి పశ్చాత్తాపం** (a confession of an economic hitman): జాన్ పెర్కిన్స్ తన ఆత్మకథగా రాసిన పుస్తకం. 2004లో ప్రచురితమై ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ పుస్తకంలోని ప్రధాన అంశం.. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడిదారీ దేశమైన అమెరికా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థికపరమైన తాయిలాలను ఇస్తామని ఆశ చూపి, దీర్ఘకాలంలో వాటిని ఆర్థికంగా దెబ్బతీసి తమ చెప్పుచేతల్లో ఉండేలా చేయడం. ఇందుకోసం పెర్కిన్స్ వంటి ఆర్థికవేత్తలను అమెరికా తన ఏజెంటుగా నియమించుకుంటుంది. తాను దెబ్బతీయాలనుకున్న దేశాలకు పంపి, వారికి కొన్ని అభివృద్ధి నమూనాలను (అవి ఆయా దేశాల ప్రజలకు ఉపయోగపడుతాయా లేదా అన్నది అమెరికా ఏజెంట్‌కు అనవసరం) చూపిస్తుంది. వాటికి అమెరికా ఆర్థిక సహాయం చేస్తుందనీ, ఆ పనుల కాంట్రాక్టును అమెరికాకు చెందిన, అనుబంధంగా ఉన్న సంస్థలకే ఇచ్చేవిధంగా చేస్తుంది. ఫలితంగా ఆయా దేశాలు అమెరికా నుంచి అప్పులను తీసుకొని దీర్ఘకాలంలో ఆ దేశానికి దాసోహమైపోయి అమెరికా చెప్పుచేతల్లో ఉంటాయి. ప్రపంచంలో తనకు పోటీ అని భావించిన అభివృద్ధి చెందిన దేశాలను కూడా ఇలాంటి ఏజెంట్ల ద్వారా తన ముగ్గులోకి దింపి దొంగదెబ్బ తీస్తుంది. దాంతో ఆయా దేశాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి దీర్ఘకాలంలో ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటాయి. ఇది అమెరికా అనుసరిస్తున్న ఒకరకమైన ఫైనాన్షియల్ పరోక్ష యుద్ధమని పెర్కిన్స్ అంటారు. ఇరువయవ శతాబ్దంలో ప్రపంచ దేశాలను ఆర్థికంగా కుంగదీయడమే లక్ష్యంగా అమెరికా ఎంచుకున్నది. ఒకసారి ఏజెంటు గిరిని చేయడానికి అంగీకరించి, ఆ ఉద్యోగంలోకి దిగిన తర్వాత, ఇక ఆ కూపంలోంచి బయటికి రాలేరు. రావడానికి ప్రయత్నిస్తే అంతిమంగా ఆ వ్యక్తి ఎవరికీ అనుమానం రాని (ఏదో ఒక విష ప్రయోగంతో) మరణం చెందుతాడని పెర్కిన్స్ తన ఆత్మకథను ఒక పశ్చాత్తాపంగా రాశాడు.

ఇదంతా ఎందుకు ప్రస్తావించాల్సి వస్తుందంటే.. ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌కు కూడా ఇలాంటి నేపథ్యమే ఉన్నది. ఈ 'బయో వెపన్'ను చైనా తయారుచేసిందా? అమెరికా తయారుచేసిందా? అనే చర్చను పక్కనపెడితే.., ప్రపంచంపై ఆధిపత్యాన్ని సంపాదించి, అన్నిదేశాలను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలనే సామ్రాజ్యవాద కాంక్ష ఉన్నది. భవిష్యత్తులో శత్రు దేశాలను భౌతిక ఆయుధాలతో దాడిచేసి నాశనం చేయడం సాధ్యం కానప్పుడు ఇలాంటి కనిపించని జీవాయుధాలను వాడి, ఆ దేశాలను ఆర్థికంగా, సామాజికంగా చిన్నాభిన్నం చేయాలనే కుట్రపూరితమైన కాంక్ష ఉన్న దేశం తయారుచేసిన కృత్రిమ వైరస్ కరోనా. ఇలాంటి జీవాయుధాలను కొన్ని సంపన్న దేశాలు తయారుచేశాయనీ, రాబో యేరోజుల్లో వీటిని ప్రపంచంపై ప్రయోగించబోతున్నాయని 2011లోనే 'సెవెన్త్ సెన్స్' అనే సినిమాలో తెరకెక్కించారు. కొందరు సినిమాను, సినిమాగానే చూసి వదిలేశారు. ఇంకొందరు 'ఆ.. ఇదంతా ఓ కల్పితం' అని తేలికగా తీసిపారేశారు. ఇప్పుడు సరిగ్గా అదే పరిస్థితి కళ్లముందు ప్రత్యక్షమవ్వడంతో అంతా వణికిపోతున్నారు. చాలా సినిమాలు వాస్తవాలు కాకపోవచ్చు, కొన్ని సినిమాలు వాస్తవాల ఆధారితంగానే తెరకెక్కుతాయనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. అలాంటిదే 'సెవెన్త్ సెన్స్' సినిమా అని అనుకోవచ్చు.

కరోనా వైరస్‌ను చైనా అత్యంత సైనిక రక్షణ కలిగిన వూహాన్ ప్రాంతంలో తయారుచేసిందని, అవసరం వచ్చినప్పుడు శత్రు దేశాలపై ప్రయోగించాలని దాచుకున్న రోగవ్యాప్త క్రిమి (డీఎన్ఏ) కొన్ని సాంకేతిక కారణాల వల్ల లాబోరేటరీ నుంచి లీకయి మొదట చైనా దేశాన్నే భస్మాసురుని హస్తంలా దహిం చి వేసిందన్నది అమెరికా వాదన. కాదు, అమెరికానే తయారుచేసి తమ దేశాన్ని నాశనం చేయడానికి తమపై ప్రయోగించిందని చైనా అంటున్నది. ఎవరివాదన నిజమో.. కానీ, ఇప్పుడు ఆ రెండు దేశాలు తాము తయారుచేసుకున్న కరోనా వైరస్ బారిన పడి విలవిలలాడుతున్నాయి. ఇప్పుడు అది ప్రపంచ దేశాలను చెరబట్టింది. ఏదేమైనా ఇప్పుడు కరోనా వైరస్‌ను కనుగొన్న శాస్త్రవేత్తలే దానికి విరుగుడు మందు ను కనుక్కోవాలి. లక్షలాదిమంది వైరస్ బారినపడి మరణించకముందే దాన్ని సమాధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# అంతఃకరణ చతుష్టయం



**నమస్తే.. నమస్తే.. నమః**

**శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి**

**అంతటా** ఉన్న పరమాత్ముణ్ణి అన్నివేళల్లో ఆస్వాదించడమే అందరం చేస్తున్న పని. అంతటా ఉన్నవాడంటే ఎవరు? పురుషుడా? స్త్రీయా? పదార్థమా? జడమా? ప్రకృతేనా?.. ఇలా ప్రశ్నించుకుంటూ వెళితే చివరకు ప్రశ్నకు అందని స్థాయిలో నిలిచే తత్త్వమే అసలైన తత్త్వం. ఒక పదార్థంగానో, ఒక స్థితిగానో, ఒక వ్యక్తిగానో లేదా ఏదో ఒక అంశంగానో భాసించేది మాత్రమే కాదు. ఇలాంటి పరిణామ పదార్థాలన్నింటికీ ఆధారభూతమై, తానే అన్నింటిగా మారి వెలిగించి, తానుగానే ఉండేది పరమాత్మ తత్త్వం. మనఃపూర్వకంగా భక్తితో శ్రవణ, కీర్తన, స్మరణ, ధ్యాన, అర్చన, వందన, దాస్య, సర్వ సమర్పణాదులు వంటి అనేక మార్గాల ద్వారా సాధన చేస్తేనే 'తత్త్వావగాహన' కలుగుతుంది.

ఇలా సాధనతో 'తత్త్వావగాహన' పొందాలంటే ముందుగా సంస్కరించుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు ఒక వస్తువును చూడాలంటే ముందుగా కళ్ళు బాగుండాలి. ఆ మేరకు వెలుతురు ఉండాలి. అప్పుడే 'వస్తువు' చక్కగా కనబడుతుంది. కనపడినంత మాత్రాన సరిపోదు కదా! ఆ వస్తువు ఏమిటి? అనే పరిశోధన మొదలవుతుంది. అప్పుడు దృష్టికి వచ్చిన వస్తువు బాహ్యరూపం బుద్ధిని చేరుతుంది. బుద్ధిలోనూ తర్కవితర్కాలు జరుగుతాయి. తన పరిధిలో అది తేలితే ఇది 'ఫలానా వస్తువు' అని బుద్ధి చెప్పగలుగుతుంది. అప్పుడు అంతఃశోధనతో దాని మూలతత్త్వం తెలుస్తుంది. 'కళ్ళు బాగుండటం' అంటే శుభ్రంగా ఉండటంతోపాటు వాటికి చూసే శక్తి కూడా ఉండాలని అర్థం. అలాగే చైతన్యానుభవానికి దోహదమయ్యే సూక్ష్మమైన అంతఃకరణాదులు, అంతకన్నా స్థూలమైన దేహాదులు, వాటికన్నా బాహ్యంగా కనపడే ప్రవర్తనాదులు.. ఇవన్నీ పరిశుభ్రంగా ఉండితీరాలి కదా!

బాహ్య కారకాలైన ప్రవర్తనాదులు మంచిగా ఉండాలంటే సూక్ష్మాంశాలైన మనసు, బుద్ధి, చిత్తం, అహంకారాదులు తమ తమ స్థితుల్లో ఔన్నత్యాన్ని చూపాలి. మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం-ఈ నాలుగు అంశాలనే **'అంతఃకరణ చతుష్టయం'** అంటాం. ఇవి విడివిడిగా చెప్పబడినా 'మనసు' అనే ఒకే పదంగా, ఒకే రూపంగా పనిచేస్తాయి. అంటే, మనసు పేరుతోనే ఇవన్నీ పనిచేస్తాయి. ఇవన్నీ చేసిన పనినే మనసు సమర్థించి, సమర్పిస్తుందన్న మాట. ఒక ఇంటిపెద్దలాగా వ్యవహరించే ఈ మనసుకే మనస్సుగా ఒక వ్యవస్థ, ఒక విధానం ప్రత్యేకంగా ఉంటాయి కదా! దానినీ కొంచెం పరిశీలిద్దాం. మనసు కనపడదు. అది ఇంద్రియాలన్నింటి ద్వారా పనిచేస్తుంది. అది ఏ విషయాన్ని తీసుకొని తాకితే ఆ ఇంద్రియం స్ఫూర్తిపొంది ఆ మేరకు పనిచేస్తుంది. మనసు చంచల స్వభావం కలది.

సంకల్ప వికల్పాల స్థితి నుంచి మనసును నిశ్చలస్థితికి తేగలగాలి. మనసు తనంత తానుగా పని చేయలేదు. ఇది మనసుకున్న బలహీనత. అంటే, అది ఒక వస్తువునో, ఇంద్రియాన్నో ఆసరా తీసుకోవాలి. ఈ బలహీనతను మనం ఆధారంగా చేసుకొని దానిని సరియైన విధంగా కట్టడి చేయవచ్చు. మనసుకు ఒక ఆధారం చూపించాలి కదా! దానితో కలిసిపోయే ఆధారం కన్నా, దానిని నిలువరించే ఆధారం కావాలి. ఆ ఆధారం దేనిమీదా ఆధారపడనిదై ఉండాలి. ఆ ఆధారం శాశ్వతమైన 'భగవన్నామ స్మరణమే' కానీ, మరొకటి కాదు. నామస్మరణ మొదలుపెట్టినప్పుడు మనసు పారిపోతుంది. లేపాలని, ఆపాలని చూస్తుంది. గోల చేస్తుంది.



నామస్మరణను వదలకుంటే మనసు తానే వచ్చి చేరుతుంది, నిలిచిపోతుంది. ఎలా అంటే, ఒక రేవులో ఓడ ఆగి ఉంది. దాని జెండాపై ఒక కాకి వాలింది. ఇంతలో నౌకను వదిలారు. నౌక సముద్రంలో ప్రయాణిస్తున్నది, దానితోనే కాకికూడా! కాకికి లేచి తిరగడం, కొత్త ప్రదేశంలో వాలడం అలవాటు కదా! కాకి లేచింది. కానీ, వాలడానికి ఒక జెండా తప్ప ఆ సముద్రంలో మరో చోటు ఏదీ దానికి కనపడలేదు. కనుక, తిరిగి అదే జెండా మీద కూర్చున్నది. మరొకసారి తిరిగి చూసింది, ఏ ఆధారం లేక జెండామీదే వాలింది. ఇలా మరలా చేసి, చేసి చివరకు 'ఏ ఆధారం లేదు, కాబట్టి జెండా మాత్రమే ఆధారం' అని తెలుసుకొని కదలకుండా కూర్చుండిపోయింది. దీనినే 'నౌకాగ్రకాక న్యాయం' అంటారు. అలానే మనసుకు కూడా భగవన్నామ స్మరణనే ఆధారంగా చేసి వేరే పదార్థం జోలికి పోనీయకుంటే అదే మన ధ్యేయవస్తువైనపుడు.. పరమాత్మ తత్త్వాన్ని మనలో భాసింపజేస్తుంది. సాధనాత్ సాధ్యతే సర్వమ్॥

| లాక్‌డౌన్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు | పౌరసరఫరాలశాఖ ఉ.10 నుంచి సా.5 వరకు 1967 | హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ 100 24/7 | సైబరాబాద్ కమిషనరేట్ 9490617440 | రాచకొండ కమిషనరేట్ 9490617234 | కొవిడ్-19 కాల్‌సెంటర్ 040-23434343 |
|---|---|---|---|---|---|


నల్లగొండ జిల్లా అవంతీపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

## సీఎం కేసీఆర్ రైతు బాంధవుడు

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**మిర్యాలగూడ, నమస్తేతెలంగాణ:** రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టిన సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురం వ్యవసాయ మార్కెట్‌లో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గుత్తా ప్రారంభించారు. సాగర్ ఆయకట్టులో ఈ సారి రికార్డు స్థాయిలో వరి ధాన్యం దిగుబడి రానున్నదని గుత్తా పేర్కొన్నారు.

## లాక్‌డౌన్‌కు సహకరించాలి

### స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వినతి



**బాన్సువాడ, నమస్తేతెలంగాణ:** లాక్‌డౌన్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి కామారెడ్డి జిల్లా బాన్సువాడ మీడియా ప్రతినిధులతో వీడియోకాల్‌లో మాట్లాడారు. అన్ని రాష్ట్రాల కన్నా సీఎం కేసీఆర్ ముందస్తు చర్యలు చేపట్టారని కొనియాడారు. తెల్లరేషన్ కార్డులేని పేదలకు రెండురోజుల్లో బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. కరోనా నేపథ్యంలో విధులు నిర్వర్తిస్తున్న పలు శాఖల వారికి కృతజ్ఞతలు తెలిపారు.


వనపర్తి జిల్లా చిట్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

## ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక నిధులు

### వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి రూరల్:** యాసంగిలో పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా చిట్యాల, చీమనగుంటపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. వరి కోతల ఆధారంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

## • అన్నార్తులకు ముత్తూట్ సాయం


కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ మంగళవారం మంచిర్యాలలో 200 మంది కూలీలకు భోజనాలు, నిత్యావసర సరుకులను పంపిణీచేసింది. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ, కాజీపేటలో పోలీస్‌శాఖ సాయంతో అన్నదానం చేసింది. సైబరాబాద్ పోలీసులకు మాస్కులను అందజేసింది. విశాఖపట్నంలో అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి చేతులమీదుగా అన్నార్తులకు సరుకులను అందజేసింది.
– హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## పలు జిల్లాల్లో వడగండ్ల వాన

### తడిసిన మిరప.. దెబ్బతిన్న వరి

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** కరోనావైరస్ ఓ పక్క వణికిస్తుంటే.. ప్రకృతి వడగండ్ల రూపంలో రైతన్నలను బెంబేలిత్తించింది. భారీ వడగళ్ల వానతో చేతికొచ్చే పంటలను తీవ్రంగా దెబ్బతీసింది. మంగళవారం సాయంత్రం జనగామ, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, వికారాబాద్ జిల్లాల్లో వర్షం కురిసింది. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో 200 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. వడగండ్ల దెబ్బకు వరి గింజలు రాలాయి. రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయ్యింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో సాయంత్రం చినుకులతో మొదలై రాత్రి 7 గంటల వరకు వర్షం పడింది. అలంపూర్, మానవపాడు, ఇటిక్యాల, ఉండవెల్లి మండల్లాలో మిర్చి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. నారాయణపేట జిల్లాలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన పడింది. మరో రెండు రోజులపాటు వర్షాలు కురవనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

## ఛత్తీస్‌గఢ్‌లో వంతెన పేల్చిన మావోయిస్టులు

**చర్ల రూరల్ :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మందుపాతర పేల్చి అలజడి సృష్టించారు. సుక్మా జిల్లా పరిధిలోని దోర్నపాల్ – జీగురుకొండ మార్గంలో పోచంపల్లి సమీపంలో గోరగూడ వాగుపై ఉన్న వంతెన కింద మావోయిస్టులు శక్తివంతమైన మందుపాతరలు పెట్టి గత రాత్రి పేల్చివేశారు. రహదారి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న వంతెన మందుపాతర ధాటికి ధ్వంసమైంది. ఈ ఘటనతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలంపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.


కరీంనగర్‌లో భోజనం ప్యాక్ చేస్తున్న యువకులు

# మనసున్న మారాజులు

## ఆపదలో తోటివారికి ఆసరా

కరోనా మహమ్మారి కారణంగా ఉపాధి కోల్పోయిన వారికి చేతనయినంత సాయం చేస్తున్నారు.. తమకున్న దాంట్లోనే కొంత పక్కవారికి పెడుతున్నారు.. అనార్తుల ఆకలి తీరుస్తూనే.. బతుకుబండి లాగడానికి తోడ్పాటు ఇస్తున్నారు పలువురు దాతలు. అవసరం ఉన్నవారిని ఆదుకుంటూ మనసున్న మారాజులుగా నిలుస్తున్నారు.

**తమకున్న దాంట్లోనే వితరణ • ఆదర్శంగా నిలుస్తున్న దాతలు**

**నమస్తేతెలంగాణనెట్‌వర్క్:** లాక్‌డౌన్ కారణంగా ఉపాధి లేక పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ.. పలువురు దాతలు అండగా నిలుస్తున్నారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలంలోని కమ్మపల్లికి చెందిన పలువురు తమకు ప్రభుత్వం పంపిణీ చేసిన 3.5 క్వింటాళ్ల బియ్యాన్ని రేషన్‌కార్డులు లేని నిరుపేదలకు పంపిణీ చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన జంగ మధురమ్మ(60) తనకు వచ్చిన రేషన్ బియ్యం 12 కిలోలతోపాటు 3 కిలోల చింతపండును ఇద్దరు ఒడిశా కార్మికులకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నది. సర్కారు తనకు నెలనెలా రూ.2,016 పింఛన్ ఇస్తున్నదని, సీఎం కేసీఆర్ పిలుపుతో తనకొచ్చిన రేషన్ బియ్యంతోపాటు 3కిలోల చింతపండును కొనుగోలు చేసి కార్మికులకు అందజేసినట్టు మధురమ్మ తెలిపింది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పోచారం ట్రస్ట్ అండగా నిలిచింది. ఈ మేరకు 116 మంది పారిశుద్ధ్య సిబ్బందికి ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, టీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం రూ.వెయ్యి చొప్పున అందజేశారు. కాగా, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు రెండు రోజుల్లో రేషన్‌కార్డు లేని నిరుపేదలకు 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నట్టు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

**9 రోజులుగా 150 మందికి భోజనం..**

పూట గడవని 150 మంది నిరుపేదలకు నర్సింగ్ విద్యార్థి తన స్నేహితుల సాయం తో 9 రోజులుగా తిండి పెడుతూ ఆకలిని తీర్చుతున్నారు. కరీంనగర్ నర్సింగ్ స్కూల్‌లో జీఎన్‌ఎం ద్వితీయ సంవత్సరం విద్యార్థి కొత్తకొండ వెంకటసాయి తన స్నేహితులు సతీశ్, మాసం గణేశ్, విజయ్, ప్రవీణ్, శ్రీకాంత్, శివ, అశోక్ కలిసి భోజనం పెడుతున్నారు.



**సీఎం ఆదేశాలతో..**

తల్లి మృతితో అనాథలైన గ్రేటర్ హైదరాబాద్‌లోని సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన నలుగురు చిన్నారులకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ముషీరాబాద్ తాసిల్దార్ జానకి నిత్యావసర సరుకులు అందజేశారు. అంతకుముందు వీఆర్వో పిల్లలను కలిసి వారి వివరాలను సేకరించారు. పిల్లలకు డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు ఇప్పించాలని, గురుకులంలో విద్యను అందించాలని స్థానికులు తాసిల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

## జీడీకే -11 గనిలో కార్మికుడు అదృశ్యం

**గోదావరిఖని, నమస్తే తెలంగాణ:** సింగరేణి రామగుండం ఏరియాలోని జీడీకే-11 గనిలో ఓ కార్మికుడు మంగళవారం అదృశ్యమయ్యాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన కార్మికుడు కోడెం సంజీవ్ (55) జీడీకే-11వ గనిలో యాక్టింగ్ పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం షిఫ్టులో తోటి కార్మికులతో కలిసి గనిలోని 27వ లెవల్, 1వ డీప్, 4వ సీమ్‌లో పని చేశాడు. డ్యూటీ ముగిసినా సంజీవ్ గని పైకి రాలేదు. ఔట్ మస్టర్ పడలేదని గుర్తించిన అధికారులు వెంటనే రెస్క్యూ టీంను గనిలోకి దింపి గాలింపు చేపట్టారు. రాత్రి వరకూ ఆచూకీ లభించలేదు. కార్మికుడిని సురక్షితంగా బయటకు తీసుకురావాలని టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, గండ్ర దామోదర్, నాయిని శంకర్ అధికారులను కోరారు.

## • మేకలకూ మాస్కులు


మూగజీవాలకూ కరోనా వైరస్ సోకుతుందన్న ప్రచారంతో ఓ మేకలకాపరి అప్రమత్తమయ్యాడు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఎన్టీఆర్‌కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు కరోనా బారినుంచి తన మేకల రక్షణకు మాస్కులు కట్టాడు. అడవికి వెళ్లి, వచ్చే సమయంలో మాస్కులను పెట్టి.. అవి మేసే సమయంలో మాత్రమే తీస్తున్నానని చెప్పాడు. – మామిళ్లగూడెం


సిద్దిపేటలో వలస కార్మికులకు బియ్యం అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

## వలస కార్మికులకు సర్కార్ అండ

### లాక్‌డౌన్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలి : మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తేతెలంగాణ:** పొట్టచేతపట్టుకొని ఇతర రాష్ట్రాల నుంచి వలసవచ్చిన కూలీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని రిమ్మనగూడలో శనిగల కొనుగోలు కేంద్రాన్ని, నంగునూరు మండలం ముండ్రాయి, పాలమాకుల, గట్లమల్యాల, ఆరెపల్లిలో వరి, మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో 104 మంది వలస కూలీలు, కొండమల్లయ్య గార్డెన్‌లో 300 మంది నాయీబ్రాహ్మణులు, మార్కెట్‌యార్డులో 500 మంది హమాలీలు, మున్సిపల్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

## డిజిన్ఫెక్షన్ టన్నెల్ ప్రారంభం

**నిజామాబాద్/కామారెడ్డి జిల్లాల ప్రతినిధులు, నమస్తేతెలంగాణ:** కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు నిజామాబాద్ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన డిజిన్ఫెక్షన్ టన్నెల్ సెంటర్‌ను ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. క్వారంటైన్ కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి మాస్కులు, డ్రెస్సులను అందజేశారు. పలువురు ఏఎన్‌ఎంలకు మెడికల్ బ్యాగులను, శానిటైజర్లను అందించారు. అనంతరం డ్రోన్ ద్వారా హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారీని మంత్రి ప్రారంభించారు. అంతకుముందు కామారెడ్డి, నిజామాబాద్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కరోనా వైరస్ నియంత్రణకు ప్రజలంతా ఇండ్లకే పరిమితం కావాలని కోరారు.



నిజామాబాద్‌లో డిజిన్ఫెక్షన్ టన్నెల్లోంచి వస్తున్న మంత్రి వేముల

## సామాజిక దూరంతోనే కరోనా కట్టడి

### మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం కరోనా వ్యాప్తి నియంత్రణకు సామాజిక దూరం పాటించాలని మాజీ ఎంపీ, ప్రముఖ వైద్యుడు బూర నర్సయ్యగౌడ్ సూచించారు. కరోనా కట్టడిలో భాగంగా నిర్విరామంగా కృషిచేస్తున్న అధికారులు, వైద్యులు, పోలీసులు ఇతర సిబ్బందికి మంగళవారం ఆయన ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక దూరం వర్తిస్తుందని, ప్రత్యేకించి రాజకీయ నాయకులు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## • కార్మికుల కాళ్లు కడిగిన ఉప సర్పంచ్


వరంగల్ అర్బన్ జిల్లా వేలేరు మండల కేంద్రంలో మంగళవారం ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ 16 మంది పారిశుద్ధ్య కార్మికుల పాదాలు కడిగారు. కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణంలో గ్రామాల్లోని పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. – వేలేరు

# ధాన్యం కొనుగోళ్లపై కంట్రోల్‌రూం

- ఫిర్యాదులకు 7288894807, 7288876545 నంబర్లు
- సాఫీగా మక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లు
- కంట్రోల్ రూం అధికారులతో రైతుబంధు సమితి రాష్ట్ర చైర్మన్ పల్లా సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లోనూ పంటల విక్రయంలో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతున్నది. వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ, రైతుబంధు సమితుల ఆధ్వర్యంలో యాసంగి సీజన్‌లో మక్కజొన్న, వరి ధాన్యాల కొనుగోలుకు రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలుకేంద్రాలను ఏర్పాటుచేసింది. ధాన్యం, మక్కజొన్న సేకరణలో వచ్చే సమస్యలను తక్షణ పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం కంట్రోల్‌రూంను ఏర్పాటుచేశారు. ఈ కంట్రోల్‌రూంలో వ్యవసాయశాఖ, రైతుబంధు సమితి, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ, పౌరసరఫరాలశాఖ అధికారులు అందుబాటులో ఉంటారు. రోజూ జిల్లాలవారీగా ఏర్పాటుచేసిన ధాన్యం సేకరణ కేంద్రాలు, సేకరించిన ధాన్యం, ఎన్ని ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి తదితర వివరాలపై రాష్ట్రస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారు. మంగళవారం రైతుబంధు సమితి రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ కంట్రోల్ రూంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో ధాన్యం సేకరణలో రైతులు ఎదుర్కొనే సమస్యలు, వాటి పరిష్కారం తదితర అంశాలపై చర్చించిన రాజేశ్వర్‌రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాలు, ధాన్యం సేకరణ సమస్యలపై రైతులు ఈ కంట్రోల్ రూంను ఉపయోగించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కంట్రోల్ రూం రోజూ ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేస్తుంది. రైతులు తమ సమస్యలపై 7288894807 లేదా 7288876545 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. ఈ కంట్రోల్ రూంకు వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల ద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకొంటారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అదనపు కమిషనర్ విజయ్ కుమార్, మార్క్‌ఫెడ్ ఎండీ భాస్కరాచారి, డీడీ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## వేగంగా గన్నీ సంచుల సేకరణ

### అధికారులకు పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రేషన్ డీలర్లు, రైస్‌మిల్లర్ల వద్ద ఉన్న పాత గన్నీ సంచులను వెంటనే స్వాధీనం చేసుకోవాలని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణకు గన్నీ సంచులు ప్రధానమనే విషయాన్ని అధికారులు మరువద్దని, ఒక్క సంచి కూడా బయటకు వెళ్లడానికి వీల్లేదని, సంచుల సేకరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ విషయంలో రేషన్‌డీలర్లు, రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తిచేశారు. గన్నీసంచుల కొరతపై మంగళవారం ఆయన పౌరసరఫరాలభవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం సేరణకు దాదాపు 20 కోట్ల గన్నీ సంచులు అవసరమవుతాయన్నారు. లాక్‌డౌన్ వల్ల పశ్చిమ బెంగాల్ నుంచి అనుకున్న సమయానికి సంచులు రాకపోవడం, పాత గన్నీ సంచుల రవాణాకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో కొరత ఏర్పడిందన్నారు. కొత్తవి వచ్చే అవకాశం లేదని, పాతవాటిని సమకూర్చుకోవాలని, మరోవైపు సరఫరాదారుల నుంచి గన్నీ సంచులను సేకరించాలని చెప్పారు. మిల్లర్లు, డీలర్ల నుంచి సేకరించిన గన్నీ సంచులను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉన్న గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలలు, కమ్యూనిటీహాళ్లలో నిల్వ చేసుకోవాలన్నారు. ధాన్యం సేకరణకు నిధుల కొరత లేదని, సీఎం కేసీఆర్ ఇప్పటికే రూ.25 వేల కోట్లను సమకూర్చారని తెలిపారు. రవాణా కంట్రాక్టర్లు, గన్నీ సప్లయర్లు, రేషన్‌డీలర్లకు తక్షణమే చెల్లింపులు జరుపాలన్నారు. రేషన్‌డీలర్ల నుంచి తీసుకునే ఒక్కో గన్నీ సంచి ధరను రూ.16 నుంచి రూ.18కి పెంచామని చెప్పారు. ఏప్రిల్‌లో రేషన్ లబ్ధిదారులకు 12 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయడంతో డీలర్ల వద్ద దాదాపు 60 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని, వీటిని వెంటనే తీసుకునే ఏర్పాటుచేయాలని, సంచుల రవాణాలో సమస్యలుంటే పౌరసరఫరాలశాఖ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.



## 'రైట్' నంబర్!



**కొన్నిసార్లు** రాంగ్ నంబర్లు కూడా దిశానిర్దేశం చేస్తాయి. చెన్నైకి చెందిన ఆర్తి విషయంలో అలానే జరిగింది. ఏప్రిల్ 1న... ఆర్తి మధుసూదన్ ఫోన్ అదే పనిగా మోగింది. ఏదో కొత్త నంబరు. అయిష్టంగానే లిఫ్ట్ చేసింది. ఎవరో అపరిచితుడు. తన నంబరును ప్రభుత్వ హెల్ప్‌లైన్ అనుకుని కాల్ చేశాడు. రెండు రోజులుగా ఏమీ తినలేదని గోడు వెళ్లబోసుకున్నాడు. ఆ తర్వాత ఇలాంటి కాల్ మరొకటి వచ్చింది. ఆ వివరాలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది. దగ్గర్లో ఉన్న స్నేహితులు వారికి సాయం చేశారు. రాంగ్‌కాల్స్ ఆధారంగానే... సుమారు 217 మంది కార్మికులకు సాయం అందించింది. ఆర్తి ఫోన్ నంబరుకు, హెల్ప్‌లైన్‌కు దగ్గరి పోలికలు ఉండటంతో ఇలా జరిగింది. ఈ మంచిపనిలో స్నేహితుల సహకారం మరువలేనిదని చెబుతున్నది ఆర్తి.

**ఎంత వేగంగా విస్తరిస్తున్నదో.. అంతే వేగంగా తరిమేయాలి. ఇదంతా జరగాలంటే వ్యక్తిగా.. వ్యవస్థగా..మనమంతా ఒక్కటవ్వాలి. ఒక్కటి కావడం అంటే, ఒకే దగ్గర పోగైపోవడం కాదు. ఒకే ఆలోచనకు రావడం, ఒకే ఆచరణకు పూనుకోవడం. కేరళ లో సరిగ్గా ఇదే జరుగుతున్నది. కరోనా నుంచి ప్రజలను కాపాడేందుకు 'కుటుంబ శ్రీ' పెద్ద పోరాటమే చేస్తున్నది.**









# కరోనాపై నారీభేరి...
# కేరళ కుటుంబశ్రీ

మహిళ తలుచుకుంటే... ఎంత గొప్ప లక్ష్యాన్ని అయినా సాధించగలదు. ఎంత ప్రతికూల పరిస్థితుల్ని అయినా ఎదుర్కోగలదు. ఎంత ప్రాణాంతక క్రిమినైనా నిలువరించగలదు. అందుకు, కేరళలోని 'కుటుంబశ్రీ' నిలువెత్తు ఉదాహరణ. కేరళ ప్రభుత్వ రాష్ట్ర పేదరిక నిర్మూలనా కార్యక్రమం ఇది. అందులో మహిళల్ని భాగస్వాముల్ని చేశారు. మహిళలూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ ఆసరాతో ఆర్థికంగా, మానసికంగా శక్తిమంతులు అయ్యారు. కరోనా నేపథ్యంలో వైరస్‌తో పోరాటానికి కూడా సిద్ధపడ్డారు. మలయాళంలో కుటుంబశ్రీ అంటే... కుటుంబ సౌభాగ్యం. 1990లో దీన్ని ప్రయోగాత్మకంగా అలప్పుజా మున్సిపాలిటీలో అమలు చేశారు. అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. 2000-2002 నాటికి రాష్ట్రం మొత్తానికి విస్తరించారు. 2011లో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌గా గుర్తించింది కూడా.

**2000 లీటర్ల శానిటైజర్ :** కరోనా మహమ్మారి ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి చాలా వేగంగా సోకుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఇతరులకు దూరంగా ఉండటం.. వీలైనంత పరిశుభ్రతను పాటించడం మినహా మరో మార్గం లేదు. కుటుంబశ్రీ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సొంతంగా శానిటైజర్ల తయారీకి ప్రణాళిక రచించింది. పదిహేను రోజుల్లోనే 2000 లీటర్లు ఉత్పత్తి చేసింది. అంతే వేగంగా దానిని జనంలోకి తీసుకెళ్లింది.

**జన భోజనశాలలు:** మాస్కులు, శానిటైజర్ల ద్వారానే కరోనాను కట్టడి చేయలేం. జరగాల్సింది చాలా ఉంది. జనంతో మమేకమైన కుటుంబశ్రీకి ఆ విషయం తెలియనిది కాదు. వ్యాధి విస్తరించకూడదంటే... ఇంటికే పరిమితమైన పేదల్ని ఆదుకోవాలి. ఆ ఉద్దేశ్యంతోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థానిక సంస్థల పరిధిలో జన భోజన శాలలు ప్రారంభించింది. వీటిద్వారా రోజూ లక్షలమంది కడుపు నింపుతున్నది. అంతమందికి భోజనమంటే, అదీ ప్రస్తుత పరిస్థితుల్లో... ఓ సవాలే. ఆ వ్యయ ప్రయాసలను తట్టుకోలేక ఇప్పటికే ఎన్నో సంస్థలు చేతులెత్తేశాయి. ఈ నేపథ్యంలో... నాణ్యమైన ఆహారం అందించాలనే చిత్తశుద్ధితో అన్నపూర్ణ అవతారం ధరించింది కుటుంబశ్రీ. మహిళారైతు బృందాలు ఇందుకు అవసరమైన కాయగూరల్ని సమకూరుస్తాయి. ఎక్కడా ప్లాస్టిక్ వస్తువుల్ని వాడరు. రుచికి తిరుగులేదు... ఇంటి భోజనమే! మనుషుల వరకూ ఫర్వాలేదు. జంతువుల సంగతి? ఇలాంటి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడేది మూగజీవాలే. అందుకే, కుటుంబశ్రీ... వీధివీధికీ తమ ప్రతినిధులను పంపి కుక్కలూ, పిల్లుల కడుపు నింపే కార్యక్రమాన్ని చేపట్టింది.

**వాట్సప్ వేదికగా:** కుటుంబశ్రీ సభ్యుల్ని అనుసంధానం చేస్తూ వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. 22.5 లక్షల మంది సభ్యులతో 1.9 లక్షల గ్రూపులు చురుకుగా నడుస్తున్నాయి. సాధారణ జాగ్రత్తలు.. వృద్ధుల సంరక్షణ.. లాక్‌డౌన్ హెచ్చరికల పోస్టర్లు.. ఆరోగ్య సందేశాలు.. అన్నీ వీటి ద్వారా షేర్ అవుతాయి. కొవిడ్-19 బారినపడినవారిలో వృద్ధులే ఎక్కువ కాబట్టి.. పెద్దల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నది కుటుంబశ్రీ. దీనివల్ల ఫేక్‌న్యూస్‌కు అడ్డుకట్ట వేసినట్టూ అవుతున్నది. సాధికారమైన సమాచారం మాత్రమే సభ్యులకు అందుతున్నది. కరోనా సెలవుల సమయంలో దాదాపు అందరూ ఖాళీగానే ఉంటారు కాబట్టి... నిన్నటితరం అనుభవాలూ జ్ఞాపకాలూ రేపటి తరాలకు అందించాలనే లక్ష్యంతో... వాట్సప్‌లో ఆత్మకథలూ, జ్ఞాపకాల పోటీలు నిర్వహిస్తున్నది కుటుంబశ్రీ. విజేతలైన వయోధికులకు బహుమతులు కూడా ఉంటాయి. ఇప్పటికే ఎంతోమంది సీనియర్లు రచయితలుగా మారిపోయారు. 'స్నేహిత' గ్రూప్ ద్వారా ఐసొలేషన్లో ఉన్నవారికి నిపుణులైన కౌన్సెలర్లు నైతిక స్థైర్యాన్ని అందిస్తున్నారు. పిల్లలకు ఆటపాటల ద్వారా కొత్త విషయాలు చెప్పడానికి 'బాలసభలు' కూడా నిర్వహిస్తున్నది కుటుంబశ్రీ.

**సాధికారత :** కుటుంబశ్రీ ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయి. మహిళల కోసం సూక్ష్మ రుణాలు ఇస్తున్నారు. ఆ అప్పుతో ఎలా లబ్ధి పొందాలి? ఏ వ్యాపారం చేయాలి? ఎంట్రప్రెన్యూర్స్‌గా ఎలా రాణించాలి?... అనే అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బేకరీలు, రెస్టరెంట్లు, హెర్బల్ బ్యూటీ పార్లర్లు, చిరుతిళ్ల తయారీ... ఇలా అనేకానేక వ్యాపారాల ద్వారా ఎంతమంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఆ సత్తువతోనే ఇప్పుడు కరోనాపై పోరు ప్రారంభించారు ఆ అభినవ సత్యభామలు. ఆ పోరాటం ఓ పక్షం రోజుల్లో కొలిక్కి వస్తుంది.
అంతిమ విజయం ఆమెదే.
కరోనాకు కూడా
నరకాసురుడికి పట్టిన గతే పడుతుంది.
తథాస్తు... తథాస్తు... తథాస్తు!

### 1,26,000 మాస్కులు



కొవిడ్ కారణంగా కేరళ ఓ పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఆ రాకాసి వైరస్‌ను నిలువరించడానికి, ప్రభుత్వం తన వంతు ప్రయత్నాలన్నీ చేస్తున్నది. ఇప్పటికే లాక్‌డౌన్ కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో వనరుల కొరత ఏర్పడింది. ప్రజలు మాస్కులు.. శానిటైజర్ల కోసం ఇబ్బందులు పడుతున్నట్లు 'కుటుంబశ్రీ' గుర్తించింది. వెంటనే మాస్కుల తయారీకి శ్రీకారం చుట్టింది. రోజుకు 1,26,000 మాస్కుల సామర్థ్యంతో టైలరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. బయట లభించే నాసిరకం మాస్కులను రెండు గంటలకు మించి వాడటానికి వీల్లేదు. కానీ కుటుంబశ్రీ మాస్కులు రోజంతా వాడొచ్చు. శుభ్రపరుచుకొని మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు.

### మా ప్రత్యర్థి.. కరోనా

"'కుటుంబశ్రీ నా కుటుంబాన్ని నిలబెట్టింది. కుట్టు మిషన్ కొనుక్కోవడానికి సాయం చేసింది. ఇప్పుడు, నేనే ఓ పదిమందికి ఉపాధిని ఇస్తూ కుట్టు కేంద్రాన్ని నిర్వహిస్తున్నా. మా అమ్మ వ్యాపారం చేస్తున్నది... అని నా పిల్లలు గర్వంగా చెప్పుకుంటున్నారు. నిన్నటి వరకూ పేదరికం మా శత్రువు. ప్రస్తుతం మా ఏకైన ప్రత్యర్థి... కరోనా! త్వరలోనే రాష్ట్రం నుంచి తరిమేస్తాం. దేశం నుంచీ తరిమేస్తాం'

**-బీనా**, వర్ణమ్ టైలరింగ్, పల్లిక్కల్ గ్రామం

## చంటిబిడ్డతో జాగ్రత్త




**నేను హైదరాబాద్‌లోని లంగర్‌హౌజ్‌లో ఉంటాను. టీచర్‌గా పనిచేస్తున్నాను. అయితే నాకు మూడు రోజుల నుంచి గొంతులో ఏదో అసౌకర్యంగా ఉంటున్నది. దగ్గు, జ్వరం ఏమీ లేవు. అలెగ్రా 120 మి.గ్రా. టాబ్లెట్స్ వేశాను. కానీ రిలీఫ్ లేదు. నాకు చిన్న పాప ఉంది. నాకు కరోనా ఉన్నట్టా? పాప విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**
**- నళిని**, హైదరాబాద్



**డాక్టర్ ఎం.వి. రావు**
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

**కరోనా** ఇన్‌ఫెక్షన్ ఉన్నట్టయితే ఇంతకుముందు చెప్పినట్టు జ్వరం, దగ్గు ఉంటాయి. దీనికి ఒకే లక్షణం ఉండదు. కొన్ని లక్షణాలు కలగలిపి ఉంటాయి. గొంతునొప్పితోపాటు జ్వరం, దగ్గు కూడా తప్పనిసరిగా ఉంటాయి. నీరసంగా ఉంటారు. ఇలాంటి లక్షణాలతో మీ ఇంట్లో ఎవరైనా ఉన్నారా? మీ కుటుంబసభ్యులు ప్రయాణాలు చేయడం గానీ, ఇతరులతో సన్నిహితంగా ఉన్న దాఖలాలేమైనా ఉన్నాయా?... అనేది ఒకసారి విచారించుకోండి. మీకు జ్వరం, దగ్గు లేవు కాబట్టి కొవిడ్ 19 ఇన్‌ఫెక్షన్ అయ్యే అవకాశం లేదు. గొంతులో బాక్టీరియా ఇన్‌ఫెక్షన్ అయివుండొచ్చు. మీ డాక్టర్ సలహా మేరకు ఎజిత్రోమైసిన్ టాబ్లెట్లను రోజుకొకటి వాడితే ఫలితం ఉంటుంది. మీ ఇంట్లో చంటిబిడ్డ ఉందంటున్నారు కాబట్టి, మీరు జాగ్రత్తగా ఉండాలి. కరోనా వైరస్ ఇన్‌ఫెక్షన్ కాకపోయినప్పటికీ పాపతో దూరంగా ఉండటం మేలు. దగ్గరికి తీసుకుని ముద్దులు పెట్టడం చేయకండి. ఇన్‌ఫెక్షన్ ఏదైనా సరే శ్వాసకోశ వ్యాధులకు సంబంధించిన లక్షణాలున్నప్పుడు పిల్లలకు దగ్గరగా ఉండకపోవడమే మంచిది. మీకు జ్వరంగానీ, దగ్గు గానీ వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి.

**మీ సందేహం... మా సమాధానం:** కరోనా వ్యాధి గురించి మీకు ఎటువంటి అనుమానాలు, భయాలు ఉన్నా ఆందోళన పడకండి. మీ ప్రశ్నలు మాకు వాట్సప్ చేయండి. నిపుణులతో మీకు సమాధానాలు ఇప్పిస్తాం. ప్రశ్నలు పంపవలసిన వాట్సప్ నెంబర్: 91827 77177

## కిరీటాన్ని పక్కన పెట్టి...






**2019లో** మిస్ ఇంగ్లాండ్ కిరీటాన్ని గెలుచుకున్న భారతీయ-బ్రిటిష్ వనిత ఆమె. వృత్తిరీత్యా తను వైద్యురాలు. ఇప్పుడు కిరీటాన్ని పక్కకు పెట్టి మానవసేవకు కదిలింది. ఆమె పేరు...భాషా ముఖర్జీ. మిస్ ఇంగ్లండ్ కిరీటం దక్కిన తర్వాత... అనేక స్వచ్ఛంద సంస్థలు ఆమెను తమ సాంస్కృతిక రాయబారిగా నియమించుకున్నాయి. అందాల కిరీటం ధరించి ఆఫ్రికా, టర్కీ, భారతదేశం, పాకిస్తాన్... ఇలా అనేక దేశాలకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ, ఆమె ఆ అరుదైన గౌరవాన్ని పక్కనపెట్టి... ఈ విపత్కర పరిస్థితుల్లో సాధారణ వైద్యురాలిగానే పనిచేయాలని నిర్ణయించుకుంది. కాకపోతే ఇప్పటికే ముఖర్జీ వివిధ దేశాలకు వెళ్లొచ్చింది కాబట్టి, రెండు వారాల పాటు స్వీయనియంత్రణలో ఉంటోంది. శ్వాసకోశ చికిత్సలో స్పెషలైజేషన్ చేసింది ఈ అందాల వైద్యురాలు.




## వజ్రాసనం

**మోకాళ్లు** నేలకు ఆనించి.. మడమలు, అరికాళ్లపై పిరుదులను ఉంచి అరచేతులను ధ్యాన ముద్రలో పెట్టి తొడలపై ఉంచాలి. తల, వెన్నెముక నిటారుగా ఉంచి... సహజంగా శ్వాస తీసుకుని, వదిలేయాలి. ఈ ఆసనం వల్ల వజ్రనాడి ఉత్తేజితమవుతుంది. కార్బోహైడ్రేట్స్ శాతాన్ని తగ్గిస్తుంది. రక్తంలో అధికపాళ్లలో ఉన్న షుగర్‌ను కరిగించి తిరిగి రక్తంలో కొత్తగా షుగర్ చేరకుండా నిరోధిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ ఆసనాన్ని భోజనం తర్వాత కూడా వేసుకోవచ్చు.

## కటౌట్లే అతిథులుగా!





**కరోనా వైరస్...** కటౌట్ల మధ్యన ఓ పెండ్లి చేయించింది. విచిత్రంగా ఉంది కదూ? మిచిగాన్‌కు చెందిన డాన్ స్టుగ్లిక్, అమీ సైమన్సన్ ప్రేమ జంట మార్చి 31న పెండ్లికి ఏర్పాట్లు చేసుకుంది. 160 మందిని శుభకార్యానికి ఆహ్వానించారు. అందరి సమక్షంలో ఘనంగా ఒక్కటి కావాలన్నది వారి ఆశ. కానీ కరోనా ఆ కలలకు ఆటంకం కలిగించింది. సామాజిక దూరం పాటించాలంటూ అక్కడి ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో... ఏ ఒక్కరూ బయటకు రాలేని పరిస్థితి. వధూవరులు ఈ పరిస్థితిని ఊహించలేదు. అప్పటికే ఆలస్యం అయింది. శుభకార్యాన్ని వాయిదా వేసుకోలేని అనివార్యత. మొత్తానికి తంతు పూర్తయింది. అతిథులెవరో తెలుసా? కార్డ్‌బోర్డ్ కటౌట్లు! అవును.. తాము ఆహ్వానం పంపిన 160 మందిని పోలిన కటౌట్లు తయారుచేయించి... అవే అతిథులుగా వివాహం చేసుకున్నారు. 'పరిస్థితులకు తగ్గట్టుగా మనమూ మారాలని నిర్ణయించుకున్నాం. అవి కటౌట్లు కాదు.. మా అతిథుల ప్రతిరూపాలని భావించాం' అన్నారు వధూవరులు.

## పెద్దల మాట

వివేకం లేని మిత్రుడు..
వివేకవంతుడైన శత్రువు
కంటే ప్రమాదం.
- విలియం షేక్‌స్పియర్



## స్టోరీ బాక్స్

### A friend in need is a friend indeed

Once upon a time there lived a lion in a forest. One day after a heavy meal. It was sleeping under a tree. After a while, there came a mouse and it started to play on the lion. Suddenly the lion got up with anger and looked for those who disturbed its nice sleep. Then it saw a small mouse standing trembling with fear. The lion jumped on it and started to kill it. The mouse requested the lion to forgive it. The lion felt pity and left it. The mouse ran away.

On another day, the lion was caught in a net by a hunter. The mouse came there and cut the net. Thus it escaped. There after, the mouse and the lion became friends. They lived happily in the forest afterwards.

**Moral :** A friend in need is a friend indeed.

meal: భోజనం, anger: కోపం, trembling: భయంతో వణకడం, ran away: పారిపోవడం, hunter: వేటగాడు, net:వల



## జర నవ్వుకో!

**టీచర్ :** చింటూ.. వైరస్ బొమ్మ వేసి తీసుకురమ్మన్నాను కదా.. వేశావా?

**చింటూ :** ఓ వేశాను టీచర్.. ఇదిగోండి..

**టీచర్ :** అందేంట్రా.. ఒట్టి తెల్లకాగితం ఇచ్చావు?

**చింటూ :** మరి.. వైరస్ మన కళ్ళకి కనిపించదు కదా మేడమ్..!!



'మనకి ముందు మెరుపు కనిపించి, ఆ తర్వాత ఉరుము శబ్దం వినిపిస్తుంది కదా! ఎందుకో చెప్పండి పిల్లలూ..?' అడిగింది టీచర్.
'మరేం లేదు మేడమ్.. మనకి ముందు కళ్లుండి, వెనుక చెవులున్నాయి కదా! అందుకే అలా జరుగుతుంది' బదులిచ్చాడు ఒక తుంటరి విద్యార్థి.

## నేర్చుకొందాం



1. I believe so – నేనూ అలాగే అనుకున్నాను.
2. Be carefull – జాగ్రత్తగా ఉండండి.
3. Stay at Home – ఇంట్లో ఉండండి.
4. Get the permission – అనుమతి తీసుకోండి.
5. Get Ready – సిద్ధంగా ఉండు.
6. Had your meal?– మీరు భోజనం చేశారా?
7. Who are you ?– మీరు ఎవరు ?
8. Who are they? వారు ఎవరు ?

## బొమ్మ గీయండి




## కష్టార్జితం కానిది

### కథ





**ఒక ఊరిలో** సుబ్బయ్య అనే పాల వ్యాపారి ఉండేవాడు. అతడు పాలల్లో నీళ్లు కలిపి డబ్బు బాగా సంపాదించేవాడు. మరో మార్గం లేక ఊళ్లోని జనాలు కూడా ఏమీ మాట్లాడలేక పోయేవారు. వాళ్ళ మౌనంతో సుబ్బయ్య దురాశ మరింత పెరిగింది. ఇంకొన్ని గేదెలను కొని, వాటి పాల మీద మరిన్ని లాభాలు సంపాదించాలని అనుకున్నాడు. పన్నెండు వందల రూపాయలు సంచిలో వేసుకొని గేదెలను కొనడానికి సంతకు బయలుదేరాడు. ఆ రోజు ఎండ చాలా తీవ్రంగా ఉండటం వల్ల, చాలా అలసిపోయాడు.
ఓ చెరువుగట్టు దగ్గర ఉన్న చెట్టు కింద నిద్రపోయాడు. తన సంచిని తలకింద పెట్టుకొని పడుకున్నాడు. అంతలో ఎక్కడి నుంచో ఒక కొండముచ్చు అక్కడకు వచ్చింది. వ్యాపారి తలకింద ఉన్న సంచిని చూసింది. అందులో ఏవో తినుబండారాలు ఉన్నాయనుకొని దాన్ని లాక్కుని ఒక్క ఉదుటున చెట్టు మీదికి వెళ్లిపోయింది. దాంతో వ్యాపారి లబోదిబోమని గోలపెట్టసాగాడు. ఆ లోపు అది సంచిని విప్పి, లోపల ఉన్న రూపాయలను నచ్చినట్టు పడవేయడం మొదలు పెట్టింది. సుబ్బయ్యకు పాలల్లో నీళ్లు కలపడం తప్పా.. చెట్టెక్కడం, నీటిలో ఈదడం రాదు. అందుకే నోరు తెరుచుకొని చూస్తూ నిలబడిపోయాడు. కొంతసేపటికి కొండముచ్చు సంచిలో ఉన్న డబ్బులను చల్లి.. తన పని పూర్తి అయినట్లుగా ఇంకొక చెట్టు మీదకి దూకింది.
సుబ్బయ్య గట్టు మీదనున్న రూపాయలను పోగు చేసుకొన్నాడు. వాటిని లెక్క వేస్తే నాలుగు వందలే మిగిలాయి. మిగతా ఎనిమిది వందలు నీటి పాలైపోయాయి. అప్పుడు అనిపించింది... పాల సొమ్ము మాత్రమే తనకు దక్కిందని, నీళ్ల కలిపి సంపాదించిన డబ్బు నీటిపాలై పోయిందని బాధపడుతూ తిరుగుముఖం పట్టాడు.

**నీతి**
ఎవరినీ మోసం చేయొద్దు. చేస్తే ప్రకృతే మీకు సరైన సమాధానం చెప్తుంది.

## పద్యం



కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభ లగ్నమునం
దొనరగ బట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ.

**భావం:** మంచి ముహూర్త బలమున కుక్కను తీసుకువచ్చి బంగారపు సింహాసనంలో కూర్చోపెట్టినా, దాని గుణము మార్చుకోలేదు. అల్పుడికి ఎంత గౌరవం ఇచ్చినా సరే తన స్వభావాన్ని వదలడు.

## జత పరచండి



- బాణం గుర్తు
- మోచేయి
- గొడ్డలి
- చీమ
- సేపు పండు
- విమానం



## చెప్పకోండి చూద్దాం..

1. సత్యం, అహింస ఎవరి సూత్రాలు?
2. ఎవరి పుట్టిన రోజు బాలల దినోత్సవంగా జరుపుకుంటాం?
3. 'విప్లవం వర్ధిల్లాలి' (ఇంక్విలాబ్ జిందాబాద్) ఎవరి నినాదం?
4. భారత కోకిల ఎవరు ?
5. భారత దేశానికి మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి ఎవరు?



**జవాబులు**
**చెప్పకోండి చూద్దాం:** 1. గాంధీ 2. నెహ్రూ 3. భగత్‌సింగ్ 4. సరోజినీ నాయుడు 5. మౌలానా అబుల్ కలాం ఆజాద్

# చిత్రం

## అల్లు అర్జున్ 'పుష్ప'?



**అ**ల్లు అర్జున్ కథానాయకుడిగా ప్రముఖ దర్శకుడు సుకుమార్ ఓ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక మందన్న కథానాయిక. గత ఏడాది అక్టోబర్‌లో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభోత్సవం జరుపుకుంది. మార్చిలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టడానికి సన్నాహాలు చేశారు. కరోనా ప్రభావంతో షూటింగ్ వాయిదా పడింది. బుధవారం అల్లు అర్జున్ జన్మదినోత్సవం సందర్భంగా సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించబోతున్నామని నిర్మాణ సంస్థ మైత్రీమేమకర్స్ ట్విట్టర్ ద్వారా తెలిపింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'పుష్ప' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. ఇందులో అల్లు అర్జున్ పాత్ర పేరు పుష్పక్ నారాయణ్ అని...దానిని స్ఫురించేలా సినిమాకు 'పుష్ప' అనే టైటిల్‌ను పెట్టబోతున్నారని చెబుతున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ కథాంశంతో చిత్తూరు నేపథ్యంలో నడిచే ఇతివృత్తమిదని, అల్లు అర్జున్ పాత్ర చిత్రణ నవ్య రీతిలో సాగుతుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రానికి దేవి శ్రీప్రసాద్ సంగీతాన్నందిస్తున్నారు.


చిరంజీవి

## కరోనాపై 'ఫ్యామిలీ' లఘు చిత్రం


రజనీకాంత్

**క**రోనా మహమ్మారిని నిర్మూలించే యజ్ఞంలో సినీ తారలందరూ భాగమవుతున్నారు. వివిధ వేదికల ద్వారా ప్రజల్ని జాగృతం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు సోషల్ మీడియాను కేంద్రంగా చేసుకుంటున్నారు. తాజాగా వివిధ భాషల్లోని ప్రముఖ తారలందరూ కలిసి 'ఫ్యామిలీ' పేరుతో ఓ లఘు చిత్రాన్ని రూపొందించారు. స్వీయగృహ నిర్బంధం, భౌతిక దూరాల్ని పాటించే అవశ్యకతను తెలియజేస్తూ ఈ షార్ట్ ఫిల్మ్‌కు రూపకల్పన చేశారు. ఇందులో బిగ్‌బీ అమితాబ్‌బచ్చన్, రజనీకాంత్, మోహన్‌లాల్, మమ్ముట్టి, చిరంజీవి, ప్రియాంకచోప్రా, రణభీర్‌కపూర్, అలియాభట్, ప్రొసేన్జీజ్ చటర్జీ, శివరాజ్‌కుమార్ వంటి అగ్రతారలు నటించారు. అమితాబ్‌బచ్చన్ తన కళ్లజోడు ఎక్కడుందని అడగడం..దానిని గురించి మిగతా తారలందరు అన్వేషించడం అనే కాన్సెప్ట్‌తో ఈ లఘు చిత్రం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో నటించిన తారలందరూ వారివారి ప్రాంతీయ భాషల్లోనే మాట్లాడటం విశేషం. 'మేమంతా మా సొంత గృహలకు పరిమితమైపోయి ఈ షార్ట్ ఫిల్మ్‌లో నటించాం. ప్రతి నటుడు తనకు సంబంధించిన వీడియోను షూట్ చేసి అందించాడు. ఈ పుటెజ్‌ను అంతా కలిసి ఓ చిత్రంగా రూపొందించాం. లాక్‌డౌన్ పూర్తయ్యే వరకు అందరూ ఇంట్లోనే ఉండి కరోనా నియంత్రణకు కృషి చేయాలి. భాషలు వేరైనా మేమంతా సినీ కళామతల్లి బిడ్డలం అని తెలియజేసేందుకే ఈ లఘు చిత్రాన్ని రూపొందించాం. కొన్ని టీవీ ఛానల్స్, స్పాన్సర్స్‌తో కలిసి కొంత నగదు కలెక్ట్ చేయబోతున్నాం. దీనిని దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమలో పనిచేస్తున్న దినసరి కార్మికులకు అందజేయాలని నిర్ణయించుకున్నాం' అని అమితాబ్‌బచ్చన్ పేర్కొన్నారు. ప్రస్తుతం 'ఫ్యామిలీ' షార్ట్ ఫిల్మ్ దేశవ్యాప్తంగా అభిమానుల్ని ఆకట్టుకుంటోంది.


ప్రియాంకచోప్రా

## పవర్‌పేటలో కీర్తిసురేష్

**ప్ర**స్తుతం 'రంగ్‌దే' సినిమాలో జంటగా నటిస్తున్నారు నితిన్, కీర్తిసురేష్. మరో సినిమాలో ఈ జోడీ సందడి చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నితిన్ కథానాయకుడిగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో 'పవర్‌పేట' పేరుతో ఓ చిత్రం తెరకెక్కబోతున్నది. ఓ యువకుడి జీవితంలోని నాలుగు దశల్ని ఆవిష్కరిస్తూ రూపొందనున్న ఈ చిత్రంలో నితిన్ 20 ఏళ్ల నుంచి అరవై ఏళ్ల వయస్కుడిగా కనిపిస్తున్నారు. కాగా ఈ సినిమాలో కథానాయికగా కీర్తి సురేష్ నటించనున్నట్లు తెలిసింది. కథతో పాటు తన పాత్రచిత్రణ నచ్చడంతో కీర్తిసురేష్ ఈ సినిమాలో నటించడానికి అంగీకరించినట్లు చెబుతున్నారు. పట్టణ ప్రాంతానికి చెందిన యువతిగా ఆమె కనిపించబోతున్నట్లు సమాచారం. గోదావరి యాసతో కీర్తిసురేష్ పాత్ర వినూత్నంగా సాగుతుందని చెబుతున్నారు. రెండు భాగాలుగా ఈ సినిమాను రూపొందించనున్నట్లు సమాచారం. టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.


కీర్తిసురేష్


గోపీచంద్


రామ్ తాళ్లూరి

## కార్మికులకు అండగా

**క**రోనా విపత్తు కారణంగా కష్టాల్ని ఎదుర్కొంటున్న సామాన్యులకు సినీ తారలు అండగా నిలుస్తున్నారు. విరాళాలు, నిత్యవసర సరుకులు అందించడంతో పాటు వివిధ రూపాల్లో మేమున్నామంటూ ప్రజల్లో కొండంత ధైర్యాన్ని నింపుతున్నారు. లాక్‌డౌన్ కారణంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్న వెయ్యి మందికిపైగా కార్మికులకు సినీ హీరో గోపీచంద్ నెల రోజులకు సరిపడా నిత్యవసర సరుకుల్ని స్వయంగా అందజేశారు. అలాగే నటుడు పోసాని కృష్ణమురళి యాభై నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకుల్ని అందించారు. సినీ నిర్మాత రామ్ తాళ్లూరి తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి ఐదు లక్షల్ని విరాళంగా అందించారు. యాభై వేల రూపాయల విలువ చేసే నిత్యవసర సరుకుల్ని సినీ కార్మికులకు అందించారు. బాలీవుడ్ నిర్మాత సాజిద్ నదియాద్‌వాలా తన సంస్థలో పనిచేసే నాలుగు వందల మంది ఉద్యోగులకు బోనస్‌తో పాటు సినీ కార్మికులకు ఆర్థికంగా సహాయాన్ని అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి పోరాడాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని సాజిద్ నదియాద్‌వాలా చెప్పారు.

## అజిత్ కోటి ఇరవై ఐదు లక్షల విరాళం



**త**మిళ నటుడు అజిత్ గొప్ప మనసును చాటుకున్నారు. కరోనా మహమ్మారి రూపుమాపేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషికి అండగా నిలిచారు. కోటి ఇరవై ఐదు లక్షల విరాళాన్ని ప్రకటించారు. పీఎం కేర్స్‌కు యాభై లక్షలు, తమిళనాడు ముఖ్యమంత్రి సహాయనిధికి యాభై లక్షలు విరాళంగా అందించారు అజిత్. సౌత్ ఇండియా ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కు ఇరవై ఐదు లక్షల్ని వితరణగా అందించారు.

## భయానికి దూరంగా ఉందాం


మహేష్‌బాబు

**క**రోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో అసత్యపు వార్తలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతూ ప్రజల్లో భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఆందోళన, భయాల్ని కలిగించే వ్యక్తులకు, వార్తలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు మహేష్‌బాబు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ట్విట్టర్ ద్వారా ప్రభుత్వాలతో పాటు వైద్యులు, పోలీసు సిబ్బందిపై ప్రశంసలు కురిపించారు.
'కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రభుత్వాలు ఐకమత్యంతో కృషిచేస్తున్నాయి. కోవిడ్–19తో జరుగుతున్న యుద్ధంలో ముందు వరుసలో ఉండి పోరాటం చేస్తున్న వారికి కృతజ్ఞతలు చెబుతాం.ఈ విపత్కర పరిస్థితుల్లో మనందరి ఆరోగ్యం కోసం తమ ప్రాణాల్ని పణంగా పెట్టి పనిచేస్తున్న యోధులను గౌరవిద్దాం. సామాజిక దూరం, శుభ్రతతో భయానికి దూరంగా ఉండటం కూడా ఈ పరిస్థితుల్లో చాలా అవసరం. అసత్యపు వార్తలు పెద్ద సమస్యగా పరిణమించాయి. పక్కదారి పట్టించే అలాంటి వార్తలకు దూరంగా ఉందాం' అని మహేష్‌బాబు ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు.





# ప్రతి కదలికపై నిఘా

- కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో మూడో కన్ను నజర్
- ఐదు అత్యాధునిక డ్రోన్లతో జల్లెడ
- 8వేలకు పైగా సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- కొత్తగా అందుబాటులోకి మొబైల్ కమాండ్ కంట్రోల్ వాహనం
- ఖాకీల చేతుల్లో సమస్త సమాచారం
- చర్యల కోసం ప్రత్యేక విభాగం
- చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చిక్కులే






'మనం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, తప్పు చేసి ఏ గల్లీలో, శివారులో నక్కినా, మనల్ని ఎవరు చూస్తారులే అని అనుకుంటున్నారా..?'

'లాక్‌డౌన్‌తో ఇంట్లోనే ఉంటున్నాం. అంతా కలిసి పత్తాలాడుదాం, దావత్ చేసుకుందాం. మన సమాచారం ఎవరికీ తెలియదులే అని భావిస్తున్నారా..?'

'ఓ అమ్మాయి ఒక్కతే రోడ్డుపై వెళ్తున్నది. మనం ఏమైనా చేయచ్చని భ్రమపడుతున్నారా..?'

..ఇలాంటి ఆలోచనలకు ఇక స్వస్తి పలకండి. మీకు తెలియకుండానే మూడో కన్ను మిమ్మల్ని వెంటాడుతుందన్న నిజాన్ని తెలుసుకోండి! రాత్రీపగలు అన్న తేడా లేదు, 24 గంటలపాటు డేగకళ్లు మీ ప్రతి కదలికనూ గమనిస్తున్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోండి! ఏ మాత్రం చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినా కొద్ది సమయంలోనే మీరు పోలీసుల చేతికి చిక్కుతారు. ఆ తర్వాత చిక్కుల్లో పడతారు. లాక్‌డౌన్ నిబంధనల ఉల్లంఘన, అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిల ఆగడాలు.. అక్రమ దందాలు లాంటి వాటిని అరికట్టేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. తస్మాత్ జాగ్రత్త!

**- కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ**

గత శనివారం.. రాత్రి 8 గంటల సమయం.. నగరంలోని ఒక కాలనీలోని దాబాపై ఎనిమిది మంది కలిసి పేకాడుతున్నారు. ఆట మొదలు పెట్టిన పది నిమిషాల్లోనే డ్రోన్ కెమెరా పసిగట్టి, పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఆ మేరకు నలుమూలల నుంచి అటాక్ చేసిన పోలీసులు, అందరినీ అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలిసిన సదరు వ్యక్తుల కుటుంబసభ్యులు.. వారు చేసిన ఘనకార్యానికి చీత్కరించుకున్నారు. పేకాడడం ఒక తప్పు అయితే.. లాక్‌డౌన్ నేపథ్యంలో సామాజిక దూరం పాటించకుండా ఉండడం మరో పొరపాటు. రెండు అంశాల కింద కేసులు పెట్టారు. ఇది మచ్చుకు మాత్రమే.



### మూడో కన్ను.. ఐదు డ్రోన్ కెమెరాలు..

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న ఐదు డ్రోన్ కెమెరాలు పని చేస్తున్నాయి. ఒక్కో డ్రోన్ కెమెరా ఆపరేట్ చేసే ప్రాంతం నుంచి మూడు కిలోమీటర్ల పరిధి వరకు 500 మీటర్ల ఎత్తుతో వెళ్తుంది. డ్రోన్‌లో అమర్చిన కెమెరాలు అత్యంత ఆధునికమైనవి. వీటిని ఆపరేట్ చేసేందుకు ప్రత్యేక విభాగాన్ని సీపీ కమలాసన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ విభాగం పోలీసులు 24 గంటలపాటు పనిచేస్తారు. ప్రతిరోజూ కరీం'నగరం'లోని అన్ని ప్రాంతాలనూ డ్రోన్లతో కవర్ చేస్తున్నారు. రాత్రీపగలు అనే తేడా లేకుండా దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. డ్రోన్ కెమెరా చిత్రీకరించే ప్రతి దృశ్యం ఆపరేట్ చేసే స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఆ మేరకు ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, చట్ట విరుద్ధమైన పనులు, ప్రస్తుత పరిస్థితుల్లో లాక్‌డౌన్ ఉల్లంఘనలకు పాల్పడినట్లుగా గుర్తిస్తే, వెంటనే పోలీసులు ఆ లోకేషన్ షేర్ చేసుకొని నలువైపులా చుట్టుముడుతారు. సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుంటారు. డ్రోన్లు చిత్రీకరించిన దృశ్యాలే కేసులు నమోదు చేసేందుకు ఆధారం అవుతున్నాయి. అంతేకాదు, ఈ కెమెరాల ఆపరేటింగ్ అంతా సీపీ కంట్రోల్‌లో ఉంటుంది. ఈ డ్రోన్ ద్వారా ఇప్పటికే అనేక కేసులను పోలీసులు ఛేదించారు. అంటే మన ప్రతి కదలికనూ మూడో కన్ను వెంటాడుతుందన్న నిజాన్ని గుర్తించాలి.



### నిఘా మన మంచికే..

పెరిగిన నిఘా ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో ఉపయుక్తం కానున్నది. కరోనా నేపథ్యంలో గుంపులు లేకుండా, రోడ్లపైకి రాకుండా చూడడం, సామాజిక దూరం పాటించడం.. వంటి అంశాలకు బాగా ఉపయోగపడుతుంది. కొత్త వ్యక్తుల, ట్యాగ్ చేసిన వ్యక్తుల కదలికలను గమనించడం, రెడ్‌జోన్‌లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం సులువు అవుతుంది. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగితే.. లోకేషన్ ఆధారంగా క్షణాల్లో సంఘటనా స్థలానికి చేరుకొని పరిష్కరించడానికి అవకాశమున్నది. పోలీసులు చేస్తున్న ఈ కార్యక్రమాలకు ప్రజల చేయూత తోడైతే మరిన్ని మంచి ఫలితాలు వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### 8వేలకుపైగా కెమెరాలు..

కమిషనరేట్ వ్యాప్తంగా ఎనిమిది వేల కెమెరాలు పనిచేస్తున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మూడు వేల కెమెరాలున్నాయి. ప్రతి కాలనీతోపాటు ప్రధాన రహదారులు, చౌరస్తాలు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రస్తుతం ఇవి పనిచేస్తున్నాయి. ఈ కెమెరాల్లో దృశ్యాలు, ఇతర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. వీటి ఆధారంగా ఎన్నో కేసులను ఛేదిస్తున్నారు.

### నిరంతరం నిఘా

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా నిరంతర నిఘా పెడుతున్నాం. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పని చేసుకునేందుకు వీలుగా సేవలందిస్తున్నాం. ప్రస్తుతం అత్యాధునిక టెక్నాలజీ వినియోగంలోకి వచ్చింది. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. అక్రమ దందాలు, చట్ట విరుద్ధమైన కార్యకలాపాల లాంటి అంశాలపై ప్రత్యేక విభాగాలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న లాక్‌డౌన్ నేపథ్యంలో ఎవరూ నిబంధనలు ఉల్లంఘించకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. ప్రజలకు నా విజ్ఞప్తి ఒక్కటే. ఎక్కడైనా సరే చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నా, కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగినా, ఆకతాయిల ఆగడాలలాంటివి కనిపించినా.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నా. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. ఇదే సమయంలో ప్రజారక్షణ, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

**-వీబీ కమలాసన్‌రెడ్డి, కరీంనగర్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్**




### మొబైల్ కమాండ్ కంట్రోల్ వాహనం..

అత్యాధునిక వినియోగంతో ముందుకెళ్తున్న కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో కొత్తగా 'మొబైల్ కమాండ్ కంట్రోల్ వాహనం' అందుబాటులోకి వచ్చింది. ఈ వాహనంలో మూడు కెమెరాలు అమర్చి ఉంటాయి. ఇందులో ఒకటి పీటీ జడ్ కెమెరా. ఇది 360 డిగ్రీల్లో తిరుగుతుంది. మరో రెండు కెమెరాలు ఇరువైపులా ఉన్న దృశ్యాలను చిత్రీకరిస్తాయి. ఈ మూడు కెమెరాలు చిత్రీకరించే ప్రతి దృశ్యం వాహనం లోపల ఉన్న స్క్రీన్‌పై ప్లే అవుతుంది. అనుమానం ఉన్నా, అప్రమత్తం చేయాల్సి వచ్చినా ఈ వాహనం నుంచే పోలీసులకు సమాచారం ఇస్తారు. వివిధ సందర్భాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు, సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఈ వాహనంలో మైకులతో కూడిన ఆంప్లిఫైర్ సిస్టం ఉంటుంది. అంతేకాదు, ఈ వాహనంలోని కెమెరాలు చిత్రీకరించే ప్రతి దృశ్యం అత్యంత క్లారిటీతో ఉంటుంది. ప్రస్తుతం లాక్‌డౌన్ నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో ఈ వాహనాన్ని వినియోగిస్తున్నారు. ఈ వాహనం నుంచి డ్రోన్ కెమెరాలను కూడా ఆపరేట్ చేయవచ్చు. చూసేందుకు మామూలు మినీ బస్సు మాదిరిగా ఉండే ఈ వాహనం లోపల మాత్రం అదునాతన సాంకేతిక పరిజ్ఞానం జోడించి ఉంది.

### ఎన్నో కేసులు ఛేదన..



డ్రోన్ కెమెరాలు, మొబైల్ కమాండ్ కంట్రోల్ రూం వాహనం, సీసీ కెమెరాల ద్వారా కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు ఎన్నో కేసులను సులువుగా ఛేదిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, పార్కులు, ఇతర ప్రాంతాల్లో ఆకతాయిల ఆటలకు అడ్డుకట్ట వేయడం, ప్రధాన క్రైం కేసుల్లో సీసీ పుటేజీలు, డ్రోన్ కెమెరాల దృశ్యాలను ఆధారంగా చేసుకొని కేసులను కొలిక్కి తేవడం, ఇసుక డంపులతోపాటు ఇసుక, గుట్కా అక్రమ దందాలను నిలువరించడం, స్వచ్ఛమానేరు ప్రకటించి.. ఈ ప్రాంతంలో నీరు కలుషితం కాకుండా చూడడం, దొంగతనాలను నియంత్రించడంలాంటి అనేక అంశాల్లో విజయం సాధించారు. గతంలో వచ్చిన ఫలితాలను ఆధారంగా చేసుకొని.. డ్రోన్ కెమెరాల సంఖ్యను పెంచడంతోపాటు మొబైల్ కమాండ్ కంట్రోల్ వాహనంలాంటి వాటి వినియోగం మరింత విస్తృతం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

# సఫాయిల ఆనందహేల

- సీఎం ప్రకటనతో ఆనందంలో పారిశుధ్య కార్మికులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంబురాలు
- కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు



చీర్లవంచలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ రవీందర్, గ్రామస్తులు

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ/సిరిసిల్ల రూరల్:** కరోనా వైరస్ కట్టడిలో కీలక భూమిక పోషిస్తున్న వైద్య, పారిశుధ్య సిబ్బందికి ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో ఆ రెండు విభాగాల సిబ్బంది ఆనందంలో మునిగిపోయారు. మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సఫాయిలు సంబురాలు చేసుకున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సామాజిక దూరం పాటిస్తూ 50 మంది కార్మికులు, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ సునీల్‌రావు హాజరై, మాట్లాడారు. కష్టకాలంలో కార్మికులను ఆదుకునేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. నగరంలో వైరస్ వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు ఎంతో కష్టపడి పని చేస్తున్నారని ప్రసంశించారు.. నగర కమిషనర్ క్రాంతితో కలిసి కార్మికులకు ఆప్రాన్లు, డ్రెస్సుల జతలను అందించారు. అలాగే తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో సర్పంచ్ జక్కుల రవీందర్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పంచాయతీ సిబ్బంది, పారిశుధ్యకార్మికులు క్షీరాభిషేకం చేశారు. ఇక్కడ టీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు, ఉపసర్పంచ్ బ్రహ్మం, శ్రీకాంత్, బాబు, ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దాసరికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న పట్టణ ప్రముఖులు

## పెద్దపల్లిలో 'హెల్పింగ్ హ్యాండ్స్'

- ఎమ్మెల్యే దాసరి పిలుపు మేరకు ఆవిర్భావం
- తొలిరోజు ₹15లక్షలకుపైగా విరాళాలు

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** నిరుపేదలు, వలస కూలీలను ఆదుకోవడమే లక్ష్యంగా జిల్లా కేంద్రంలో 'పెద్దపల్లి హెల్పింగ్ హ్యాండ్స్' ఆవిర్భవించింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పిలుపు మేరకు పట్టణానికి చెందిన అనేక మంది ప్రముఖులు ముందుకు రాగా, దాసరి సారథ్యాన బాలకిషన్ జకోటియా, ఎల్లంకి సురేశ్, కొట్టె సదానందం, ఉప్పు కృష్ణమూర్తితో ఈ వేదిక ఏర్పాటైంది. హెల్పింగ్ హ్యాండ్స్‌కు తన తొలి సాయంగా ₹2లక్షలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించగానే, విరాళాలు వెల్లువెత్తాయి. బిల్డింగ్ అసోసియేషన్ తరపున ₹2లక్షలు, బాలకిషన్ జకోటియా ₹లక్ష, మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల ₹లక్ష, కట్టె సదానందం ₹లక్ష, ఇల్లందుల కృష్ణమూర్తి ₹లక్షా ఒక వెయ్యి, సిమెంట్ ఆఫ్ అసోసియేషన్ ₹లక్ష, పరమేశ్వర ఎలక్ట్రికల్స్ ₹లక్ష, గాయత్రీ కళాశాల ₹51వేలు, కోలేటి రమేశ్ ₹51వేలు, ఈగం లచ్చన్న ₹51వేలు, పరేమ్ సరడా ₹51వేలు, ముత్యాల రాజన్న ₹51వేలు, కట్కూరి రాజేశం ₹51వేలు, రాందేవ్‌బాబా గ్రూప్ ₹51వేలు, కిషన్ జావర్ ₹51వేలు, అల్లంకి రామన్న ₹25వేలు, దొడ్ల శివశంకర్ ₹25వేలు, చంద్ర వైన్స్ వెంకన్న ₹25వేల చొప్పున మొత్తం ₹15లక్షల 9వేలు ఎమ్మెల్యేకు అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ₹40లక్షలు పోగు చేసి పట్టణంలోని 8 వేల మంది నిరుపేదలకు సాయం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పేదలను ఆదుకునేందుకు ఇంకా దాతలు ముందుకు రావాలని కోరారు.

## గ్రానైట్ అసోసియేషన్ భారీ విరాళం

- సీఎం సహాయనిధికి ₹75 లక్షలు
- మందుల కొనుగోలుకు మరో ₹కోటి..
- మంత్రుల సమక్షంలో సీఎంకు అందజేసిన నాయకులు

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ గ్రానైట్ అసోసియేషన్ మరో సారి తమ సామాజిక బాధ్యతను చాటింది. సీఎం సహాయనిధికి భారీ విరాళాన్ని ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులు గంగుల కమలాకర్, ఈటల రాజేందర్ సమక్షంలో సీఎం కేసీఆర్‌కు ₹75 లక్షల చెక్కును అందజేశారు. ఇందులో కరీంనగర్ గ్రానైట్ అసోసియేషన్ నుంచి ₹50 లక్షలు, మార్వాడీ గ్రానైట్ అసోసియేషన్ నుంచి ₹25 లక్షలు ఇచ్చారు. అంతే కాకుండా కరోనా బాధితుల చికిత్స కోసం వైద్య పరికరాలు, మందులు కొనుగోలుకు ₹కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం కేసీఆర్‌ను కలిసిన వారిలో కరీంనగర్ గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు పొన్నంనేని గంగాధర్‌రావు, అధ్యక్షుడు శ్రీధర్, మార్వాడీ గ్రానైట్, ఫ్యాక్టరీస్ అసోసియేషన్ నాయకులు గోపి, మహేశ్వర్, రాజేశ్ అగర్వాల్, ముఖేశ్ పర్వాల్ తదితరులు ఉన్నారు.



సీఎం కేసీఆర్‌కు చెక్కు అందిస్తున్న గ్రానైట్ అసోసియేషన్ నాయకులు, చిత్రంలో మంత్రులు గంగుల, ఈటల

## వలస జీవులకు చేయూత

- ముంబైలో చిక్కుకుపోయిన ధర్మపురి నియోజకవర్గవాసులకు మంత్రి కొప్పుల భరోసా



మంత్రికి విరాళాలు అందజేస్తున్న గొల్లపల్లి మండల నాయకులు

**ధర్మపురి, నమస్తేతెలంగాణ/ ధర్మారం, గొల్లపల్లి:** ధర్మపురి నియోజకవర్గానికి చెందిన పలువురు కూలీలు ఉపాధి కోసం ముంబైకి వెళ్లి, లాక్‌డౌన్‌తో అక్కడే చిక్కుకుపోయారు. చేతిలో పని లేక, తినడానికి తిండిలేక ఇబ్బందులు పడుతున్నారు. తమను ఆదుకోవాలని ఈ నెల 3న మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వీడియోకాల్ చేసి వేడుకోగా, ఆయన చలించిపోయారు. తానే సొంతంగా విడతల వారీగా సాయం అందిస్తున్నారు. సోమవారం వరకు ₹లక్షా 43వేలు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపించిన ఆయన, మంగళవారం మరో ₹91వేలను గూగుల్ పే ద్వారా మొత్తం ₹2.34లక్షలు పంపించారు. ఇదే సమయంలో లాక్‌డౌన్‌తో మన వద్ద ఇబ్బంది పడుతున్న కూలీలను, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన కూలీలను పెద్ద మనసుతో ఆదుకోవాలని కోరగా, ఆయన పిలుపునందుకొని అనుచరులు, అభిమానులు ముందుకొస్తున్నారు. ఈ నెల 6న గొల్లపల్లి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ₹1,10,500 పోగు చేసి మంత్రికి అందజేశారు. మంగళవారం మంత్రి ఈశ్వర్ ప్రధాన అనుచరుడు, వెల్గటూర్ మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావ్ ₹లక్ష, అలాగే గొల్లపల్లి మండల నాయకులు ₹50వేలను అందించారు. కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కొప్పులకు అందించారు.



సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

## నిరుపేదలను ఆదుకోవడం మా బాధ్యత

**చొప్పదండి/ రామడుగు:** నిరుపేదలను ఆదుకోవడం తమ బాధ్యత అని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భరోసా ఇచ్చారు. చొప్పదండిలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత మున్సిపల్ అధ్యక్షురాలు ఇప్పనపల్లి విజయలక్ష్మి ఆధ్వర్యంలో 13వ వార్డు పరిధిలోని 20 మందికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం దేశరాజ్‌పల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిరుపేదలకు 15 క్వింటాళ్ల బియ్యం, నిత్యావసరాలను అందించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మాట్లాడారు. గ్రామానికో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అవసరమున్న చోట అదనంగా కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. లాక్‌డౌన్ సమయంలో ప్రజలెవరూ ఇండ్ల నుంచి బయటకు రావద్దని, మరోసారి చేతులెత్తి నమస్కరిస్తున్నానని విజ్ఞప్తి చేశారు. దేశ్‌రాజ్‌పల్లిలో పారిశుధ్య కార్మికులను తాసిల్దార్ కోమల్‌రెడ్డి, ఎంపీడీవో సతీశ్‌రావు, ఎస్‌ఐ అనూష, ఎంపీపీ కలిగేటి కవితతో కలిసి సత్కరించారు. ఆయా చోట్ల కార్యక్రమాల్లో చొప్పదండి ఎంపీపీ చిలుక రవి, మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, సింగిల్‌విండో చైర్మన్లు వెల్మముల్లారెడ్డి, తిరుపతిరావు, దేశ్‌రాజ్‌పల్లి సర్పంచ్ కోల రమేశ్, ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గంట్ల వెంకటరెడ్డి, టీఆర్‌ఎస్ రామడుగు మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




పారిశుధ్య కార్మికుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

## మీ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**గోదావరిఖని టౌన్:** అసహాయులు, నిరుపేదలకు అండగా నిలుస్తున్న విజయమ్మ ఫౌండేషన్, ఇతర స్వచ్ఛంద సంస్థ సభ్యుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొనియాడారు. కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, బల్దియా కమిషనర్ ఉదయ్ కుమార్‌తో కలిసి ఆయన, పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులతో మంగళవారం సమావేశమయ్యారు. ఇప్పటికే విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు, నిరుపేదలకు ఒక్కొక్కరికి 5 కేజీల బియ్యంతోపాటు కిలో పప్పు అందించామని చెప్పారు. మరిన్ని స్వచ్ఛంద సంఘాలు ముందుకు వచ్చి సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 28వ డివిజన్‌లో ప్రజలకు వ్యాధి నిరోధక శక్తిని పెంచే హోమియోపతి మందులు పంపిణీ చేశారు. ఆ తర్వాత రామగుండం కార్పొరేషన్ ఆఫీసులో కూరగాయల వ్యాపారులతో సమావేశమై, దుకాణాల వద్ద వినియోగదారులు సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులను సన్మానించారు.

## బీమా చెక్కును అందించిన మంత్రి కొప్పుల

**పెగడపల్లి:** మండల సెర్ప్ సీసీ గండ్ర చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించగా, ఇన్సూరెన్స్, స్త్రీ నిధి కింద వచ్చిన రూ.11.50 లక్షల బీమా చెక్కును మంగళవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. కరీంనగర్‌లోని తన నివాసంలో పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, డీఆర్డీవో లక్ష్మీనారాయణతో కలిసి బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, స్త్రీ నిధి జనరల్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.



జగిత్యాల రూరల్: ఎమ్మెల్యే సమక్షంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న డాక్టర్ మధుసూదన్ దంపతులు

## సేవలు ఎనలేనివి: ఎమ్మెల్యే సంజయ్

**జగిత్యాల రూరల్ :** ఏరియా దవాఖాన శానిటేషన్ సిబ్బంది సేవలు ఎనలేనివని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కొనియాడారు. జగిత్యాల ప్రాంతీయ వైద్యశాల సిబ్బందికి సీనియర్ వైద్యుడు మధుసూదన్ రావు దంపతులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సామాజిక దూరాన్ని విధిగా పాటించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం జగిత్యాల తన క్యాంప్ కార్యాలయంలో నజియా సుల్తానాకు ₹25,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, జిల్లా యూత్ అధ్యక్షుడు దావ సురేశ్, కౌన్సిలర్ పిట్ట ధర్మరాజు, సత్యం పాల్గొన్నారు.

## యాచకులకు కృష్ణభాస్కర్ అభయం

**వేములవాడ, నమస్తేతెలంగాణ/ఎల్లారెడ్డిపేట:** వేములవాడ ఆలయ పరిసరాల్లోని యాచకులకు కలెక్టర్ కృష్ణభాస్కర్ అభయం ఇచ్చారు. లాక్‌డౌన్ నేపథ్యంలో వేములవాడలోని క్షేత్రస్థాయి పరిస్థితులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లోని యాచకులు, కూలీలతో కలెక్టర్ ముచ్చటించారు. రోజూ భోజనం అందుతుందా? మీ పరిస్థితి ఎలా ఉంది? అని ఆరాతీశారు. దీంతో ప్రతిరోజూ అన్నపూర్ణ భోజనం, ఇతర దాతలు భోజనం అందిస్తున్నారని వారు కలెక్టర్‌కు తెలిపారు. ఎవరూ అధైర్యపడవద్దని అండగా ఉంటామని వారికి కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం స్థానికులతో మాట్లాడి బియ్యం సరఫరా, కూరగాయాల రేట్లను తెలుసుకున్నారు. చెక్కపల్లి రహదారిలోని ఐసోలేషన్ వార్డును సందర్శించారు. అందులో ఉన్న వారిని ఆరోగ్య పరిస్థితులను వైద్యాధికారి మహేశ్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తాసిల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారి మహేశ్‌రావు తదితరులున్నారు. అదేవిధంగా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని క్వారంటైన్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు.

## కొనుగోళ్లలో ఇబ్బందులు కలగవద్దు: కలెక్టర్ రవి

**జగిత్యాలప్రతినిధి, నమస్తే తెలంగాణ :** ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను కలెక్టర్ గుగులోతు రవి ఆదేశించారు. జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లపై జిల్లా అధికారులతో మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి గింజనూ కొనుగోలు చేసేలా చూడాలని సూచించారు. ధాన్యం డబ్బును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బేతి రాజేశం, డీఆర్వో అరుణశ్రీ, జడ్పీసీఈవో శ్రీనివాస్, ఆర్డీవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్: నిరుపేదలకు భోజనం వడ్డిస్తున్న మేయర్ సునీల్‌రావు

## కరోనా కట్టడికి సహకరించాలి: మేయర్

**కార్పొరేషన్, నమస్తేతెలంగాణ:** కరీంనగరంలో కరోనా కట్టడికి సహకరించాలని నగరవాసులకు మేయర్ వై సునీల్‌రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన 3, 4, 5, 24, 25 డివిజన్లలోని పారిశుద్ధ్య కార్మికులు, నిరుపేదలకు నాకా చౌరస్తాలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. అలాగే 35వ డివిజన్‌లో ఆరీఫ్ ఉస్మాన్ సహకారంతో వంద మంది పేదలకు 10 కిలోల బియ్యం, వంట సామగ్రిని అందజేశారు. బొందుగుల వారి ఆధ్వర్యంలో 33వ డివిజన్ అయ్యప్ప ఆలయం వద్ద 600 మందికి అన్నదానం చేశారు. 22, 42, 43, 44, 45, 1 డివిజన్లల్లో కార్మికులకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మేయర్ మాట్లాడారు. ఆపద సమయంలో నిరుపేదల ఆకలిని తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమాల్లో బొందుగుల శంకర్ సింగ్, నరేందర్, కార్పొరేటర్లు బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, కుర్ర తిరుపతి, కంసాల శ్రీనివాస్, ఫర్వీన్ పాల్గొన్నారు.

## వైద్య పరికరాల కోసం ₹కోటి

■ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రకటన

**జగిత్యాల, నమస్తే తెలంగాణ :** నాలుగు ఉమ్మడి జిల్లాలు మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని సర్కారు దవాఖానల్లో వైద్య పరికరాల కొనుగోలు కోసం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తన కోటా నిధుల నుంచి ₹కోటి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సర్కారు దవాఖానలో పనిచేస్తున్న 50 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికీ ₹500 విలువైన నిత్యావసర సరుకులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు.

## వైద్యుడు సంజీవరెడ్డికి ప్రశంస

**ముస్తాబాద్:** మండలంలోని పోతుగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి సంజీవరెడ్డి జిల్లా ఉత్తమ వైద్యుడిగా ఎంపికయ్యారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందజేసి, అభినందించారు.

## వంద కాటన్ల బెల్లం పట్టివేత

**జగిత్యాల, నమస్తే తెలంగాణ :** అక్రమంగా తరలిస్తున్న వంద కాటన్ల బెల్లాన్ని జగిత్యాల బీట్‌బజార్ చౌరస్తాలో జగిత్యాల ఎక్సైజ్ సీఐ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టుకున్నారు. నిజామాబాద్ నుంచి జగిత్యాలకు తీసుకొస్తుండగా పట్టుకొని వాహనాన్ని సీజ్ చేశారు. నిజామాబాద్‌కు చెందిన పోలు ప్రశాంత్, జగిత్యాలకు చెందిన విజయలక్ష్మి ట్రేడర్స్ యజమానిపై కేసు నమోదు చేశారు.

## కరీంపేట్‌లో రేషన్ షాపు తనిఖీ

**శంకరపట్నం:** సర్కారు పంపిణీ చేసిన ఉచిత బియ్యం సరఫరాలో కరీంపేటకు చెందిన ఓ రేషన్ డీలర్ అవకతవకలు పాల్పడుతున్నాడని అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం రేషన్ షాపులో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. నిల్వలను సరిచూడగా 15.87 క్వింటాళ్ల బియ్యం తేడా వచ్చిందని ఆర్ఐ లక్ష్మారెడ్డి, వీఆర్వో సమత గుర్తించారు. ఈ మేరకు తాసిల్దార్ జగత్‌సింగ్‌కు తెలుపగా, ఆయన ఆర్డీవోకు నివేదించారు.

# సేవానిరతికి సలాం..

ఉపాధిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడిపోయిన పేదలు, వలస కార్మికులకు మానవతావాదులు అండగా నిలుస్తున్నారు. కొందరు ఆర్థిక చేయూతనిస్తూ.. మరికొందరు అన్నదానం చేస్తూ సేవా నిరతిని చాటుకుంటున్నారు. పలువురు తమకు తోచిన విధంగా నిత్యావసర సరుకులు, కూరగాయలను పంపిణీ చేస్తూ భరోసా ఇస్తున్నారు.



మెట్‌పల్లిటౌన్: కోడిగుడ్లు, మాస్కులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు



కరీంనగర్ హెల్త్: అనాథ బాలల ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న డాక్టర్లు

కరీంనగర్ జిల్లా..

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ/ కరీంనగర్‌హెల్త్/ ఇల్లందకుంట/సైదాపూర్/హుజూరాబాద్‌టౌన్/ చొప్పదండి నమస్తే తెలంగాణ/గంగాధర/ కరీంనగర్ రూరల్ /మానకొండూర్/గన్నేరువరం:** నగరంలోని 37 వ డివిజన్‌లో ఇండ్లలో పనిచేసే కార్మికులకు డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ దంపతులు నిత్యావసర సరుకులు, బియ్యం కూరగాయలు పంపిణీ చేశారు. ముకరంపురలోని అనాథాశ్రమానికి శ్రీసాయి లైఫ్‌లైన్ హస్పిటల్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, డాక్టర్ కంచన్, విజయగణపతి సాయిబాబా ఆలయ చైర్మన్ చిట్టుమల్ల కొండయ్య బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు కరీంనగర్‌కు చెందిన 'మేమున్నాం మీ కోసం' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాజేందర్ నగునూరి 15 రోజులుగా భోజనం పెడుతున్నారు. నాలుగో డివిజన్‌లో 60మంది పారిశుద్ధ్య కార్మికులకు సుడా డైరెక్టర్ లక్కాకుల మోహన్‌రావు మిత్రబృందం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. జిల్లాకేంద్రంలోని టీబీ హస్పిటల్ వద్ద తెలంగాణ ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు నిరుపేదలకు భోజనం పంపిణీ చేశారు. చొప్పదండికి చెందిన రిటైర్డ్ టీచర్ రాంరెడ్డి 38 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికీ ₹200ల చొప్పున ఇవ్వగా, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మేడిపల్లి సత్యం కాట్నపల్లిలో 50మంది నిరుపేదలకు 15రోజులకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు దూస రాము ఐదు నిరుపేద కుటుంబాలకు 10 కిలోల బియ్యాన్ని అందించారు. సిరిసేడులో నాయకులు బుర్ర రమేశ్, చిన్న రాయుడు, ధనుంజయ్ 80 మంది నిరుపేదలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. లస్మన్నపల్లిలో 22 మంది అన్నార్తులకు 15 కిలోల చొప్పున బియ్యం, సరుకులను ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. హుజూరాబాద్‌లో పారిశుద్ధ్య కార్మికులు, వైద్య సిబ్బందికి డివిజన్ హెల్త్ ఎడ్యుకేటర్ ఏ అశోక్‌కుమార్ అరటి పండ్లు పంచారు. విష్ణు అనాథ శరణాలయంలోని అభాగ్యులకు టీడీపీ నేత అంబటి జోజిరెడి వంట సామగ్రి అందజేశారు. అలాగే 25 మంది వలస కూలీలకు కాగితపు రమేశ్, కాగితపు నాగు కూరగాయలు, బియ్యం అందించారు. మానకొండూర్‌లో వలస కార్మికులకు జగ్గయ్యపల్లెకి చెందిన గౌడ సంఘం నేత ఉయ్యాల అంజయ్యగౌడ్ బియ్యం, కూరగాయలను జడ్పీటీసీ శేఖర్‌గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. గంగాధర లయన్స్ క్లబ్ సభ్యులు వైద్య, ఆరోగ్య, పోలీస్ సిబ్బందితో పాటు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. మధురానగర్‌లో పోలీస్ సిబ్బంది, చిరు వ్యాపారులకు 250 మాస్కులను ఉచితంగా అందజేశారు. గంగాధరలో పారిశుద్ధ్య కార్మికులకు సరుకులు, పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఆచంపల్లికి చెందిన కోలపురం పర్శయ్య 48కిలోల రేషన్ బియ్యాన్ని నలుగురు నిరుపేదలకు అందజేశారు. బొమ్మకల్, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్‌లో ఇటుక బట్టీల కార్మికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. 'ఫీడ్ ద నీడ్' ఆధ్వర్యంలో చెర్లభూత్కూర్‌లో నిరుపేదలు, బీజేపీ ఆధ్వర్యంలో ఇటుక బట్టీ కార్మికులకు సరుకులు అందజేశారు. గన్నేరువరంలో 15మంది పారిశుద్ధ్య కార్మికులు, 15మంది వలస కార్మికులు, కాసీంపేటలో కోళ్ల ఫారంలో పనిచేసే కూలీలు పది మందికి లయన్స్ క్లబ్ సభ్యులు తలా 20కిలోల చొప్పున బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు శానిటైజర్లు, గ్లౌజ్‌లు, మాస్కులను ఎంపీడీవో సురేందర్‌రెడ్డి, ఎస్ఐ ఆవుల తిరుపతి అందజేశారు. మాదాపూర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజ్‌లు, మాస్కులు, శానిటైజర్లను జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, సర్పంచ్ సంపత్ పంపిణీ చేశారు. గుండ్లపల్లిలో సర్పంచ్ బేతెల్లి సమత, నాయకుడు బేతెల్లి రాజేందర్‌రెడ్డి 21 నిరుపేద కుటుంబాలకు తలా ₹500 నగదు, నిత్యావసరాలు అందజేశారు.

జగిత్యాల జిల్లా..

**ధర్మపురి నమస్తే తెలంగాణ /ధర్మపురి రూరల్ / జగిత్యాల రూరల్ /మెట్‌పల్లిటౌన్/బుగ్గారం/పెగడపల్లి/మారుతీనగర్/మల్యాల/కోరుట్ల/మేడిపల్లి/రాయికల్ /మల్లాపూర్/కోరుట్లటౌన్/మల్యాల/మెట్‌పల్లి టౌన్:** ధర్మపురిలో ఎల్ఎమ్ కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో వంద మంది యాచకులకు, వలస కూలీలకు టీఆర్ఎస్ నాయకులు భోజనాన్ని అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ కుమార్, తదితరులు ఉన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి ధర్మపురి మండలం బోదెరనక్కలచెరువు గూడెం గిరిజనులకు 4వేల కోడిగుడ్లను పంపిణీ చేశారు. బుగ్గారంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి, గ్రామానికి చెందిన 15 నిరుపేద కుటుంబాలకు సర్పంచ్ మూల సుమలత దంపతులు మాస్కులు, నిత్యావసరాలు పంపిణీచేశారు. ఆస్ట్రేలియాలో ఉంటున్న వెల్గొండ యువకుడు శనిగారపు తిరుపతి గ్రామంలోని నిరుపేదలకు, పారిశుద్ధ్య సిబ్బందికి నిత్యావసరాలను, మాస్కులను తన మిత్ర బృందంతో పంపిణీ చేయించారు. కోరుట్ల పట్టణంలో లయన్స్ క్లబ్, కోటి నవదుర్గ మహిళా సంఘం ఆధ్వర్యంలో క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ గుంటుక కవిత పారిశుద్ధ్య కార్మికుల కోసం 60 కిలోల గోధుమపిండి, వంద శానిటైజర్లు, 250 మాస్కులు, 300 బిస్కట్ ప్యాకెట్లను మున్సిపల్ కమిషనర్ అయాజ్‌కు అందజేశారు. కోరుట్ల కూరగాయల మార్కెట్‌లో లయన్స్ క్లబ్ ప్రతినిధులు 1500 మాస్కులు, 900 శానిటైజర్లను అందజేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గుంటుక సురేశ్, చంద్రప్రకాశ్, ప్రవీణ్ ఉన్నారు. పెగడపల్లిలో జడ్పీటీసీ ₹16 వేలు, ఎంపీపీ ₹5వేలు, ఏడుమోటలపల్లికి చెందిన ఎడ్ల తిరుపతిరెడ్డి ₹5వేలు, నంచర్లకు చెందిన శ్రీరామ ట్రస్ట్ ₹24 వేలు అందించగా మొత్తం ₹50 వేలతో ట్రస్ట్ ఆధ్వర్యంలో 165 మంది వలస కార్మికులకు నిత్యావసర వస్తువులను అందించారు. నర్సింహునిపేటలో సర్పంచ్ నేరువట్ల బాబుస్వామి, గ్రామ మహిళా సంఘ సభ్యులతో ఉచితంగా తయారు చేయించిన 500 మాస్కులను గ్రామస్తులకు ఎంపీపీ, జడ్పీటీసీ పంపిణీ చేశారు. పెగడపల్లిలో పారిశుద్ధ్య సిబ్బందిని సర్పంచ్ మేర్గు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించి నిత్యావసర సరుకులు అందజేశారు. మెట్‌పల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ అధ్యక్షురాలు రాణవేని సుజాత తన సొంత ఖర్చుతో కోడిగుడ్లు, మాస్కులు, గ్లౌసులను పంపిణీ చేశారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో 20 పేద కుటుంబాలకు పలువురు దాతలు నిత్యావసర సరుకులు అందించగా, వాటిని జడ్పీటీసీ కాటిపెల్లి రాధ, సర్పంచ్ కోరెపు రవితో కలిసి పంపిణీచేశారు. పెద్దాపూర్ కారోబార్ కుంట సాయికుమార్, ఆశ కార్యకర్త అలాల సునీత తమకు వచ్చిన రేషన్ బియ్యం 48కిలోలను నాలుగు పేద కుటుంబాలకు అందజేశారు. మేడిపల్లి ఎంపీపీ దోనకంటి ఉమాదేవి మనుమరాలు దోనకంటి ఇశిక రెండో జన్మదినం సందర్భంగా బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలకు భోజనం ప్యాకెట్లను అందజేశారు. మేడిపల్లి మండలం వెంకట్రావుపేట పారిశుద్ధ్య సిబ్బంది నలుగురికి ఎన్ఆర్ఐ కాటిపెల్లి రాకేశ్‌రెడ్డి ₹500 చొప్పున సర్పంచ్ కాటిపెల్లి జగన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మేడిపల్లి హన్మాన్ ఆలయంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిట్యాల మోహన్ మాస్కులను అందజేశారు. మోత్కురావుపేటలో వలస కూలీలకు సర్పంచ్ దుంపేట లక్ష్మీనర్సయ్య అన్నదానం చేశారు. జగిత్యాల మండలం బాలపెల్లిలో గ్రామస్తులకు కోడిగుడ్లు, బియ్యం, 5 క్వింటాళ్ల టమాటా, 3 క్వింటాళ్ల బీరకాయలను యూత్ సభ్యులు పంపిణీ చేశారు. మల్యాల సహకార సంఘం చైర్మన్ ముత్యాల రాంలింగారెడ్డి తన సొంత ఖర్చులతో యూనిఫాంలు, శానిటైజేషన్ కిట్లు, మాస్కులను తెప్పించి, మల్యాలలో పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ మిట్టపెల్లి సుదర్శన్, మార్కెట్ కమిటీ చైర్మన్ జనగాం శ్రీనివాస్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం వలస కార్మికులకు ఒక్కొక్కరికీ 12కిలోల చొప్పున బియ్యం, ₹500 నగదును అందజేశారు. మల్లాపూర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శివ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాస్కులు, గ్లౌజ్‌లు, శానిటైజర్లను అందించారు. అల్లీపూర్‌లో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ముఖీద్ సొంత ఖర్చులతో పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు, మాస్కులు, గ్లౌసులు అందించారు. ఎంపీపీ లావుడ్య సంధ్యానాయక్‌తో కలిసి శాలువాతో సన్మానించారు. మాదాపూర్‌లో జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య ఆధ్వర్యంలో గ్రామస్తులకు మాస్కులను, అయిలాపూర్‌లో పారిశుద్ధ్య సిబ్బందికి యువసేన యూత్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, శానిటైజర్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎండీ రజాక్, ₹5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు. కొండగట్టుపై, దిగువన ఉన్న యాచకులు, వికలాంగులకు కొడిమ్యాల మండలం పూడూర్‌కి చెందిన యూత్ సభ్యులు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. మెట్‌పల్లి 23వ వార్డుకు చెందిన ఆకుల సంజీవ్ తన రేషన్‌బియ్యం 48 కిలోలను కౌన్సిలర్ ఒజ్జెల బుచ్చిరెడ్డి చేతులమీదుగా పేద కుటుంబాలకు పంపిణీ చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా..

**వేములవాడ, నమస్తేతెలంగాణ/సిరిసిల్లటౌన్/ సిరిసిల్ల రూరల్/ కల్చరల్/ చందుర్తి/ వేములవాడ రూరల్/ ఎల్లారెడ్డిపేట/ కోనరావుపేట/ రుద్రంగి/ ఇల్లంతకుంట :** సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ గాజుల నారాయణ సిరిసిల్లలో 18మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికీ ₹1500 చొప్పున నగదును అందజేశారు. అదేవిధంగా మరో 37మంది వలస కార్మికులకు ₹60వేల విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పట్టణంలోని సత్యసాయి సేవా మందిరం ఆధ్వర్యంలో వంద మంది వలస కార్మికులు, పేదలకు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య చేతుల మీదుగా భోజనాన్ని అందజేశారు. రాజీవ్ నగర్ కౌన్సిలర్ ఒగ్గు ఉమా రాజేశం దంపతులు, వారి మిత్రులు పలు కుటుంబాలకు కూరగాయలు, ఉల్లిగడ్డలు, కోడిగుడ్లతోపాటు బియ్యం అందజేశారు. చంద్రంపేటలో కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, యువకుడు చందు, 8 వార్డులోని పెద్దూరులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది నిరుపేద కుటుంబాలకు కౌన్సిలర్ చెన్నమనేని కీర్తి, తంగళ్లపల్లిలోని వలస కార్మికులకు గ్రామస్తురాలు ఆసాని లావణ్య క్వింటాలు బియ్యం, నిత్యావసర సరుకులు, మాస్కులను, జిల్లెల్లలోని 15 రజక కుటుంబాలకు బియ్యంతోపాటు నిత్యావసర సరుకులను కరీంనగర్‌కు చెందిన దుబ్బాక రమేశ్, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్ అందజేశారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు కాంగ్రెస్ నాయకుడు ఆది శ్రీనివాస్ నిత్యావసర వస్తువులను అందజేసి, శాలువాతో సత్కరించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో 14సంచార జాతుల కుటుంబాలకు, పేదలకు దేవయ్య, దాసరి గణేశ్, అడ్డగుళ్ల మహేశ్ (ఎన్ఆర్ఐ, కెనడా), కొండరమేశ్, పాశం దేవరెడ్డి, వారి స్నేహితులు నిత్యావసరాలు అందజేశారు. బొప్పాపూర్‌కు చెందిన కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి , సర్పంచ్ లఫోరం మండల అధ్యక్షుడు కొండాపురం బాల్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన పది పేదకుటుంబాలకు నిత్యావసర సరుకులను అందించారు. ఉచ్చిడి కిషన్‌రెడ్డి 14మంది పారిశుద్ధ్య కార్మికులకు, గొల్లపల్లికి చెందిన వార్డు సభ్యురాలు పందిళ్ల దివ్య 18మంది పారిశుద్ధ్య సిబ్బందికి నిత్యావసరసరుకులను అందించారు. అదే గ్రామానికి చెందిన సత్తిరెడ్డి, అంజిరెడ్డి, దాసరి గణేశ్ 14 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఇచ్చారు. వేములవాడ రూరల్ మండలంలోని తుర్కాశీనగర్‌లో నిరుపేదలకు సర్పంచ్ షేక్ రిజ్వానా తన సొంతఖర్చులతో 16మంది పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను రూరల్ ఎస్ఐ సామ్యరెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. చందుర్తి మండలం రామన్నపేటలో సర్పంచ్ దుమ్మ అంజయ్య, తాసిల్దార్ నరేశ్, ఎస్ఐ సునీల్, ఎంపీడీవో రవీందర్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు, బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. మూడపల్లిలో పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలకు సామవీర రమణయ్య, సర్పంచ్ చిలుక అంజిబాబు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. కోనరావుపేట మండలం మల్కపేటలో నాలుగు నిరుపేద కుటుంబాలకు 25కిలోల బియ్యంతోపాటు నిత్యావసరాలు ఎంపీపీ చంద్రయ్యగౌడ్ పంపిణీ చేశారు. రుద్రంగికి చెందిన యువకుడు ఎర్రం అరవింద్ 10 మంది వలస కార్మికులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కోనరావుపేట మండలం నాగారంకు చెందిన యువకులు అదే గ్రామానికి చెందిన మల్లవ్వకు ₹8వేలు అందించి అండగా నిలిచారు. ఇల్లంతకుంట మండలం వల్లంపట్లలో 54 మంది వలస కార్మికులకు సర్పంచ్ కేతిరెడ్డి అనసూర్య, ఎంపీటీసీ నాయిని స్రవంతి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా అన్నదానం చేశారు. అలాగే వంట సామగ్రి అందజేశారు.



సిరిసిల్ల టౌన్: కార్మికులకు ఆర్థికసాయం అందజేస్తున్న అర్బన్ బ్యాంకు చైర్మన్



ఇల్లంతకుంట: అన్నదానం చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, ఎస్ఐ



విద్యానగర్‌లో అన్నదానం చేస్తున్న సుడా డైరెక్టర్



కార్పొరేషన్: నిత్యావసరాలు అందిస్తున్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్

## ఊరంతా ఒక్కటై..

■ పారిశుద్ధ్యకార్మికుడి అంత్యక్రియలు



రాములు (ఫైల్)

**వీర్నపల్లి:** పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక భూమికను పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై ప్రజల్లో కృతజ్ఞతా భావం వెల్లివిరుస్తున్నది. ఇరవై ఏండ్లు ఊరిని ఊడ్చి కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందిన పారిశుద్ధ్య కార్మికుడి అంత్యక్రియలను ఊరంతా ఒక్కటై నిర్వహించడం మానవతా దృక్పథాన్ని చాటుకున్నది. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన వంతడ్పుల రాములు(52) కిడ్నీ సంబంధిత వ్యాధితో మంగళవారం మృతిచెందాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన ఆయన కుటుంబానికి ఊరంతా అండగా నిలిచింది. సర్పంచ్ గొర్రె కరుణ, గ్రామస్తులు అందరూ ముందుకొచ్చి తలాకొంతపోగుచేసి అంత్యక్రియలను నిర్వహించి అండగా నిలిచారు. ₹19వేల ఆర్థిక సాయాన్ని రాములు కూతుళ్లు, ఒక కొడుకు, భార్య దుర్గవ్వకు అందజేశారు.

## పోలీసులకు ₹25 వేల సాయం

**మెట్‌పల్లి, నమస్తే తెలంగాణ:** కరోనా కట్టడికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్న పోలీసులకు మాజీ ఎమ్మెల్యే గంగుల భూమయ్య కొడుకు వివేక్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మెట్‌పల్లి ఎస్ఐ సదాకర్‌కు ₹25 వేలు చెక్కును అందజేశారు. ఆయన వెంట టీఆర్ఎస్ నాయకుడు ఉజగిరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు ఇచ్చిన వివరాలు**
**ఆవునూర్ గ్రామస్తులు ₹50వేలు**
**ధనరేకుల మల్లుసంతోష్ ₹50 వేలు**
**(గుండంపల్లి సర్పంచ్)**

## కడచూపూ కరువై..

■ స్వగ్రామంలో అనారోగ్యంతో తల్లిమృతి
■ లాక్‌డౌన్‌తో గల్ఫ్ నుంచి రాలేక పోయిన ఇద్దరు తనయులు
■ చితికి నిప్పంటించిన మూడేళ్ల మనుమడు



లోకుర్తి లక్ష్మి (ఫైల్)

**కోనరావుపేట:** కరోనా మహమ్మారి అనేక విషాదాలను నింపుతున్నది. ఓ చోట కన్నతల్లి చనిపోతే కడచూపునకు నోచుకోలేని దయనీయ స్థితిని తెచ్చింది. వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన లోకుర్తి లక్ష్మి (52)కి తలలో కంతి ఏర్పడింది. సుమారు ₹6లక్షలకు పైగా ఖర్చు చేసి మూడు నెలల క్రితం శస్త్ర చికిత్స చేయించినా ఫలితంలేకుండా పోయింది. ఆపరేషన్ అనంతరం లక్ష్మి కోమాలోకి వెళ్లిపోవడంతో కూతురు రజిత, కోడళ్లు ఆమెను కంటికి రెప్పలా చూసుకున్నారు. తల్లి వైద్య ఖర్చులు, కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో లక్ష్మి ఇద్దరు కొడుకులు రాజు, శేఖర్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లారు. ఈ క్రమంలోనే తల్లి మంగళవారం మృతి చెందగా, ప్రస్తుతం లాక్‌డౌన్‌తో వారు ఇంటికి రాలేని దుస్థితి నెలకొన్నది. తల్లి కడసారి చూపునకు నోచుకోలేకపోయామంటూ ఫోన్‌లోనే వారు రోదించారు. ఎనిమిది నెలల క్రితమే తండ్రి అనారోగ్యంతో చనిపోయినప్పుడు వచ్చి వెళ్లామని, కనీ తల్లిని మాత్రం చూసుకోలేకపోతున్నామని విలపించారు. చివరకు తల్లి లక్ష్మి చితికి చిన్న కొడుకు శేఖర్ తనయుడు హార్థిక్ (3)తో నిప్పుపెంటించారు. ఈ ఘటనను చూసి గ్రామస్తులను కంటతడి పెట్టారు.

## పౌష్టికాహారం అందించాలి : జడ్పీ అధ్యక్షురాలు

**జగిత్యాల, నమస్తే తెలంగాణ :** జిల్లాలో గర్భిణులు, బాలింతకు పౌష్టికాహారం తప్పని సరిగా అందించాలని జడ్పీ అధ్యక్షురాలు దావ వసంత సూచించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారితో జడ్పీ కార్యాలయంలో మంగళవారం ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గర్భిణులకు, బాలింతల ఇంటికి వెళ్లి పౌష్టికాహారం, గుడ్లు, బియ్యం సక్రమంగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, డిప్యూటీ సీఈవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## 88 వాహనాలు సీజ్

**వేములవాడ, నమస్తేతెలంగాణ:** లాక్‌డౌన్ ఉల్లంఘనకు పాల్పడిన 88 వాహనాలను సీజ్ చేశామని వేములవాడ పట్టణ సీఐ శ్రీధర్ వెల్లడించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు సీజ్ చేసిన వాహనాల్లో ఏడుగురు ఆటోలు, ఎనిమిది కార్లు, 73 ద్విచక్రవాహనాలు ఉన్నాయన్నారు.

## రక్తదానం

**కరీంనగర్ రూరల్ :** నగునూర్ ప్రతిమ హాస్పిటల్‌లో తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి అశ్వంత్‌కు ఏబీ + గ్రూప్ రక్తం అత్యవసరమైంది. ఈ సమాచారాన్ని తన స్నేహితుల ద్వారా తెలుసుకున్న సామాజిక కార్యకర్త పొన్నాల సతీశ్ వెంటనే స్పందించాడు. ప్రతిమ వైద్యశాలకు వెళ్లి రక్తదానం చేశాడు. సతీశ్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలుపగా, వైద్యులు అభినందించారు.

## సంక్షిప్త సమాచారం

### రామన్న భరోసా

**గంభీరావుపేట:** గంభీరావుపేటకు చెందిన సాయిలు ఇటీవల మృతి చెందగా, మంత్రి కేటీఆర్ ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. అమాత్యుడి సూచన మేరకు టీఆర్ఎస్ మండల నాయకులు వెంకటస్వామిగౌడ్, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, అహ్మద్, నాగరాజు గౌడ్, రాజు, లింగంయాదవ్, రాజు ₹10వేల ఆర్థిక సాయాన్ని సాయిలు భార్య వెంకటవ్వకు మంగళవారం అందజేశారు.

### రైతుబీమా చెక్కు అందజేత

**సిరిసిల్ల రూరల్:** తంగళ్లపల్లి మండలం రామచంద్రపూర్‌కు చెందిన మహిళా రైతు పత్తెం లక్ష్మి ఇటీవల మృతి చెందగా, రైతు బీమా పథకం కింద రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును లక్ష్మి పెద్దకొడుకు మధుకు సర్పంచ్ స్రవంతి అందజేశారు.

### బయటకు రావద్దు: ఎస్పీ సింధూశర్మ

**కోరుట్ల టౌన్:** కరోనా పాజిటివ్ నిర్ధారణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇండ్ల నుంచి బయటకు రావద్దని జిల్లా ఎస్పీ సింధూ శర్మ సూచించారు. కోరుట్ల కొత్త బస్టాండ్ సమీపంలో ఒకరికి పాజిటివ్ రావడంతో మంగళవారం ఆమె పర్యటించారు. బాధితుడి ఇంటి పరిసరాలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. నివారణ చర్యలపై సీఐ రాజశేఖర్‌రాజుతో మాట్లాడారు. బాధితుడి కుటుంబసభ్యులు నివాసమున్న చోటు నుంచి కిలో మీటర్ దూరం వరకు నిషేధిత ప్రాంతంగా ప్రకటించామని చెప్పారు. ఇండ్లకు వచ్చే వైద్య, ఆరోగ్య సిబ్బందికి వివరాలను అందించాలని సూచించారు.

### కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి మాస్కులు

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్ ఆధ్వర్యంలో మాస్కులు, శానిటైజర్స్ పంపిణీ చేశారు. అలాగే తాసిల్ కార్యాలయ సిబ్బందికి కూడా మాస్కులు, శానిటైజర్స్ అందజేస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 30,067 | 8,792 |
| 2,476 | 708 |

# వాణిజ్య

వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 75.00 | రిటైల్ లైవ్ | 97.00 |
| డ్రెస్డ్ | 141.00 | స్కిన్‌లెస్ | 160.00 |

గుడ్ల ధరలు (వందకు)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 345.00 | వరంగల్ | 348.00 |
| మెదక్ | 345.00 | కరీంనగర్ | 348.00 |
| రంగారెడ్డి | 345.00 | డజన్ ధర | 54.00 |



# ఉద్యోగులకు భరోసా

## వేతనజీవుల భద్రతకు పెద్దపీట

## లాక్‌డౌన్‌లోనూ అండగా నిలుస్తున్న కంపెనీలు

**కరోనా వైరస్ దెబ్బకు దేశమంతా లాక్‌డౌన్ అయ్యింది. అత్యవసర సేవలు మినహా మిగతావన్నీ మూతబడ్డాయి. వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ఎక్కడికక్కడ ఉత్పత్తి నిలిచిపోయింది. ఇంట్లో నుంచి కాలు బయట పెట్టలేని దుస్థితి నెలకొనడంతో కొనుగోళ్లు పూర్తిగా మందగించాయి. అయినప్పటికీ పలు కంపెనీలు నిరుత్సాహపడట్లేదు. తమపై ఆధారపడ్డ ఉద్యోగుల జీతాల్ని చెల్లిస్తున్నాయి. కొన్ని సంస్థలైతే సిబ్బంది బ్యాంకు ఖాతాలో ముందస్తుగానే వేతనాల్ని జమ చేస్తుండటం గమనార్హం. ఈ పెను ఉత్పాతం నుంచి బయటపడితే చాలని, ఆ తర్వాత ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకోవచ్చని ప్రతీ సంస్థ ముక్త కంఠంతో చెప్తున్నది.**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కరోనా వైరస్ విజృంభిస్తున్న వేళ మేమున్నామంటూ ఉద్యోగులకు యాజమాన్యాలు అండగా నిలుస్తున్నాయి. ఐటీ, ఫార్మా, నిర్మాణ, పౌల్ట్రీ.. ఇలా ప్రతీ సంస్థా మానవతా దృక్పథంతో స్పందిస్తున్నాయి. లాక్‌డౌన్‌లోనూ ఉద్యోగుల్ని ఆర్థికంగా ఆదుకునేందుకు కంపెనీలు సంసిద్ధంగా ఉన్నాయి. ఈ మూసివేత 21 రోజుల కంటే ఎక్కువ కాలం కొనసాగినా సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది రానివ్వబోమని సంస్థలు చెప్తుండటం గమనార్హం. హౌస్ కీపింగ్, మెయింటెనెన్స్, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలకు కోత విధించట్లేదని అంటున్నాయి. ఈ క్రమంలోనే రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టులో చేసేవారికీ అడ్వాన్సుగా జీతాలు చెల్లిస్తుండటం విశేషం. గతంతో పోల్చితే ఈసారి వారం రోజుల ముందే ఉద్యోగుల వేతనాన్ని బ్యాంకుల్లో జమ చేస్తున్నాయి. చాలా ప్రైవేట్ కంపెనీలు 7-10 తేదీల్లో ఉద్యోగులకు జీతాలిస్తాయన్న విషయం తెలిసిందే. పైగా ఉద్యోగానికి రాకున్నా పర్వాలేదని, ఇంట్లోని ఉండి లాక్‌డౌన్‌కు సహకరించాలని కోరుతున్నాయి. కొత్త ఉద్యోగులకూ సంపూర్ణ భరోసాను కల్పిస్తున్నాయి. తెలంగాణ నిర్మాణ రంగంలో అగ్రగామి సంస్థల్లో ఒకటిగా కొనసాగుతున్న అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ వివిధ ప్రాంతాల్లో పనిచేసే 5వేల మంది కార్మికులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తల్ని తీసుకున్నది.

**కాగ్నిజెంట్‌లో 25 శాతం అధిక జీతం**

అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్.. భారతీయ ఉద్యోగులకు 25 శాతం అధికంగా వేతనాలను చెల్లిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సంస్థలో మొత్తం 2.03 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తుండగా.. తాజా నిర్ణయంతో దేశంలోని దాదాపు 1.30 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతున్నది. ఈ నెల నుంచే దీన్ని అమలు చేస్తున్నట్లు కాగ్నిజెంట్ సీఈవో బ్రయాన్ హంఫ్రీస్ తెలిపారు.

**తొలగింపుల్లేవ్: పీడబ్ల్యూసీ**

దేశ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో ఉన్నా తాము మాత్రం ఉద్యోగుల్ని తొలగించడం లేదని ప్రైస్‌వాటర్‌హౌస్‌కూపర్స్ (పీడబ్ల్యూసీ) సంస్థ ప్రకటించింది. కాకపోతే క్రమం తప్పకుండా అందించే ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, బోనస్‌లు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో సకాలంలోనే మార్చి నెల జీతాల్ని అందజేస్తామని సమాచారాన్ని ఇచ్చింది. ఇక భారతీ ఎయిర్‌టెల్ సంస్థ ఇప్పటికే ఉద్యోగులకు మార్చి నెల జీతాన్ని చెల్లించింది. దాల్మియా భారత్ గ్రూప్ మార్చి 26-27 తేదీ మధ్యలోనే ఉద్యోగుల ఖాతాల్లోకి ముందస్తుగా జీతాల్ని జమ చేసింది.

**కోతలు పెట్టబోం**

ప్రైవేటు ఉద్యోగుల జీతాల్ని చెల్లించాలని ప్రధాని మోదీ విజ్ఞప్తి నేపథ్యంలో శ్రీనివాసా ఫామ్స్, అబీబస్, రాంకీ ఎస్టేట్స్ వంటి సంస్థలు సానుకూలంగా స్పందించాయి. తమ వద్ద పనిచేసే 4వేల మంది ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో ఎలాంటి కోతల్ని విధించడం లేదని శ్రీనివాసా ఫామ్స్ ఎండీ సురేష్ చిట్టూరి తెలిపారు. ఇదే పంథాను అబీబస్ సైతం అనుసరించింది. తమ రెండు వందల మంది ఉద్యోగులకు సకాలంలో జీతాలను చెల్లిస్తున్నామని, కొందరు వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారని సంస్థ సీవోవో రోహిత్ శర్మ తెలిపారు. రాంకీ ఎస్టేట్స్ ఉద్యోగుల జీతాలను సకాలంలో చెల్లించడంతోపాటు భవన నిర్మాణ కార్మికులకు అన్నిరకాల తోడ్పాటును అందిస్తున్నది. అలాగే చైనాకు చెందిన వీవో, ఒప్పో మొబైల్‌లతోపాటు ఎన్‌టీటీ నెట్‌మ్యాజిక్, సెరా శానిటరీ వేర్‌లూ ఉద్యోగులకు భరోసా ఇచ్చాయి.

### సాయం చేయండి



'మనతోపాటు మన చుట్టూ ఉన్నవారి గురించి కూడా ఆలోచించాలి. కూడు, గూడులేని ఎంతోమంది అభాగ్యులు ఈ దేశంలో నివసిస్తున్నారు. ప్రస్తుత గడ్డు పరిస్థితులు వారి జీవనాన్ని మరింత దయనీయంగా మార్చేశాయి. ఈ సంక్షోభం సమయాన వారందరికీ మనం అండగా ఉండాలి. లాక్‌డౌన్‌తో ఎందరో రోజుకూలీలు పూట గడువని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇది నిజంగా గుండెలు పగిలే వ్యథే. ఇలాంటి నిరుపేదల కోసం మన గ్రూప్ చేతనైన సాయం చేస్తున్నది. వారికోసం స్వచ్ఛంద విరాళాలతో ఓ నిధిని ఏర్పాటు చేశాం. ఎన్ని చేసినా కష్టాల్లో ఉన్న తోటివారిని ఆదుకోవడం మన వ్యక్తిగత బాధ్యత. మీకు మేమున్నాం.. వారికి తోడుగా మీరుండండి.'

**-ఉద్యోగులకు మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా లేఖ**

### మేమున్నాం



'ఒకరికొకరు అండగా ఉండాల్సిన సమయమిది. కరోనా వైరస్ రోజురోజుకూ విజృంభిస్తున్నది. లాక్‌డౌన్‌కు సహకరించండి. నిర్లక్ష్యానికి భారీ మూల్యం తప్పదు. మీ ప్రస్తుత పరిస్థితిని మేము అర్థం చేసుకోగలం. మీకు, మీ కుటుంబ సభ్యులకు తోడుగా ఉంటాం'

**-ఉద్యోగులకు టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ లేఖ**

### భయం వద్దు



'ఉద్యోగాల గురించి దిగులు అక్కర్లేదు. జీతాల కోతలూ ఉండబోవు. సిబ్బంది, వ్యాపార భాగస్వాములుసహా అందరికీ ఉద్యోగ, ఉపాధి భద్రత ఉంటుంది. ప్రస్తుతం ఇస్తున్న వేతనాలను తగ్గించం. ఉద్యోగ ఆఫర్లనూ వెనక్కి తీసుకోం. ఈ విపత్కర సమయంలో అండగా ఉంటాం'

**-కల్యాణ్ కృష్ణమూర్తి, ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీఈవో**

# తొలగింపులు, కోతలు వద్దు: ఈపీఎఫ్‌వో




కరోనా వైరస్ కట్టడికి అమలవుతున్న లాక్‌డౌన్ నేపథ్యంలో చాలా కంపెనీలు వ్యయ నియంత్రణ దిశగా అడుగులు వేస్తున్నాయి. వ్యాపారం లేక ఆదాయం దూరమవడంతో ఉద్యోగుల్ని తొలగించడం, జీతాలను తగ్గించడంపై దృష్టి పెడుతున్నాయి. దీనిపై ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్‌వో) స్పందించింది. ఉద్యోగాల నుంచి ఎవరినీ తీసేయవద్దని, జీతాలకూ కోత పెట్టవద్దని ఆయా కంపెనీల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేసింది. ఈ కష్టకాలంలో లాభనష్టాలను మరిచి ఉద్యోగులకు అండగా ఉండాలని సూచించింది.



# హమ్మయ్య!

## లాభాలతో కళకళలాడిన స్టాక్ మార్కెట్లు

## సెన్సెక్స్ 2,476, నిఫ్టీ 708 పాయింట్లు లాభం

## రూ.7.71 లక్షల కోట్లు పెరిగిన సంపద

**ముంబై, ఏప్రిల్ 7:**

కరోనా వైరస్‌తో కుప్పకూలిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాలతో కళకళలాడాయి. కరోనాతో దేశం అతలాకుతలమవుతున్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో ప్రారంభం నుంచే లాభాల బాటపట్టిన సూచీలు ఏ దశలోనూ వెనక్కితిరిగి చూసుకోలేదు. వరుసగా మూడు రోజుల తర్వాత ఆరంభమైన బీఎస్‌ఈ సెన్సెక్స్ మళ్లీ 30 వేల మార్కును దాటింది. చివరకు 2,476.26 పాయింట్లు లేదా 8.97 శాతం లాభపడి 30,067.21 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ 708.40 పాయింట్లు లేదా 8.76 శాతం అందుకొని 8,792.20 వద్ద ముగిసింది. మే 2009 తర్వాత ఇంతటి స్థాయిలో లాభాలను ఆర్జించడం ఇదే తొలిసారి. వరుసగా రెండు రోజులుగా భారీ నష్టాలను మూటగట్టుకున్న స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు కోలుకోవడంతో మదుపరుల సంపద అమాంతం పెరిగింది. మంగళవారం వీరి సంపద రూ.7,71,377.02 కోట్లు పెరిగి రూ.1,16,38,099.98 కోట్లకు ఎగబాకింది. మహావీర్ జయంతి సందర్భంగా సోమవారం మార్కెట్లు సెలవుపాటించాయి.

- 30 షేర్ల ఇండెక్స్‌లో అన్ని షేర్లు లాభాల్లో ముగిశాయి. వీటిలో 14 రంగ షేర్లు పదిశాతానికి పైగా లాభపడ్డాయి.
- ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌యూఎల్, మారుతి, నెస్లె, బజాజ్ ఆటో, రిలయన్స్, హీరో, హెచ్‌సీఎల్ టెక్, సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు పదిశాతానికి పైగా లాభపడ్డాయి.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 12 శాతం లాభపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.81 వేల కోట్లు పెరిగింది.
- రంగాలవారీగా చూస్తే బ్యాంకెక్స్, ఇంధనం, వాహన, టెలికం, టెక్, ఎఫ్‌ఎంసీజీ, మెటల్ రంగ సూచీలు పదిశాతానికి పెరిగాయి.
- బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు 5.40 శాతం వరకు ర్యాలీని సాధించాయి.
- బ్రెంట్ క్రూడాయిల్ ధరలు 3 శాతానికి పైగా పెరుగడం అంతర్జాతీయ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి.
- రూపాయి మారకం విలువ 49 పైసలు పెరిగి 75.46 వద్ద ముగిసింది.

# రాష్ట్రాలకు ఊరట



## ఓవర్‌డ్రాఫ్ట్ నిబంధనల్ని సడలించిన ఆర్బీఐ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ఆర్బీఐ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కోసం ఓవర్‌డ్రాఫ్ట్ ఫెసిలిటీ నిబంధనలను సడలించింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని తెలిపింది. సెప్టెంబర్ 30 వరకు ఈ వెసులుబాటు వర్తిస్తుంది. కరోనా వైరస్ నేపథ్యంలో నెలకొన్న విపత్కర పరిస్థితులు, దెబ్బతిన్న రాష్ట్రాల ఆదాయం, పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం గడువునూ 14 రోజుల నుంచి 21 రోజులకు పెంచింది. త్రైమాసికంలో ఇది 50 రోజులకు మించరాదని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఇది 36 రోజులుగానే ఉన్నది. బ్యాంక్‌తో చేసుకునే రుణ ఒప్పందమే ఈ ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం. దీనివల్ల తమ ఖాతాలో ఉన్న మొత్తాల కంటే ఎక్కువ నగదును తీసుకునే వెసులుబాటు ఖాతాదారులకు వస్తుంది. అయితే అనుమతించిన మేరకే ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది.



మహీంద్రా క్యాబ్ సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తున్న రాచకొండ సీపీ మహేష్ భగవత్

# మహీంద్రా ఉచిత క్యాబ్స్

## కరోనా రోగుల కోసం హైదరాబాద్‌లో అందుబాటులోకి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** మహీంద్రా లాజిస్టిక్స్ లిమిటెడ్ హైదరాబాద్‌లో కరోనా రోగుల కోసం ఉచిత అత్యవసర క్యాబ్ సేవలను ప్రారంభించింది. రాచకొండ కమిషనరేట్ సహకారంతో హైదరాబాద్, సైబరాబాద్, సంగారెడ్డి, రాచకొండ పరిధుల్లో ఈ సర్వీసులను మంగళవారం అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ తెలియజేసింది. ఈ క్యాబ్‌లు 24 గంటలు నడుస్తాయని సంస్థ ఎండీ, సీఈవో రాంప్రవీణ్ స్వామినాథన్ వెల్లడించారు.

# పొదుపులపై ఎస్బీఐ వడ్డీకోత

## పావు శాతం తగ్గించిన బ్యాంక్

## ఎంసీఎల్ఆర్ 35 బేసిస్ పాయింట్లు తగ్గింపు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) డిపాజిట్ దారులకు షాకిచ్చింది. అన్ని రకాల డిపాజిట్లపై వడ్డీరేటును పావు శాతం తగ్గిస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. దీంతో డిపాజిట్లపై వడ్డీరేటు 3 శాతం నుంచి 2.75 శాతానికి పరిమితమైంది. ఈ నూతన వడ్డీరేట్లు ఈ నెల 15 నుంచి అమలులోకి రానున్నట్లు తెలిపింది. వ్యవస్థలో తగినంత ద్రవ్య లభ్యతను పెంచే ఉద్దేశంలో ఎస్బీఐ పొదుపు ఖాతాలపై చెల్లించే వడ్డీరేట్లలో కోత విధించింది. మరోవైపు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని కూడా 35 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఏడాది కాలపరిమితి కలిగిన ఎంసీఎల్ఆర్‌పై రేటు 7.75 శాతం నుంచి 7.40 శాతానికి దిగొచ్చాయి. ఈ రేట్లు ఈ నెల 10 నుంచి అమలులోకి రానున్నట్లు బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో 30 ఏండ్ల కాలపరిమితి కలిగిన లక్ష రూపాయల గృహ రుణాలపై చెల్లించనున్న ఈఎంఐ రూ.24 తగ్గనున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 11 సార్లు వడ్డీరేట్లను తగ్గించిన విషయం తెలిసిందే.

## మహిళలకు బీవోబీ అండ

**ముంబై:** కరోనా వైరస్ నిధులు లేక సతమతమవుతున్న మహిళలకు ఆర్థికంగా చేయూతనివ్వడానికి బీవోబీ ముందుకొచ్చింది. మహిళా స్వయం-సహాయక బృందాలకు లక్ష రూపాయల వరకు రుణం ఇవ్వనున్నట్లు మంగళవారం ప్రకటించింది. మహిళలతోపాటు నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్‌లకు కూడా రుణాలు ఇవ్వనున్నట్లు తెలియచేసింది.

# ఆట

## కోహ్లీసేనకు కంగారూలు భయపడుతున్నారు




**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ ఓ బాంబు పేల్చాడు. ఐపీఎల్ కాంట్రాక్టుల కోసం ఆస్ట్రేలియా ఆటగాళ్లు..కోహ్లీసేనకు భయపడుతున్నారంటూ క్లార్క్ అన్నాడు. అవును గత కొన్నేండ్లుగా చూస్తే భారత కెప్టెన్ కోహ్లీతో పాటు జట్టు సభ్యులను స్లెడ్జింగ్ చేసే విషయంలో కంగారూలు వెనుకంజ వేస్తున్నారన్నాడు. 'క్రికెట్ ఆర్థికపరమైన విషయాల్లో భారత్ ఎంత బలమైందో అందరికి తెలుసు. అందుకే ఆస్ట్రేలియాతో పాటు మిగతా జట్లు కూడా టీమ్ఇండియా అంటే భయపడ్డాయి. ఎందుకంటే ఐపీఎల్‌లో ఆడాలంటే వారితో మంచిగా ఉండాలనేది అందరికి అర్థమైంది' అని క్లార్క్ అన్నాడు.

## గవాస్కర్ 59 లక్షల విరాళం

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌పై పోరాడేందుకు క్రీడాకారుల మద్దతు కొనసాగుతూనే ఉన్నది. ప్రధాన మంత్రి సహాయ నిధికి రూ.59 లక్షలు సహాయం చేస్తున్నట్లు భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మంగళవారం పేర్కొన్నాడు. మరోవైపు హైదరాబాద్ యువ షట్లర్ పారుపల్లి కశ్యప్..తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.3 లక్షల విరాళమిచ్చాడు. టీమ్ఇండియా టెస్టు స్పెషలిస్టు చతేశ్వర్ పుజారా.. పీఎం కేర్స్‌తో పాటు గుజరాత్ సీఎం రిలీఫ్ పండ్‌కు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు ప్రకటించాడు.



నిఖత్ జరీన్

# ఇంట్లోనే భద్రం

- **కరోనాను ఎదుర్కోవాలంటే లాక్‌డౌన్ మేలు**
- **సమిష్టి పోరాటంతో మహమ్మారిని తరిమికొడతాం**
- **నమస్తే తెలంగాణతో నిఖత్ జరీన్**

లాక్‌డౌన్ సమయంలో ప్రాక్టీస్ పక్కన పెట్టి.. కుటుంబంతో గడుపుతున్నానని తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ పేర్కొంది. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా యావత్ క్రీడాలోకం స్తంభించిపోయిన నేపథ్యంలో.. తాను కూడా ఇంట్లోనే ఉంటూ స్వల్పంగా సాధన చేస్తున్నానని ఆమె చెప్పింది. మానవ జాతి మునుపెన్నడూ చూడని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నదని.. ఇలాంటి విపత్కర స్థితిలో ప్రభుత్వ సూచనలను పాటిస్తూ.. ఇండ్లకే పరిమితమవడం మంచిదని ఆమె అంది. బాక్సింగ్ కెరీర్ ఎంచుకున్నప్పటి నుంచి ఇన్ని రోజులు ఎప్పుడూ ఇంట్లోలేనని అంటున్న నిఖత్.. ప్రస్తుతం అక్క కూతురుతో కాలక్షేపం చేస్తున్నట్లు చెప్పింది.

(నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి)

**ఇన్నేండ్లలో ఇదే తొలిసారి**

బాక్సింగ్ కెరీర్‌గా ఎంచుకున్నప్పటి నుంచి ఇన్ని రోజులు ఎప్పుడూ ఇంట్లో లేను. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో గత నెల 16న ఢిల్లీ నుంచి ఇంటికొచ్చా. అప్పటి నుంచి బయటకు కూడా వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నా.. ఒక్కోసారి నేను జైల్లో ఉన్నానా అనే ఆలోచనలు వస్తున్నాయి. కానీ ఏం చేయగలం. ప్రస్తుత పరిస్థితి అలాంటిది. కొవిడ్-19 బారిన పడకుండా ఉండాలంటే ఇండ్లకే పరిమితమవడం మంచిది.

**పంచింగ్ బ్యాగ్ కూడా లేదు**

ఢిల్లీలో శిక్షణ తీసుకుంటున్న సమయంలో ఎప్పుడైనా ఇంటికి వస్తే.. షేక్‌పేట్ బాక్సింగ్ హాల్లో కాసేపు ప్రాక్టీస్ చేసేదాన్ని. ఇప్పుడు మాత్రం ఇంటి టెర్రస్‌పై చిన్న చిన్న వ్యాయామాలు చేస్తున్నా. పంచింగ్ బ్యాగ్ అందుబాటులో లేకపోవడంతో.. జంపింగ్, స్కిప్పింగ్, షాడో బాక్సింగ్‌తో సరిపెడుతున్నా. రెండు మూడు రోజుల కంటే ఎక్కువ ఎప్పుడూ ఇంట్లో లేను. అలాంటిది ఇన్నాళ్లు ఉండటం కొంచెం కొత్తగా అనిపిస్తున్నది.

**ప్రభుత్వాలు చెప్పేది మన మంచికే..**

విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలను అందరూ పాటించాలి. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టాలంటే.. లాక్‌డౌన్ సరైన మార్గం. ప్రజలంతా ఇండ్లలో ఉండటమే శ్రేయస్కరం. మహమ్మారిని తరిమికొట్టాలంటే.. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, సామాజిక దూరాన్ని పాటించాలి. వీలైనంత త్వరగా పరిస్థితులు మునుపటిలా మారాలని కోరుకుంటున్నా.



**జన్నత్‌తో టైమ్‌పాస్**

మా అక్క కూతురు (జన్నత్)తో కాలక్షేపం చేస్తున్నా. చిన్న పిల్లలతో ఆడుతుంటే సమయమే తెలియదు. సాధారణంగా ఎక్కువ టీవీ చూడను. నెట్‌ఫ్లిక్స్‌లో అప్పుడప్పుడు సినిమాలు చూస్తా. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్ నా ఫేవరెట్. బాక్సింగ్ దిగ్గజం మహ్మద్ అలీకి సంబంధించిన పుస్తకాలు చదువుతున్నా. అప్పుడప్పుడు ఇంటి పనుల్లో అమ్మకు సహాయపడుతున్నా.

అప్పుడలా... ఇప్పుడిలా...



బుట్టబొమ్మలా ఎంత అందంగా కనిపిస్తుందో కదా! చిన్ననాడు సంప్రదాయ (నీలం రంగు) దుస్తుల్లో, నేటి ఆధునిక ఫ్యాషన్‌లో మెరిసిపోతున్న ఈ అమ్మాయి మరెవరో కాదు మన మిథాలీరాజ్. కాలం మారినా తన స్టైల్ మారలేదంటూ రెండు ఫొటోలను కలిపి ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది ఈ హైదరాబాదీ.

## ట్రోఫీల ద్వారా విరాళం



**న్యూఢిల్లీ:** వయసు చిన్నదైనా.. సహాయంలో పెద్దమనసు చాటుకున్నాడు. ప్రమాదకర కరోనా వైరస్‌పై పోరాటంలో తాను కూడా భాగమవుతానంటూ 15 ఏండ్ల యువ గోల్ఫర్ అర్జున్ భాటి ముందుకొచ్చాడు. పలువురు క్రీడాకారుల నుంచి స్ఫూర్తి పొందుతూ పీఎం కేర్స్‌కు రూ.4.30 లక్షలు విరాళమిస్తున్నట్లు మంగళవారం ప్రకటించాడు. అయితే ఇప్పటి వరకు తన కెరీర్‌లో సాధించిన 102 ట్రోఫీలను ఇవ్వడం ద్వారా వచ్చిన మొత్తాన్ని దానం చేయడం విశేషం.

## ఈ విరామం ఒక చేదుమాత్ర




**న్యూఢిల్లీ:** ప్రమాదకర కరోనా వైరస్ కారణంగా ఏర్పడ్డ క్లిష్ట పరిస్థితులు ఒక చేదు మాత్ర లాంటిదని భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నాడు. తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న వేళ..మనమంతా మనో నిబ్బరంతో వ్యవహరించాలని సూచించాడు. 'కరోనా వైరస్ కారణంగా అందరూ ప్రభావితమవుతున్నారు. ఇది కేవలం క్రీడలకు పరిమితం కాలేదు. ప్రతి ఒక్కరు క్లిష్టమైన సమయాన్ని ఎదుర్కొనే అవకాశముంది. అయినా మనం శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి' అని గోపీ అన్నాడు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

నమస్తే తెలంగాణ
నిపుణ
[ హైదరాబాద్ ]
బుధవారం 8 ఏప్రిల్ 2020

**ఉపాధ్యాయ వృత్తి నోబుల్ ప్రొఫెషన్. ఒకప్పుడు బతకలేని బడి పంతులు నేడు బతుకు నేర్పినవాడు, నేర్పేవాడు అయ్యాడు. కేవలం ఆదాయమే కాకుండా ఆత్మ సంతృప్తినిచ్చేది ఉపాధ్యాయ వృత్తి. అయితే ఈ వృత్తిలో ప్రవేశించాలంటే ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసుకోవాలి. ఇంటర్‌తో ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ కోర్సులో చేరడానికి నిర్వహించే డీఈఈ సెట్ -2020 ప్రకటన విడుదలైన నేపథ్యంలో ఆ పరీక్షకు సంబంధించిన వివరాలు..**



# ఉపాధ్యాయ వృత్తికి గేట్‌వే
# డీఈఈసెట్-2020

### డీఈఈసెట్
- డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీ ఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (డీఈఈసెట్).
- ఇంటర్ అర్హతతో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించ దలచిన వారికి డీఈఈసెట్ గేట్‌వే. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో మంచి ర్యాంకు సాధిస్తే డీఈడీ కోర్సులో ప్రవేశం లభిస్తుంది. తర్వాత ఈ కోర్సు పూర్తిచేసి ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేయవచ్చు. వీటన్నింటికీ ఈ ప్రవేశపరీక్షలో ర్యాంకే కీలకం.

### ఎవరు రాయవచ్చు?
- **విద్యార్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించినవారు. ఈ సంవత్సరం ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాల సమయం నాటికి ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
- ఇంటర్‌లో ఓసీ/బీసీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులైతే సరిపోతుంది.
- ఇంటర్ వొకేషనల్ కోర్సు చేసినవారికి ఈ కోర్సు చేయడానికి అవకాశం లేదు.

### వయస్సు
- సెప్టెంబర్ 1కి అభ్యర్థికి 17 ఏండ్లు నిండి ఉండాలి.

### పరీక్ష విధానం
- పరీక్ష 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 మార్కులు.
- పరీక్ష తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాల్లో నిర్వహిస్తారు. అభ్యర్థి దరఖాస్తు సమయం లోనే ఏ మీడియంలో పరీక్ష రాస్తారో నిర్ణయించుకోవాలి.
- పరీక్ష మూడు పార్ట్‌లుగా ఉంటుంది.
- **పార్ట్-1లో** జనరల్ నాలెడ్జ్, టీచింగ్ ఆప్టిట్యూడ్‌పై 10 ప్రశ్నలు ఇస్తారు. 10 మార్కులు.
- **పార్ట్-2లో** జనరల్ ఇంగ్లిష్-10, జనరల్ తెలుగు-20 ప్రశ్నల చొప్పున మొత్తం 30 ప్రశ్నలు 30 మార్కులు.
- **పార్ట్-3లో** మ్యాథ్స్ నుంచి 20 ప్రశ్నలు, ఫిజికల్ సైన్సెస్ నుంచి 10, బయాలజికల్ సైన్సెస్ నుంచి 10, సోషల్ స్టడీస్ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. అంటే పార్ట్-3లో మొత్తం 60 ప్రశ్నలు 60 మార్కులు ఉంటాయి.
- **పార్ట్-3లో** ఆయా సబ్జెక్టుల ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో ఉంటాయి.
- డీఈఎల్ఈడీ పరీక్ష తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాల్లో నిర్వహిస్తారు. డీపీఎస్ఈ పరీక్ష ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే ఉంటుంది.
- 2020 టీఎస్ డీఈఈసెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.

### ఎలా ప్రిపేర్ కావాలి?
- **టీచింగ్ ఆప్టిట్యూడ్:** టీచింగ్ ఆప్టిట్యూడ్‌లో ఉపాధ్యాయ వృత్తి పట్ల అభ్యర్థికి ఉండే అభిరుచి, సహజ సామర్థ్యాలను పరిశీలించే అంశాలు ఉంటాయి. ఇందులో నేడు మారుతున్న విద్యావిధానంపై అవగాహనకు సంబంధించిన ప్రశ్నలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి రూపొందించే పథకాలు, ప్రస్తుతం పాఠశాలల్లో అమలవుతున్న విద్యా కార్యక్రమాలతోపాటు నూతన మూల్యాంకన విధానం, తరగతి నిర్వహణ, జాతీయ ప్రణాళికా చట్టం-2005, విద్యాహక్కు చట్టం-2009 మొదలైన వాటిపై ప్రశ్నలు ఇస్తారు. దీని కోసం పై అంశాలపై పట్టుసాధించాలి.
- **జనరల్ నాలెడ్జ్:** దీనిలో జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ అంశాల నుంచి వర్తమాన అంశాలు వస్తాయి. దీనికోసం ప్రతిరోజూ వార్తాపత్రికలను చదవడం, వాటిలో ముఖ్యమైన సమాచారాన్ని నోట్స్‌గా రాసుకోవడం చేయాలి. అదేవిధంగా స్టాండర్డ్ జీకే నుంచి దేశాలు-రాజధానులు, దేశాలు-కరెన్సీ, వివిధ రకాల గ్రంథాలు, క్రీడలు, దేశాలు-పార్లమెంటులు, వివిధ రకాల నాట్యరీతులు, కొత్తపేర్లు-పాత పేర్లు, శాస్త్రీయ అధ్యయనాలు, విటమిన్ల లోపం వల్ల కలిగే వ్యాధులు, విటమిన్లు లభించే పదార్థాలు మొదలైన అంశాలను చదవాల్సి ఉంటుంది. దీనికోసం పాత ప్రశ్నపత్రాలను ఒక్కసారి పరిశీలిస్తే ఏయే అంశాలపై ప్రశ్నలు ఇస్తున్నారో అవగతమవుతుంది.
- **ఇంగ్లిష్:** దీనిలో మంచి మార్కులు సాధించాలంటే గ్రామర్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా పదోతరగతి స్థాయిలో చదువుకున్న గ్రామర్ అంశాలైన.. టెన్సెస్, వాయిస్, వొకాబులరీ, ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, రిపోర్టెడ్ స్పీచ్, సింపుల్, కాంపౌండ్, కాంప్లెక్స్ సెంటెన్సెస్ మొదలైన అంశాలను అర్థం చేసుకుని, మాదిరి ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.



- **పార్ట్-3:** దీనిలో మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ అంశాలను పదోతరగతి స్థాయిలో ఇస్తారు. కాబట్టి 8, 9తోపాటు పదోతరగతి పుస్తకాలను బాగా ప్రిపేర్ కావాలి.
- ప్రతిరోజూ అన్ని సబ్జెక్టులకు సరైన సమయం కేటాయించి ప్రిపేరైతే మంచి మార్కులు సాధించవచ్చు.
- మాదిరి ప్రశ్నపత్రాలను డీఈఈసెట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### సీట్ల కేటాయింపు
- రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్ కాలేజీల్లో అన్ని సీట్లను డీఈఈసెట్ ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. అదే విధంగా ప్రైవేట్, అన్ ఎయిడెడ్, నాన్ మైనార్టీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లలో కేటగిరీ ఏ కింద 80 శాతం సీట్లను డీఈఈసెట్ ర్యాంక్ ద్వారా భర్తీ చేస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** పాత పది జిల్లా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

### ఉద్యోగ అవకాశాలు
- ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేవీ, ఎన్‌వీఎస్‌లతోపాటు ఆర్మీ ఇతర కేంద్ర పాఠశాలల్లో ఉద్యోగానికి అర్హులు. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రైమరీ, ప్రీప్రైమరీ పాఠశాలలో టీచర్‌గా పనిచేయవచ్చు. వీరు సీటెట్/టెట్‌లో కూడా అర్హత సాధించాల్సి ఉంటుంది. పలు కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్‌లో అపారంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

### ముఖ్యతేదీలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 27
- **ఫీజు:** రూ.450/-
- **పరీక్షతేదీ:** మే 22
- **ఫలితాల వెల్లడి:** మే 29
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** http://www.deecet.cdse.telangana.gov.in.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

# డీట్ ఉద్యోగ సమాచారం

**వివిధ ప్రైవేటు సంస్థలు ఆఫర్ చేస్తున్న ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే మీ ఫోన్‌లో DEET Appను ఇన్‌స్టాల్ చేసుకుని ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి.**

కంపెనీ: అపోలో హాస్పిటల్స్
- **పొజిషన్:** ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్
- **ఖాళీలు:** 20
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 3 నుంచి 6 ఏండ్లు

కంపెనీ: ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్
- **పొజిషన్:** సేల్స్ ఎగ్జిక్యూటివ్
- **ఖాళీలు:** 10
- **లొకేషన్:** తెలంగాణ వ్యాప్తంగా
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి 3 ఏండ్లు

కంపెనీ: లియో మార్‌కామ్
- **పొజిషన్:** ఇన్‌సైడ్ సేల్స్ ఎగ్జిక్యూటి
- **ఖాళీలు:** 8
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 1 నుంచి 5 ఏండ్లు

కంపెనీ: విశంబి సొల్యూషన్స్
- **పొజిషన్:** గ్రాఫిక్ డిజైనర్
- **ఖాళీలు:** 10
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి 3 ఏండ్లు

కంపెనీ: సేల్స్ ఫోర్స్ ఇండియా
- **పొజిషన్:** హెచ్ఆర్ రిక్రూటర్స్ అండ్ స్టోర్ మేనేజర్స్
- **ఖాళీలు:** 8
- **లొకేషన్:** నోయిడా (ఉత్తరప్రదేశ్)
- **అర్హతలు:** బీఈ/బీటెక్, బీఎస్సీ, బీకాం, బీఏ
- **అనుభవం:** 1 నుంచి 3 ఏండ్లు

కంపెనీ: సువర్ణభూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్
- **పొజిషన్:** ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ అండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్
- **ఖాళీలు:** 30
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి ఏడాది

కంపెనీ: ఇన్ఫో గ్రోత్ ప్రైవేట్ లిమిటెడ్
- **పొజిషన్:** ప్రాసెస్ అసోసియేట్స్ (వాయిస్, నాన్ వాయిస్)
- **ఖాళీలు:** 100
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి 2 ఏండ్లు

కంపెనీ: మ్యాట్రిమోని.కామ్
- **పొజిషన్:** టెలీసేల్స్ ఎగ్జిక్యూటివ్



- **ఖాళీలు:** 20
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి ఏడాది

కంపెనీ: బ్లూ స్టార్ లిమిటెడ్
- **పొజిషన్:** షాప్ సేల్స్ రిప్రజంటేటివ్
- **ఖాళీలు:** 15
- **లొకేషన్:** ఆంధ్రప్రదేశ్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 1 నుంచి 4 ఏండ్లు

కంపెనీ: ఎస్‌బీఎల్ టెక్నాలజీ
- **పొజిషన్:** సేల్స్ ఆఫీసర్
- **ఖాళీలు:** 50
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** బీఈ/బీటెక్, ఎంబీఏ
- **అనుభవం:** 0 నుంచి 2 ఏండ్లు

కంపెనీ: పీవీఆర్ సినిమాస్ లిమిటెడ్
- **పొజిషన్:** డ్యూటీ మేనేజర్, సినిమా మేనేజర్
- **ఖాళీలు:** 10
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి 2 ఏండ్లు

కంపెనీ: హ్యాపీమైండ్స్ మ్యాన్‌పవర్ సొల్యూషన్స్
- **పొజిషన్:** నాన్ వాయిస్ ప్రాసెస్
- **ఖాళీలు:** 30
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి ఏడాది

కంపెనీ: టీఆర్ ట్రెయినింగ్ అండ్ కన్సల్టింగ్ సర్వీసెస్
- **పొజిషన్:** అసిస్టెంట్ బిజినెస్ డెవలప్‌మెంట్, సేల్స్ కన్సల్టెంట్
- **ఖాళీలు:** 9
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 2 నుంచి 5 ఏండ్లు

కంపెనీ: సింపుల్ సొల్యూషన్స్ హెర్ఆర్‌డీ సర్వీస్
- **పొజిషన్:** కస్టమర్‌కేర్ ఎగ్జిక్యూటివ్
- **ఖాళీలు:** 200
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి 2 ఏండ్లు

కంపెనీ: వెల్టిస్ గ్లోబల్ లిమిటెడ్
- **పొజిషన్:** మెషీన్ ఆపరేటర్స్
- **ఖాళీలు:** 30
- **లొకేషన్:** తెలంగాణ
- **అర్హతలు:** టెన్త్, ఇంటర్, బీఏ, బీఈ/బీటెక్, డిప్లొమా, ఐటీఐ
- **అనుభవం:** 0 నుంచి 20 ఏండ్లు

కంపెనీ: జీ4ఎస్ సెక్యూరిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్
- **పొజిషన్:** సెక్యూరిటీ గార్డ్
- **ఖాళీలు:** 1000
- **లొకేషన్:** తెలంగాణ వ్యాప్తంగా
- **అర్హతలు:** టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా
- **అనుభవం:** 0 నుంచి 20 ఏండ్లు

కంపెనీ: హిందూజా గ్లోబల్ సొల్యూషన్స్
- **పొజిషన్:** బీపీఓ టెలీకాలర్స్
- **ఖాళీలు:** 30
- **లొకేషన్:** కొండాపూర్ (హైదరాబాద్)
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి ఏడాది

కంపెనీ: పేటీఎం
- **పొజిషన్:** టీం లీడర్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్
- **ఖాళీలు:** 60
- **లొకేషన్:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి 4 ఏండ్లు

కంపెనీ: పేటీఎం
- **పొజిషన్:** ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్
- **ఖాళీలు:** 50
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి 3 ఏండ్లు

కంపెనీ: విక్డ్ రైడ్
- **పొజిషన్:** ఇన్‌స్పెక్షన్ ఎగ్జిక్యూటివ్
- **ఖాళీలు:** 60
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి ఏడాది

కంపెనీ: ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ
- **పొజిషన్:** కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్
- **ఖాళీలు:** 50
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 1 నుంచి 5 ఏండ్లు

కంపెనీ: ఏరువాక టెక్నాలజీస్
- **పొజిషన్:** ఫీల్డ్ సర్వీస్ ఇంజినీర్
- **ఖాళీలు:** 5
- **లొకేషన్:** విజయవాడ, ఆంధ్రప్రదేశ్
- **అర్హతలు:** బీఈ/బీటెక్, డిప్లొమా, బీఎస్సీ, ఐటీఐ
- **అనుభవం:** 0 నుంచి 3 ఏండ్లు

కంపెనీ: ఎస్‌బీఎల్ టెక్నాలజీస్
- **పొజిషన్:** ఇన్‌సైడ్ సేల్స్
- **ఖాళీలు:** 30
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి 7 ఏండ్లు

కంపెనీ: ఎవాన్‌ప్లెక్స్ ప్రైవేట్
- **పొజిషన్:** మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్
- **ఖాళీలు:** 10
- **లొకేషన్:** హైదరాబాద్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ
- **అనుభవం:** 0 నుంచి 4 ఏండ్లు

**మరిన్ని వివరాలకు సంప్రదించండి**
Email: help@tsdeet.com <mailto:help@tsdeet.com>, Website: www.tsdeet.com <http://www.tsdeet.com>
Phone: 8639217011, Email: info@workruit.com <mailto:info@workruit.com>, Website: www.workruit.com <http://www.workruit.com>
Phone: 8688519317

# This is not a cidarian?

**1. All of the following animals are ureotelic except ?**
1) Snake 2) Frog
3) Turtle 4) Toad

**2. Human urine is usually acidic because ?**
1. The sodium transporter exchanges one hydrogen ion for each sodium ion in peritubular capillaries
2. Potassium and sodium exchange generates acidity
3. Hydrogen ions are actively secreted into the filtrate
4. Excreted plasma proteins are acidic

**3. The 'U' shaped bone present at the base of the buccal cavity is**
1) Hyoid 2) Malleus
3) Zygomatic 4) Ethmoid

**4. Choose the wrongly matched pair**
1) Isotropic band - Action
2) Anisotropic band - Myosin
3) Central part of I-band- M-line
4) Central part of A-band - H-zone

**5. The T-wave in an ECG represents**
1) Biginning of systole
2) Depolarisation of ventricles
3) Electrical excitation of atria
4) Return of the ventricles from excited

**6. Proximal convoluted tubule of nephron is responsible for**
1) Filtration of blood
2) Reabsorption of salts only
3) Maintenance of glomerular filtration rate
4) Selective reabsorption of glucose, amino acid, NaCl, Water

**7. The following is/are removed during haemodialysis**
1) Urea
2) Glucose
3) Amino acids
4) All of these

**8. Which one of the following components of urine in a healthy human does not differ much in concentration from that of blood plasma?**
1) $NH^{+}{}_4$
2) $K^+$
3) $Na^+$
4) $SO^{2-}{}_4$

**9. Which one of the following group of animals is homoeothermic?**
1) Birds
2) Fishes
3) Reptiles
4) Amphibians




**10. Who has opposable thumbs?**
1) Platypus
2) Kangaroo
3) Mole
4) lemur

**11. Which of the following animals is not viviparous ?**
1) Whale
2) Elephant
3) Platypus
4) Flying fox (Bat)

**12. In hemichordates buccal diverticulum extends in to the**
1) Pharynx
2) Proboscis
3) Trunk
4) Ventral ridge

**13. A jawless fish, which lays eggs in fresh water & whose ammocoete larvae after metamorphosis return to ocean is**
1) Entatretus
2) Myxine
3) Neomyxine
4) Petromyzon

**14. Choose the correct statement (NEET-UG-2016)**
1) All mammals are viviparous
2) All Reptiles have a three-chambered heart
3) All Pisces have gills covered by an operculum
4) All cyclostomes do not possess jaws paired fins

**15. The number of digits in the limb used for walking by reptiles are**
1) 1 2) 2 3) 5 4) 6

**16. Which one of the following statements is wrong ?**
1) Insects have one pair of antenna
2) Prawns have two pairs of antenna
3) Millipede possess two pairs of appendages in each segment of the body
4) Animal belonging to the phylum porifera have nematocyst

**17. This is not a cnidarian ?**
1) Obelia 2) Jellyfish
3) Sea anemone
4) Beroe

**18. What is the range of length of sponges ?**
1) 1 mm - 10 mm
2) 1 cm - 1 metre
3) 1 mm- 100 mm
4) 1 metre - 10 metre

**19. Coelom is lined on all sides by**
1) Ectoderm
2) Mesoderm
3) Endoderm
4) Ectoderm&Endoderm

**20. Read the following statements**
A) A symmetrical animals cannot be cut into two equal parts (and timers) in any plane
B) Most sponges & adult gastropods are asymmetrical
C) A symmetry cannot be said to be an adaption/advantage to an organism
D) Most of the asymmetrical organisms develop complex sensory locomotor functions
**which of the above are true ?**
1) B, C, D 2) A, C, D
3) A, B, D 4) A, B, C

**21. In 'S'- phase of the cell cycle ?**
1) Amount of DNA is reduced to half in each cell
2) Amount of DNA remains same in each cell
3) Amount of DNA doubles in each cell
4) Chromosome number is increased

**22. The enzyme recombinase is required at which stage o meiosis ?**
1) Zygotene 2) Diplotene
3) Pachytene 4) Diakinesis

**23. Assertion (A):** Physalia is a polymorphic form
**Reason (R):** Physalia has different types of zooids
1) Both A & R are correct, R is the correct explantion of A
2) Both A & R are correct, R is not the correct explanation of A
3) A is true but R is false
4) A is false but R is true

**24. Substance of an enzymes is**
1) The reactant of the reaction catalysed by the enzyme
2) Uncompetitive inhibitor of the enzyme
3) Competitive inhibitor of the enzyme
4) Prosthetic group of the enzyme

**25. Which of the following statements regarding enzymes is not true ?**
1) Enzymes lower the activation energy of reaction
2) Enzymes speed up the attainment of equilibrium of the reaction
3) Enzyme change the value of equilibrium constant of the reaction
4) All of the above

**26. In the nomenclature of enzyme restriction endonuclease the Roman numerical indicates ?**
1) Number of cuts on DNA
2) Number of times it is used
3) Number of recombinants formed
4) The order of discovery from source

**27. A non-proteinaceous enzyme is**
1) Ligase
2) Lysozyme
3) Ribozyme
4) Deoxyribonuclease

**28. The ctenophores are classified on the basis of**
1) Body shape
2) Bioluminescence
3) Parellel cells
4) Aboral tentacles

**29. Third stage of larva of wuchereria bancrofti carried by culex mosquito is called**
1) Cysticercus
2) Microfilaria
3) Merozoite
4) Trophozoite

### Answers

| | | | |
|---|---|---|---|
| 1-1, | 2-3, | 3-1, | 4-3, |
| 5-4, | 6-4, | 7-1, | 8-4, |
| 9-1, | 10-4, | 11-3, | 12-2, |
| 13-4, | 14-4, | 15-3, | 16-4, |
| 17-4, | 18-2, | 19-2, | 20-4, |
| 21-3, | 22-3, | 23-1, | 24-1, |
| 25-3, | 26-4, | 27-3, | 28-4, |
| 29-2, | | | |



Modala Mallesh
Subject Expert
Palem, Nakerkal,
Nalgonda
9989535675